ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం
ఏర్పడేదాక

5


2010

నెలనెలా వెలువడే
పుస్తకాల్లో ఇది 16వది

అంతర్జాతీయ పరిణామాలు

దేశీయ మానవ సంబంధాలు

సాహిత్యం సంస్కృతి సామాజిక శాస్త్రాలు



సామాజిక తత్వవేత్త

బి.ఎస్.రాములు

✆ : 9391036987

Price : Rs.30/-

సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం

403, సాయిలక్ష్మి రెసిడెన్సీ, 2-2-647/90, ఎక్సైజ్ కాలనీ,
బాగ్అంబర్‌పేట్, హైదరాబాద్ - 500 013.

విషయ సూచిక

అంకితం

తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, రిటైర్డ్ లెక్చరర్,
రచయిత, చరిత్రకారుడు
వంగా నర్సయ్య, వరంగల్ గారికి ...

అంతర్జాతీయ పరిణామాలు

దేశీయ మానవ సంబంధాలు

సాహిత్యం సంస్కృతి సామాజిక శాస్త్రాలు

బి.ఎస్.రాములు

✆ : **040-30608355, 9391036987**
e-mail : bsramulu@gmail.com

ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి, 2010

డిటిపి : ఏవిఎమ్ గ్రాఫిక్స్, 9440096321

Publishers & Distributors:
University of Social Philosophy
403, Sai Lakshmi Residency,
2-2-647/90, Central Exise Colony,
Bagh Amberpet, Hyderabad - 500 013.

2-2-186/53/5, R.K. Nagar,
Bagh Amberpet, Hyderabad - 500013.

1. ప్రపంచీకరణ పరిణామాలు

ప్రపంచీకరణతో మలుపు తీసుకున్న అంతర్జాతీయ పరిణామాల కారణంగా 1995 ముందు భారతదేశం వేరు. 1995 తరువాత ఉన్న భారతదేశం వేరు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, గ్రామీణ, సమాచార రంగాల్లో చాలా మార్పులు వచ్చాయి. రవాణా సౌకర్యాలు పెరిగాయి. 1995కు ముందు మన భారతదేశం ఋణగ్రస్త భారతదేశం, అప్పుల భారతదేశం, ఆ తరువాత అప్పులు ఉన్నప్పటికీ దశాబ్దం అమెరికా యూరప్ దేశాలు కూడా భారతదేశంలోని మానవ సంపదవైపు, వాటి నైపుణ్యాల వైపు ఆసక్తికరంగా, అసూయతో చూసిన కాలం. ఈ దశాబ్దం భారతదేశం కొన్ని రంగాల్లో ప్రపంచంలోనే గుర్తింపు పొందే విధంగా విజయాలు సాధించిన దశాబ్దం.

సైన్సు, టెక్నాలజీ – సామాజిక పరిణామాల మధ్య సంబంధం

సమాజ పరిణామాలే సాహిత్య, కళా రంగాలకు, సామాజిక శాస్త్రాలకు మూలవస్తువు. సైన్సు, టెక్నాలజీ, ఉత్పత్తి విధానాలు, మానవ సంబంధాలు, మతం, కులం, వర్గం, తాత్విక దృక్పథాలు, విలువలు, సంస్కృతి, మానవ సమాజ పరిణామాలను నిర్దేశిస్తుంటాయి. సాహిత్యంలో రచయితల సామర్థ్యాన్ని అనుసరించి అవి చిత్రితమవుతుంటాయి. మానవ సమాజం సాధించిన విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధిని సైన్సు, టెక్నాలజీ, పారిశ్రామిక అభివృద్ధి, సామాజిక శాస్త్రాలు తెలుపుతాయి. అవి ఎవరి జీవితంలో ఏ మేరకు ప్రవేశించాయో, మార్చాయో, సౌఖ్యవంతం చేశాయో మానవ సంబంధాలు, సాహిత్యం, కళలు, సినిమాలు, టీవీ ప్రక్రియలు, సెల్‌ఫోన్, ఏటిఎమ్ కార్డులు, ఇంటర్‌నెట్ చక్కగా తెలుపుతాయి. అవి అందని క్రమాన్ని కూడా పట్టి ఇస్తాయి. వస్తువు, శిల్పం, ప్రక్రియలు సమాజ స్థాయిననుసరించి, చైతన్యాన్ని అనుసరించి, సామాజిక పరిణామాలను అనుసరించి రూపొందుతుంటాయి. సాహిత్య, కళ, సినిమా, టీవీ, మీడియా రంగాలతో పాటు సామాజిక శాస్త్రాలలోని పరిణామాలను తెలుసుకోవడానికి, అధ్యయనం చేయడానికి కూడా సామాజిక పరిణామాలను అధ్యయనం చేయడం అవసరం.

1990 నుండి దేశంలో సరళీకృత ఆర్థిక విధానాల వల్ల, దేశ, విదేశీ పరిశ్రమల ఉత్పత్తి విలువతో పాటు ప్రైవేటీకరణ వల్ల, కాంట్రాక్టుల వల్ల, ప్రైవేటు విద్యాసంస్థల వల్ల, బార్లు, రెస్టారెంట్లు, హోటళ్లు, సినిమాలు, టీవీ ఛానళ్లు, పత్రికలు, ఆఫ్‌సెట్ ప్రెస్‌లు, రియల్ ఎస్టేట్, అపార్ట్‌మెంట్ల సంస్కృతి, ప్రైవేటు సెల్‌ఫోన్లు, ప్రైవేటు సిమెంట్ ఫ్యాక్టరీలు తదితర వ్యాపారాల వల్ల, సేవా రంగాల వల్ల నూతన సంపన్న వర్గాలు, పారిశ్రామిక వర్గాలు ఎదుగుతూ వచ్చాయి. సమాచారం, ప్రసారం, కంప్యూటర్ రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు వచ్చిన కాలం కూడా ఈ దశాబ్దమే.

1995–2005 దశాబ్దం విశిష్టత

1995–2005 దశాబ్దానికి దేశంలో, ప్రపంచంలో ఒక విశిష్టత, ప్రత్యేకత చేకూరింది. ఒక సహస్రాబ్ది ముగింపు, నూతన సహస్రాబ్ది ప్రారంభం, వాటి తాలూకు పరిణామాల వల్ల ఈ దశాబ్ది ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. గ్లోబలైజేషన్ 1990లో ప్రారంభమైనప్పటికీ జీవితంలో విస్తరిస్తూ జీవితంలో భాగమై కొనసాగడం 1995 నుండి అన్ని దేశాల్లో చూడవచ్చు. అలా ప్రపంచం ఒకే విధంగా ముందుకు సాగిన క్రమాన్ని కూడా 1995–2005 దశాబ్దం తెలుపుతుంది. ఇలా ఈ దశాబ్దానికి మరెన్నో ప్రత్యేకతలు, విశిష్టతలు వున్నాయి. అవన్నీ ప్రపంచ చరిత్రలో ఎంతో ప్రాధాన్యత గలవి.

గ్లోబలైజేషన్ అనేది కొంతమంది భావిస్తున్నట్లు కొన్ని దేశాల ఆధిక్యతావాదం మాత్రమే కాదు. దానికే పరిమితమై లేదు. ఆ మాటకొస్తే ప్రపంచీకరణ తరువాత అమెరికా కూడా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతింది. వంద బ్యాంకులు దివాళా తీశాయి. ప్రపంచంలోనే పేరెన్నికగన్న మల్టీ నేషనల్ కంపెనీలు దివాళా ప్రకటించాయి. మరోవైపు ఎవరూ ఊహించని విధంగా ప్రపంచీకరణలో చైనా రోజురోజుకు బలపడుతూ అమెరికాకు అప్పులిచ్చే స్థాయికి ఎదిగింది. చైనా ఎగుమతులు పెరిగి అమెరికా మాన్యుఫ్యాక్చరింగ్ రంగం మూలకు పడి లక్షలాది మంది ఉపాధి కోల్పోయారు. ఇండియా నుండి కూడా అమెరికాకు ఎగుమతులు, సేవలు, వలసలు పెరిగాయి. చైనా, ఇండియా, జపాన్, కొరియా ఉత్పత్తులు, సేవలు, మానవ నైపుణ్యం యూరప్, అమెరికా దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అమెరికా మార్కెట్‌లో 70 శాతం పైగా చైనా ఉత్పత్తులు విస్తరించాయి. ఇండియా ఉత్పత్తులు 40 శాతం దాకా పెరిగి తరువాత బాగా తగ్గు ముఖం పట్టాయి. క్వాలిటీలో చూపించేదొకటి, సప్లయ్ చేసేదొకటి కావడం వల్ల ఇండియాను మోసగాళ్ళని భావించడం వల్ల ఎగుమతులు బాగా తగ్గిపోయాయి. తద్వారా ఇండియాలో ఉపాధి తగ్గిపోయి లక్షలాది మంది నిరుద్యోగానికి, ఆకలి చావులకు చేరువయ్యారు. ఇది ప్రపంచీకరణ ప్రభావం కాకుండా మార్వాడి, గుజరాతి పారిశ్రామిక వేత్తల, వ్యాపారుల దగుల్బాజి మోసాలవల్ల ఉత్పన్నమైన పరిణామం. అమెరికా కార్ల కంపెనీలు మూతపడుతూ జపాన్ కార్ల అమ్మకాలు అమెరికాలో పెరుగుతూ వస్తున్నాయి.

ఇలా ప్రపంచీకరణ ద్వారా సరుకుల మార్కెట్‌కు దేశాల వారీగా గల నిబంధనలు చాలామేరకు తొలగిపోయి నైపుణ్యంలో, నాణ్యతలో, సరుకుల ధరలో ప్రపంచ స్థాయిలో ప్రతి దేశం, ప్రతి కంపెనీ, ప్రతి ఉత్పత్తి పోటీ పడాల్సిన అనివార్యత ముందుకు వచ్చింది. అందువల్ల వెనుకబడిన ఉత్పత్తి విధానాలు, ఉత్పత్తి నైపుణ్యాలు, అధిక ధరలు, లైసెన్సింగ్ విధానం ద్వారా, ప్రభుత్వాలు ఎగుమతి, దిగుమతులను కట్టడి చేయడం ద్వారా ఆయా దేశాల ఉత్పత్తిదారులు, వ్యాపారులు, లాభాలు ఆర్జించే దశ అంతరించింది. ప్రపంచ మార్కెట్‌లో పోటీపడగలిగి నప్పుడే దేశీయ మార్కెట్‌లో తమ వాటాను నిలుపుకొనే, పెంచుకొనే ఆవశ్యకత ముందుకు వచ్చింది. ప్రపంచీకరణ మార్కెట్ రంగంలో, సరుకుల ఎగుమతి, దిగుమతి రంగంలో, ఉత్పత్తిలో ఈ మౌలికమైన పరిణామాలను ముందుకు తెచ్చింది. ప్రపంచ స్థాయిలో సరుకులను మార్కెట్ చేసే ఇలాంటి అవకాశాల కోసం రెండు ప్రపంచ

యుద్ధాలు జరిగాయి. ప్రపంచీకరణను వ్యతిరేకించే వాళ్ళు రెండు ప్రపంచ యుద్ధాల కారణాలను కన్వీనియంట్‌గా మర్చిపోతున్నారు. మభ్య పెడుతున్నారు.

1914–18, 1938–44 ఇలా మధ్య జరిగిన రెండు ప్రపంచ యుద్ధాలు ప్రపంచ దేశాల్లో తమ సరుకుల ఎగుమతి కోసం, మార్కెట్ అవకాశాల విస్తరణ కోసం, ఆధిపత్యం కోసం, వనరుల కోసం సాగిన యుద్ధాలు అని అందరికీ తెలుసు. రెండు ప్రపంచ యుద్ధాల్లో పదకొండు కోట్ల ప్రజలు మరణించారు. ప్రపంచం మునుపెన్నడూ లేనంత సంక్షోభాన్ని, సంఘర్షణని, మారణ హోమాన్ని ఆ యుద్ధాలు ముందుకు తెచ్చాయి. ఇలా మళ్ళీ జరగకూడదని మానవ మేధస్సు ప్రపంచ వ్యాప్తంగా ఇందుకు పరిష్కారాలను చర్చించింది. పర్యవసానంగా చర్చలు, సంప్రదింపుల ద్వారా, ఒప్పందాల ద్వారా శాంతియుతంగా సాగించుకోవచ్చని ఐక్యరాజ్యసమితిని ఆయా దేశాల కూటాలను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. అభివృద్ధి చెందిన దేశాలు, చెందుతున్న దేశాలు, వెనుకబడిన దేశాలు అనే వర్గీకరణతో కూటాలు ఏర్పడ్డాయి.

మార్కెట్ల కోసం, ఆధిపత్యం కోసం, వనరుల కోసం సాగిన రెండు ప్రపంచ యుద్ధాల నాటి కారణాలను గ్లోబలైజేషన్ తాత్విక స్థాయిలో పూర్తి స్థాయి పరిష్కారాన్ని ముందుకు తెచ్చింది. అన్ని దేశాలు, ప్రాంతాలు, జాతులు కాలంలో కొంత అటూ ఇటూ అయినా అందరు ఎదగాల్సిన క్రమానికి పోటీలో దిగి తమవంతు గెలుపును సాధించుకోడానికి గ్లోబలైజేషన్ ఒక అనివార్య స్థితిని ముందుకు తెచ్చింది.

1985 నుండి గ్లాస్‌నాస్ట్, డంకెల్, ప్రపంచీకరణ ఒప్పందాలు జరిగాయి. ప్రపంచంలోని చాలా దేశాలు దీనికి అంగీకరించి సంతకాలు చేసాయి. 1995 నుండి ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవితంలో, ఉపాధిలో, సంస్కృతిలో, ఉత్పత్తి విధానాల్లో, మానవ సంబంధాల్లో ఇది ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తూ వస్తున్నది.

శిథిలమవుతున్న వృత్తులు–సంస్కృతులు

ప్రపంచంలో అంతదాకా వున్న సాంప్రదాయక వృత్తులు, సంస్కృతులు, మార్కెట్ విధానాలు, ఉత్పత్తి విధానాలు, జీవన విధానాలు, మానవ సంబంధాలు అన్నీ మౌలికమైన మార్పులకు లోనవుతున్నాయి. పాతబడిపోయినవి శిథిలమవుతున్నాయి, ధ్వంసమవుతున్నాయి. వాటిపై ఆధారపడి బతికే జాతులు, దేశాలు, వర్గాలు, మనుషులు శిథిలమవుతున్నారు, ధ్వంసమవుతున్నారు.

ప్రపంచ స్థాయికి అనివార్యంగా ఎదగకపోతే పండుటాకుల్లా, ఎండుటాకుల్లా రాలిపోవాల్సిన అనివార్యత ముందుకు వచ్చింది. ప్రపంచంలో మునుపెన్నడూ ఇలాంటి దశ ఎదురు కాలేదు. గిరిజనులు పారిశ్రామిక యుగంలో కూడా వేలయేళ్ల వెనుకబాటు జీవితాన్ని కొనసాగించారు. గ్లోబలైజేషన్‌లో ఇలాంటివన్నీ శిథిలమవుతున్నాయి, ధ్వంసమవుతున్నాయి. అందరితో పాటు పరిగెత్తక తప్పదు. కొత్తగా తనను తాను మలుచుకోక తప్పదు. జీవితాన్ని ప్రపంచంతో పోటీపడి గెలుచుకోక తప్పదు. ఇలా ప్రత్యక్షంగా, పరోక్షంగా

మనుషులందర్నీ సమానమే అని సమానంగా ఎదగాలని బ్రహ్మరాక్షసిలా గ్లోబలైజేషన్ వెంటపడి తరుముతున్నది. దానికాళ్ల కింద ఎందరో నలిగిపోతున్నారు.

1995-2005 దశాబ్దం భారతీయ గ్రామీణ వ్యవస్థను, వృత్తి కులాలను, వ్యవసాయాన్ని, కుటీర పరిశ్రమలను నిశ్శబ్ద తుపానులా అల్లకల్లోలం చేసిన దశాబ్దం. వారి జీవితాలు అతలాకుతలమై తునాతునకలైపోయాయి. నేడు ప్రపంచ వ్యాప్తంగా వందకోట్ల మంది ప్రజలు మరణానికి చేరువగా వున్నారు. ఇలా రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో 1938-1946 మధ్య జరిగిన సంక్షోభాల కన్నా తీవ్రమైన నిశ్శబ్ద సంక్షోభాలు ప్రజల జీవితాలను సుడిగుండాల్లో పడవేశాయి. రెండు ప్రపంచ యుద్ధాల్లో 11 కోట్ల మంది దాకా యువకులు, సైనికులు, పిల్లలు, వృద్ధులు, పౌరులు చనిపోయారు. పారిశ్రామిక, వ్యాపార, రాజకీయ, అధికార విస్తరణ కోసం, సాంస్కృతిక ఆధిపత్యాల కోసం యూరప్ ప్రభుత్వాధినేతలు, పారిశ్రామికవేత్తలు ఈ యుద్ధాలకు కారకులయ్యారు. వినాశనానికి దారితీశారు. ప్రపంచం వేల ఏళ్లల్లో ఎన్నడూ ఎరుగని భయోత్పాతం, విధ్వంసం రెండు ప్రపంచ యుద్ధాల్లో జరిగాయి. మానవ సమాజం దాన్నుంచి ఎన్నో గుణపాఠాలు తీసుకుంది. ప్రజాస్వామ్యం విలువ, స్వేచ్ఛాయుత సమాజం, శాంతియుత సహజీవనం ప్రాధాన్యత తెలిసివచ్చింది. దాంతో ఐక్యరాజ్యసమితి ఏర్పడింది. ప్రపంచ దేశాలన్నీ ఒకచోట మాట్లాడుకోవటానికి, కలుసుకోవటానికి ఇలా అనేక రంగాల్లో, అనేక వేదికలు ఏర్పడ్డాయి. ఈ అన్ని వేదికల్లో అమెరికా, యూరప్ దేశాల ఆధిపత్యం కనిపిస్తుంది.

1946కు ముందున్న ప్రపంచం వేరు

చాలా మందికి చరిత్రలో ఇప్పటికీ అర్థం కాని విషయం ఒకటుంది. రెండు ప్రపంచ యుద్ధాలు జరగకముందు వున్న వేల యేళ్ల చరిత్ర రాజ్యాలు, సామ్రాజ్యాలు, యుద్ధాలు, ఓటమి, గెలుపులు, ఒప్పందాలుగా ఒకే విధంగా, ఒకే సూత్రంపై సాగాయి. కానీ రెండు ప్రపంచ యుద్ధాల గుణపాఠాలు మానవ సమాజాన్ని దీన్నుండి బయటపడవేశాయి. దురాశాపరులకు అడ్డుకట్ట వేసాయి. బెర్ట్రండ్ రసెల్ వంటి ఎందరో తత్వవేత్తలు, మేధావులు, నాయకులు ఐక్యరాజ్యసమితి వంటి తాత్వికతను ముందుకు తెచ్చి దానికి రూపం ఇచ్చి అస్తిత్వంలోకి రావడానికి కృషి చేశారు. ఆ తరువాత ప్రపంచం శాంతియుత, స్థిరమైన సరిహద్దులతో అన్ని దేశాలు, రాజ్యాలు ఒకే వేదికపై కలిసి చర్చించుకునే అవకాశం ఏర్పడింది. ఐక్యరాజ్య సమితి మరోమాటలో చెప్పాలంటే ప్రపంచాన్ని ఒక ఫెడరల్ దేశంగా మార్చివేసింది. ఇంతటి మౌలికమైన మార్పు రెండు ప్రపంచ యుద్ధాల తరువాత సంభవించింది.

అందువల్ల 1946 దాకా వున్న ప్రపంచం వేరు, 1946 నుండి 1965 దాకా కొనసాగిన ప్రపంచం వేరు. రెండు ప్రపంచ యుద్ధాల పరిణామంగా ఆధునిక అభివృద్ధిని, విద్యను, పారిశ్రామికీకరణను అందుకోడానికి పలు దేశాలు తీవ్రంగా కృషి చేశాయి. రెండో ప్రపంచ యుద్ధం తరువాత అనేక దేశాలు స్వాతంత్ర్యం పొందాయి. ఇండియా, చైనా కూడా స్వాతంత్ర్యానంతరం తమ దేశాల పునర్‌నిర్మాణం కోసం విశేషంగా కృషి ప్రారంభించాయి. పంచవర్ష ప్రణాళికలను వేసుకొని ముందుకు సాగాయి. అమెరికాలో

1946-1965 వరకు వున్న సమాజం వేరు. ఆ తరువాత రూపొందిన సమాజం వేరు. నల్లవారికి సమాన హక్కులు ఇవ్వడంతో పాటు ఎదగడానికి ప్రత్యేక అవకాశాలు కల్పించే దృష్టి కొంత పెరిగింది. అమెరికా స్వాతంత్ర్యం పొందిన నాటి నుండి పలు జాతుల, దేశాల, విభిన్న సంస్కృతుల ప్రజల మధ్య మునుపెన్నడూ లేని విధంగా సహజీవనం, సంస్కృతిగా పెరుగుతూ వచ్చింది. అమెరికా లోని ఏడుతరాలు (రూట్స్) వంటి నవలలు రాసిన ఎలెక్స్ హెలీ వంటి నల్ల రచయితలు, మార్టిన్ లూథర్‌కింగ్ వంటి నాయకులు, ప్రజాఉద్యమాలు దీన్ని వేగవంతం చేసాయి.

2. అమెరికా విశిష్టత-ఆధిపత్యం

అమెరికా రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొనకుండా తటస్థంగా ఉండడం వల్ల యుద్ధంలో పాల్గొన్న యూరప్ దేశాల్లాగా చితికిపోలేదు. క్రమక్రమంగా ఎదుగుతూ వచ్చింది. చివరకు ప్రపంచ అగ్రరాజ్యంగా శాసించే స్థితికి చేరుకుంది. ప్రభుత్వం అత్యంత శక్తివంతమైన ప్రభుత్వంగా, ప్రపంచాధినేతగా విస్తరిస్తూ వచ్చింది.

అమెరికా ప్రజలు వేరు, ప్రభుత్వం వేరు

అమెరికా ప్రభుత్వం వేరు, ప్రజలు వేరు. అమెరికా ప్రభుత్వమే అమెరికా ప్రజలు కారు. భారత ప్రభుత్వం గాని, రాష్ట్ర ప్రభుత్వాలు గాని భారత ప్రజలను ప్రతిఫలిస్తాయా? భారత ప్రజలకు నిజమైన ప్రతినిధిగా వుంటున్నాయా? అవి అధికారం చేజిక్కించుకున్న వర్గాల, లాబీల, పారిశ్రామిక వేత్తల, వ్యాపారవేత్తల, సంపన్నుల, భూస్వాముల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. సంఘటిత, ఉద్యోగ, మేధావి, ఉపాధ్యాయ, కార్మిక, మధ్యతరగతి వర్గాల ప్రయోజనాలను డిమాండ్ చేసి సాధించుకునే సామర్థ్యాన్ని అనుసరించి ఈ వర్గాల ప్రయోజనాలకు కూడా ప్రాతినిధ్యం వహిస్తాయి. అంతేగాని ప్రభుత్వాలు, ప్రభుత్వాన్ని నడిపే శక్తులు మొత్తం ప్రజలకు, సమాజానికి ప్రాతినిధ్యం వహించడం లేదు.

అలాగే అమెరికా ప్రభుత్వం కూడా అమెరికా సమాజానికి, మొత్తం అమెరికా ప్రజలకు ప్రాతినిధ్య వహించడం లేదు. నాలుగు దశాబ్దాలుగా అమెరికా ప్రజలు ఉన్నతస్థాయిలో ఉచిత విద్య, పూర్తి స్థాయిలో ఉచిత వైద్యం ప్రభుత్వం అందించాలని కోరుతున్నారు. ఉద్యమిస్తున్నారు. చిన్న పార్టీలు ఇందుకు నాయకత్వం వహిస్తున్నాయి. అమెరికా ప్రభుత్వాన్ని నడిపే శక్తులు దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. అమెరికాలో మెడికల్ ఇన్స్యూరెన్స్ లేకుండా డాక్టర్లు వైద్యం చేయరు. మెడికల్ షాపుల్లో మందులు డాక్టర్ల చీటి లేకుండా అమ్మరు.

ఇలా గత కొంతకాలంగా రెండు కోట్లకు పైగా అమెరికన్ ప్రజలు మెడికల్ ఇన్స్యూరెన్స్ లేకుండా వైద్యం పొందలేకపోతున్నారు. అనగా 20 శాతం జనాభా అమెరికాలో వైద్యం పొందలేక అనారోగ్యంతో చనిపోతున్నారు. ఒబామా తన ఎన్నికల హామీల్లో ఉచిత వైద్యాన్ని, మెడికల్ ఇన్స్యూరెన్స్‌ను నామమాత్రం రేట్లపై అందించడానికి హామీ ఇచ్చారు. దాన్ని అమలు చేయడానికి పూనుకొన్నాడు. అమెరికాలోని మందుల కంపెనీలు, కార్పోరేట్ హాస్పటల్ రంగం,

డాక్టర్ల లాబీ ఇందుకు వ్యతిరేకంగా రోడ్లమీదకు వచ్చాయి. అందుకు మేధావుల నుండి కొన్ని సూత్రీకరణలను తయారు చేయించారు. మా శరీరాలపై ప్రభుత్వం ఆధిపత్యమేమిటి అని ప్రశ్నిస్తూ కార్పోరేట్ సంస్థలు ఉద్యమాలను ముందుకు నెట్టాయి. ఇలాంటి నినాదం కూడా ఒకటి ఉంటుందా అని మనకు ఆశ్చర్యం కలగకమానదు. పోలీస్, రక్షణ వ్యవస్థ, ట్రాఫిక్ రూల్స్, చట్టాలు మొదలైనవన్నీ మనుషులను క్రమబద్ధీకరించడానికి, ప్రభుత్వం సేవలు అందించడానికి, పనిలోపనిగా ఆధిపత్యం కూడా స్థిరపరుచుకోవడానికి ఉపయోగపడుతుంటాయి. ఉచిత విద్య అమెరికాలో 12వ తరగతి దాకా కొనసాగుతున్నది. దీన్ని కూడా వ్యతిరేకించే కార్పొరేట్ రంగం పుట్టుకొస్తుందేమో!

అమెరికాలో సోషలిజం, కమ్యూనిజం అంటే భయపడిపోతారు. కానీ సోషలిజాన్ని కొన్ని రంగాల్లో 40 నుండి 60 శాతం దాకా ఆచరిస్తున్నారు, అనుభవిస్తున్నారు. సామాజిక భద్రత, సామాజిక సంక్షేమం పేరిట దీన్ని అమలు చేస్తున్నారు. ఉదా.కు విడాకులైన తల్లి తాను పిల్లలను పెంచలేనని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే పిల్లలు జాతి సంపద గనుక వారిని పెంచి పోషించడానికి ఒక పిల్లవాడికి 500 డాలర్లు చొప్పున పెన్షన్‌లాగా నెలనెల ఇస్తుంది. లేదా నేను సాదలేను అని అంటే ప్రభుత్వమే దత్తత తీసుకొని పెంచి పోషించి విద్యాబుద్ధులు నేర్పుతుంది.

అలాగే ఉద్యోగం లేదని దరఖాస్తు చేసుకుంటే నెలకు వెయ్యి డాలర్లు నిరుద్యోగ భృతి ఇస్తుంది. 12వ తరగతి దాకా ఉచిత విద్య ప్రభుత్వ పాఠశాల ద్వారా అందిస్తుంది. ఇలా అనేక రంగాల్లో ప్రభుత్వం సామాజిక భద్రత, సాంఘిక సంక్షేమం పేరిట సోషలిజాన్ని అమలు చేస్తున్నది. ఇండియాలో ఇలా అరవై నుండి ఎనభై శాతం దాకా సోషలిజం పథకాలు ప్రవేశ పెడితే అమెరికాలో నలభై నుండి అరవై శాతం దాకా కొనసాగుతున్నాయి. ఇండియాలో పథకాలు ఆచరణలో ప్రజలకు చేరడంలో విఫలమవుతున్నాయి. అమెరికాలో చాలా మేరకు ప్రజలకు చేరగలుగుతున్నాయి.

1965 తరువాత అమెరికా సమాజం ప్రపంచంలోనే ఎన్నదగిన ఆదర్శ సమాజంగా ఎదుగుతూ వచ్చింది. ప్రభుత్వం వేరు, సమాజం వేరు, ప్రజలు వేరు, కుటుంబాలు వేరు, వ్యక్తులు వేరు అని తెలిసినప్పటికీ అమెరికా ప్రభుత్వాన్ని, మల్టీనేషనల్ కంపెనీలను విమర్శిస్తూ అమెరికా సమాజం పట్ల, ప్రజల పట్ల చిన్నచూపు చూడడం చాలా దేశాల్లో వామపక్షాలు దశాబ్దాల తరబడి పనిగట్టుకొని ప్రచారం చేస్తూ వచ్చాయి. వామపక్ష ఉద్యమ నాయకులు కొందరు ప్రజల పక్షాన పనిచేస్తున్నారో, రాజ్యం తరఫున పోలీసుల కోసం పనిచేస్తున్నారో అనే సందేహం వచ్చేలా ప్రవర్తించిన తీరుపై కొంత సాహిత్యం, విశ్లేషణ, వ్యాసాలు వచ్చాయి.

మనకు అమెరికన్ పనిశైలి ఆదర్శం – లెనిన్

1905లోనే రష్యన్ విప్లవనేత లెనిన్ అమెరికన్ పనిశైలి రష్యన్ విప్లవానికి ఆదర్శం కావాలని నొక్కి చెప్పాడు. వామపక్షాలు అమెరికా నుండి ఆ స్ఫూర్తిని పొందకుండా చేయడంలో చాలావరకు సాఫల్యం చెందాయి. భారతదేశంలో మేథోవర్గం వామపక్ష భావజాలంతో ప్రభావితం కావడం వల్ల అమెరికా ప్రజల పట్ల ప్రేమ, ఆత్మీయత, సామీప్యత లేకుండా

నిరంతరం ప్రభుత్వాల పట్ల వ్యతిరేకతను ఊదరగొడుతూ వచ్చారు. కానీ కొందరు అగ్రవర్ణాలకు చెందిన వారు గుట్టుచప్పుడు కాకుండా అమెరికా వెళుతూనే వున్నారు. 1960ల కన్నా ముందునుండే భారతదేశం నుండి బ్రాహ్మణ మేధావులు అమెరికాకు వెళ్తూనే వున్నారు.

అమెరికా పట్ల వ్యతిరేకతను ప్రచారం చేయడం వల్ల అమెరికా ప్రజలు నష్టపోయిందేమీ లేదు. భారతీయులే అమెరికన్ పనిశైలి నుండి స్ఫూర్తి పొందకుండా వెనకబడి పోయారు. 1965 తరువాత అమెరికా ప్రజలు, సైన్సు టెక్నాలజీ విపరీతంగా అభివృద్ధి చెందింది. దాంతో పాటు జపాన్, చైనా, రష్యా, చెకొస్లోవేకియా, సింగపూర్, ఇజ్రాయెల్, యూరప్ దేశాలు కూడా కొంతమేరకు కొన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయి. అమెరికా ఒక దశలో జపాన్, యూరప్ దేశాల అభివృద్ధి నుంచి వచ్చే పోటీని తట్టుకోలేకపోయింది. అనేక ఆంక్షలు విధించింది. అయినా జపాన్ ముందుకు సాగుతునే వుంది. 1965 నుండి 1985 వరకు అమెరికాతో పాటు అనేక దేశాలకు మరొక సామాజిక దశగా కొనసాగింది.

భారతదేశంలో కూడా ఈ రెండు దశాబ్దాలు ప్రత్యేక పరిణామాలు కొనసాగాయి. అస్థిర, ప్రాంతీయ, వికేంద్రీకృత రాజకీయాలు సామాజిక ఉద్యమాలు ఇలా అభివృద్ధిలో వెనుకబడిపోయిన అసహనం అనేక రూపాలు తీసుకుంది. కాంగ్రెస్ ఆధిపత్యం కోల్పోతూ వచ్చింది. 1985 నాటికి తిరిగి కాంగ్రెస్ రకరకాల కారణాలతో పుంజుకొని పూర్తి స్థాయి ఆధిక్యతలోకి వచ్చింది. రష్యాలో 1965 నుండి లోలోపల తొలుచుకుంటూ వచ్చి సోషలిజం నేతిబీరకాయగా మారుతూ ప్రజాస్వామ్యమే ముద్దు అని సోషలిస్టు సమాఖ్య వద్దని 13 దేశాలుగా విడిపోయారు.

వామపక్ష భావజాలానికి సోవియట్ యూనియన్ ఒక స్ఫూర్తి కేంద్రంగా ఉండేది. అది ఐక్యరాజ్య సమితిలో, ప్రపంచంలో దేశాలను రెండు, మూడు గ్రూపులుగా వర్గీకరించడానికి కారణమైంది. భారతదేశం అలీన దేశంగా అలీన దేశాల ఉద్యమానికి నాయకత్వం కూడా అందించింది. భారతదేశాన్ని అగ్రరాజ్యాల వాళ్లు మూడవ ప్రపంచ దేశాల్లో కలిపేశారు. 1985 తరువాత రష్యా శక్తి తగ్గింది. అమెరికా శక్తి అలాగే ముందుకు కొనసాగుతూ వచ్చింది. దీన్ని ఏకధృవ ప్రపంచం అని కొందరు పిలవడం ప్రారంభించారు. అమెరికాకు అడ్డూ, అదుపు లేకుండా పోయిందనేది ఏకధృవ ప్రపంచం అని చెప్పేవాళ్ల ఉద్దేశ్యం. అయితే అందుకు భిన్నంగా అమెరికా, జపాన్, ఇజ్రాయెల్, స్విస్‌బ్యాంకుల రహస్య డబ్బు అమెరికా బ్యాంకుల్లోకి, ప్రపంచ బ్యాంకుల్లోకి ప్రవాహంలా వచ్చి పడ్డం వల్ల అమెరికా కూడా శ్వాస ఆడకుండా సతమతమవుతూ వచ్చింది.

ఇలా రెండో ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచం గ్లోబలైజేషన్ పరిణామంలోకి రావడం ఒక నూతన దశ. ప్రపంచం ఇప్పటి దాకా ఎన్నడూ కనీవినీ ఎరగని దశ. ఇది ఒక మౌలికమైన పరిణామం. గ్లోబలైజేషన్ విస్తరించడంతో ఐక్యరాజ్యసమితి పాత్ర పెరుగుతుందనుకున్నాము గాని, తగ్గుతూ వచ్చింది. దేశాలే కాకుండా భారతదేశంలోని రాష్ట్రాలు కూడా ఇతర దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకునే దశ ఏర్పడింది. ఇది మునుపెన్నడూ ఊహకందని విషయం.

తానే మెచ్చి చేసుకున్న కోడలు కూడా అత్తపై పెత్తనం చేస్తుంది

చాలా మంది అమెరికా ప్రయోజనాల కోసం గ్లోబలైజేషన్ ముందుకు వచ్చిందని ప్రచారం చేసారు. అందులో వామపక్ష మేధావులే ముందున్నారని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. అయితే వాస్తవం అలా సాగడం లేదు. తల్లిదండ్రులే కోడలు పిల్లను వెతికి తెచ్చుకున్నప్పటికీ తరువాత కోడలుదే ఆధిపత్యం మొదలై అత్తమామలు తమ పెత్తనం వదులుకోవడం కుటుంబ వ్యవస్థలో జరిగినట్టుగానే అమెరికా తానే గ్లోబలైజేషన్ కోరుకున్నప్పటికీ 1995 నుండి అమెరికా క్రమక్రమంగా ఇతర దేశాల ఉత్పత్తులతో, సేవలతో ముంచెత్తబడి ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. జర్మనీ, జపాన్ కార్లు, చైనా, జపాన్ ఎలక్ట్రానిక్, తైవాన్ కంప్యూటర్, కొరియా ఫ్రిజ్‌ల వంటి ఉత్పత్తులు అమెరికాను ఆక్రమించేసాయి. అమెరికా కంపెనీలు దివాళా తీసే క్రమం మొదలైంది. మరోవైపు, అమెరికా కన్నా ఐదు రెట్లు జనాభా వున్న చైనా నుండి చౌకగా తయారయిన ఉత్పత్తులు మాన్యుఫాక్చరింగ్ రంగం నుండి అమెరికా మార్కెట్లను ముంచెత్తాయి. బొమ్మలు, ఆటవస్తువులు మొదలుకొని పుస్తకాలు, బట్టలు, మొదలైన సరుకులన్నీ చైనా, కొరియా, మెక్సికో, ఇండియా దేశాల నుండి అమెరికా మార్కెట్లో వచ్చిపడ్డాయి. మరోవైపు సాఫ్ట్‌వేర్ నిపుణులు ఇండియా నుండి లక్షలాది మంది అమెరికా వెళ్లారు.

బెంగుళూరు, హైదరాబాద్, పూణె, ముంబాయి, ఢిల్లీ, తదితర నగరాల్లో ఉంటూనే అమెరికా కంపెనీలకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే సాఫ్ట్‌వేర్ నిపుణులు లక్షలాది మంది ఇండియాలో పనిచేస్తూ అమెరికా దేశానికి చెందిన ఉపాధి అవకాశాలను పోటీపడి గెల్చుకున్నారు. అమెరికన్ సాఫ్ట్‌వేర్ నిపుణులకు ఆరు వేల నుండి పన్నెండు వేల డాలర్లు దాకా నెల జీతం ఇవ్వాల్సి వుంటే మూడువేల నుండి ఎనిమిదివేల మధ్య జీతానికి ఇండియా, చైనా సాఫ్ట్‌వేర్ నిపుణులు పనిచేయడానికి ముందుకు వచ్చారు.

ఒకనాడు తన ప్రయోజనాల కోసం అమెరికా రూపాయి విలువను డాలరుతో తగ్గించడానికి వత్తిడి చేసింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు రూపాయి, డాలరు, పౌండు విలువ సమానంగా ఉండేవి. ఆంగ్లేయులు తాము ఆధిపత్యంలో ఉన్నామని పౌండు విలువను ఆరు పైసల మేరకు ఎక్కువ పెట్టుకున్నారు. అలాంటిది యాభయ్యేళ్లలో పౌండుకు 80 రూపాయలుగా, డాలరుకు 50 రూపాయలుగా రూపాయి విలువ ఇంగ్లాండుతో 80 రెట్లు, అమెరికాతో 50 రెట్లు దిగజారిపోయింది. ఇది అమెరికాకే చివరకు ఎదురు కొట్టింది. రూపాయి విలువ తక్కువ కావడం వల్ల డాలర్లు సంపాదిస్తే రూపాయిలు ఎక్కువ వస్తాయని సాఫ్ట్‌వేర్ నిపుణులు, భారతదేశం భావించింది. దాంతో డాలరు విలువను తగ్గించుకోలేక రూపాయి విలువను పెంచలేక అమెరికా కొంత సతమతమవుతున్నది.

ఇలా 1995 తరువాత ప్రపంచం వేరు, 1995 కన్నా ముందు ప్రపంచం వేరు. 1995 నుండి నేటి దాకా సాగుతున్న పరిణామం ప్రత్యేకమైనది. మానవ సమాజం విశ్వమానవ కుటుంబం అనే గ్లోబల్ విలేజ్ అనే స్థాయిని నిజంగానే కొంత సంతరించుకుంటున్నది. పాస్‌పోర్టు తప్ప వీసాలు అక్కర్లేని విధంగా ఐక్యరాజ్యసమితి ద్వారా

మార్గదర్శకాలు రూపొందిస్తే ప్రపంచ దేశాలు మరింత దగ్గర కావడానికి కాలం ఎంతో దూరంలో లేదు. అలా ప్రపంచ ప్రజలు ఒకే తీరుగా ఆలోచించే, ఆచరించే జీవన ప్రమాణాలకు, సంస్కృతికి, భాషకు చేరువవుతూ వస్తున్నారు. ఇంగ్లీషు భాష ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. బ్రిటన్ సామ్రాజ్యవాదం అంతరించాక ఇంగ్లీషు ప్రాధాన్యత ఎన్నో రెట్లు పెరగడం అనేది ఒక విశేషం. దీనికి కారణాలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా అమెరికా ఆధిపత్యం పలు రంగాల్లో పెరగడం ఒక కారణం.

ఇంగ్లీషు నేర్చుకోకుండానే జపాన్, కొరియా, చైనా ప్రజలు అమెరికాకు పోటీ ఇచ్చారు. తరువాత ఇంగ్లీషు కూడా నేర్చుకున్నారు. ఆ దేశాలు స్థానికంగా అలా పారిశ్రామికంగా స్వయంసమృద్ధితో అభివృద్ధి చెందాయి. ఇండియా ఈ స్థాయికి పారిశ్రామిక రంగంలో, ఇతర రంగాల్లో ఎదగలేక పోయింది. చివరికి వ్యవసాయ రంగంలో కూడా ఇతర దేశాల సహకారం కావాల్సి వస్తున్నది. విత్తనాలను కూడా బహుళజాతి కంపెనీలు సప్లయి చేస్తున్నాయి.

ఆధునికత అందుకోకపోతే చావేనా!

ఇదిలా వుండగా మరోవైపు మానవ సమాజంలో సంక్షోభం కూడా పెరిగింది. అది పలు రూపాల్లో కనిపించింది, కనిపిస్తున్నది. ఇల్లు ఖాళీ చేసి మరో ఇంటిలోకి సామానంతా సర్దుకుని వెళ్లినప్పుడు పాతసామాను ఎంతో చెత్త కనబడుతుంది. మోసుకుపోవడం బరువనిపిస్తుంది. కొత్తగా చేరే ఇంటిలోకి ఇవన్నీ మోసుకుపోవాలా అని విసుగు వస్తుంది. ప్రపంచం ఈ విసుగుకు లోనవుతున్నది. అయితే ఇందులో పాతసామాను పాత జీవితాలు, సంస్కృతి, ఉత్పత్తి విధానాల్లో జీవిస్తున్న మనుషులు కావడమే ప్రపంచం ఎదుర్కొంటున్న విషాదం. పూర్వం యుద్ధాలతో, రోగాలతో కోట్లాది మంది చనిపోయారు. ఇప్పుడు అలా కాకుండా ఆధునికతను అందుకోకపోతే అలా చనిపోయే అనివార్య దుర్గతి, దుస్థితి ముందుకు వచ్చింది. గ్లోబలైజేషన తరువాత మానవాళి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఇది.

3. అమెరికా సంక్షోభాలు - మూలాలు

అమెరికా ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొని పరిష్కరించుకుంది. అమెరికా బ్రిటన్ వలసగా వుండేది. దాన్నించి స్వాతంత్ర్యం సంపాదించుకుని 17 సెప్టెంబర్ 1787న "We the people of the United States, in order to form a more perfect Union, establish Justice, insure domestic Tranquility, provide for the common defence, promote the general Welfare, and secure the Blessings of Liberty to ourselves and our Posterity, do ordain and establish this Constitution for the United States of America." అంటూ తన సొంత రాజ్యాంగాన్ని ఏర్పర్చుకుంది.

అయినప్పటికీ రెడ్ ఇండియన్స్‌కి న్యాయం జరగలేదు. జరిగిన అన్యాయం సరి చేయబడలేదు. నల్లవారిని ఆఫ్రికా తదితర దేశాల నుండి బానిసలుగా తెచ్చి వారిచే భూములను వ్యవసాయ యోగ్యం చేశారు. రోడ్లు వేయించారు. రైలు పట్టాలు వేయించారు. పరిశ్రమలు

స్థాపించారు. పారిశ్రామిక అభివృద్ధి సాధించారు. అయినప్పటికీ నల్లవాళ్ళను బానిసలుగానే చూశారు. నల్లవారి బానిసత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాట్లు, ఉద్యమాలు సాగాయి.

ఉత్తర అమెరికా రాష్ట్రాలు బానిసత్వాన్ని రద్దు చేయడానికి సుముఖంగా ఉన్నప్పటికీ దక్షిణ రాష్ట్రాలు వ్యవసాయంలో బానిసలు అవసరమని బానిసత్వ రద్దును వ్యతిరేకించాయి. అంతర్యుద్ధం జరిగింది. అబ్రహం లింకన్ అమెరికా అధ్యక్షుడయ్యాక బానిసత్వాన్ని, అంతర్యుద్ధాన్ని అంతమొందించేందుకు పూనుకున్నాడు. 1863లో బానిసత్వాన్ని రద్దు చేస్తూ గెట్టిస్‌బర్గ్ ప్రసంగం చేశాడు. ఆ ప్రసంగంలోనే ప్రజాస్వామ్యం అంటే 'ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజల యొక్క ప్రజాస్వామ్యం' అని నిర్వచించాడు. బానిసత్వాన్ని రద్దు చేసినందుకు వ్యతిరేకంగా అతన్ని హత్య చేశారు. ఇలా అమెరికా, యూరప్ దేశాల ప్రజల వలసల చేత నిండి అమెరికా సమాజంగా మారుతున్న క్రమంలో అనేక సంక్షోభాలను ఎదుర్కొని పరిష్కరించుకుంది. వలస వచ్చి స్థిరపడిన అనేక దేశాల ప్రజలు ఒకదేశంగా, ఒక జాతిగా లేదా అమెరికా జాతీయతగా పరిణామం చెందడానికి అనువుగా స్వేచ్ఛాయుత సమాజంలో పరివర్తన అనే క్రమాన్ని తీసుకుని ముందుకు సాగుతున్నది. అన్ని దేశాల ప్రజలను తనలో కలుపుకొని ఎదిగే సమాజంగా క్రమక్రమంగా మారుతున్నది.

కరువులు, ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు, నిర్బంధాలు మొదలైన వాటివల్ల యూరప్ దేశాల నుండి 1890 నుండి 1924 మధ్య రెండు కోట్ల మంది అమెరికాకు వలస వచ్చారు. అలా వలస వచ్చిన వారి జనాభా ఇప్పటి జనాభాలో 30 శాతంగా వుంటుంది. నల్లవారి జనాభా 12 శాతం వుంటుంది. ఆసియా వాసుల జనాభా ఆరు శాతంలోపే వుంటుంది. కెనడా, మెక్సికో నుండి లక్షలాది ప్రజలు, బంగ్లాదేశ్ నుండి ఇండియాలోకి వలస వచ్చినట్టు అమెరికాకు వలస వచ్చి స్థిరపడుతూనే వున్నారు. అమెరికన్లుగా చలామణి అవుతుంటారు. ఇలా ఎంతమంది, ఎన్ని దేశాల నుండి వచ్చినప్పటికి అమెరికా ఒక సమాజంగా ఎదుగుతూ వస్తున్నది. తన సమస్యలను తానే పరిష్కరించుకుంటూ వస్తున్నది.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ప్రపంచ వ్యాప్తంగా వలస దేశాల్లో స్వాతంత్ర్యం కోసం ఉద్యమాలు సాగాయి. స్వాతంత్ర్యం ఇస్తామని హామీ ఇస్తూ ఇంగ్లాండ్, ఆసియా వలస దేశాల ప్రజల నుండి తన యుద్ధానికి మద్దతును సహాయాన్ని, సైనికులను పొందగలిగింది. అలా అనేక దేశాలు రెండవ ప్రపంచ యుద్ధం తరువాత స్వతంత్ర దేశాలుగా మారాయి. ఇండియాకు 1947 ఆగస్టు 15వ తేదీన, పాకిస్తాన్‌కు ఆగస్టు 14వ తేదీన, చైనాకు 1949 అక్టోబర్ 7వ తేదీన స్వాతంత్ర్యం లభించింది. రెండో ప్రపంచ యుద్ధంలో ఎంతో వినాశనం జరిగింది. ఎన్నో దేశాలు విముక్తి పొందాయి. యుద్ధంలో పాల్గొన్న దేశాలు ఆర్థికంగా, ఆధిపత్య పరంగా శిధిలమయ్యాయి. తమ దేశాల పునర్నిర్మాణం కోసం దృష్టి పెట్టాయి.

ప్రపంచీకరణతో రెండవ ప్రపంచ యుద్ధానికి భిన్నమైన పరిణామాలు ప్రారంభమయ్యాయి. అనేక మలుపు తీసుకున్నాయి. 1995-2005 దశాబ్దంలో ప్రపంచీకరణలో, సరుకుల, మార్కెట్ శక్తుల యుద్ధంలో, పోటీలో వినాశనంతో పాటు

మరోవైపు విజయాలు నూతన సమాజ నిర్మాణానికి, సామాజిక వర్గాల పునర్‌వ్యవస్థీకరణకు, నూతన రంగాల్లో విజయాలకు, అస్తిత్వ ఉద్యమాల చైతన్యాలకు సాక్షీభూతమైంది. ముందే చెప్పినట్టు సుమారు ప్రపంచంలో వందకోట్ల జనాభా రెండు ప్రపంచ యుద్ధాల కన్నా క్రూరంగా మరణాలకు దారితీసే పరిణామాలు సాగుతున్నాయి. అందువల్ల రెండు ప్రపంచ యుద్ధాల కన్నా తీవ్రమైన సంక్షోభం ప్రపంచమంతటా కొనసాగుతున్నది.

కౌపీన (బుద్ధగోచి) సంరక్షణార్థం...

అమెరికా, యూరప్ దేశాలు ఆయుధాల ఉత్పత్తిని, ఆయుధ వ్యాపారాన్ని ఆపివేసి ప్రజలకు అవసరమైన ఉత్పత్తి, సేవా రంగాల్లో తమ కృషి పెంచినప్పుడు ఈ సమస్య పరిష్కారమవుతుంది. ఆయుధాల ఉత్పత్తి వల్ల, వాటిని అమ్ముకోవడం కోసం యుద్ధాలను సృష్టించడం వల్ల ఆయా దేశాల్లో జాతీయ సంపదలో 30 శాతం దాకా వీటికి వృధా చేయాల్సి వస్తున్నది. తద్వారా ఆయా దేశాల ప్రజలు వారి జీవన ప్రమాణాలు కునారిల్లుతున్నాయి.

ఫోర్డు కార్ల కంపెనీ 1927లో అమెరికాలోని రైల్వే లైన్లను కొనేసింది. రైలు మార్గాలను తీసివేసి ఐరన్ స్క్రాప్‌గా మార్చివేసింది. ఆ తరువాత జనరల్ మోటార్స్ తదితర కార్ల కంపెనీలు రైల్వేలను పూర్తిగా నిర్వీర్యం చేసాయి. ఇంటికొక కారు అని నినాదమిచ్చింది. 1946 నాటికి దాన్ని సాధించారు. అందుకు రోడ్ల అభివృద్ధి సాగింది. రైళ్లను తగ్గించారు. ఆ తరువాత మనిషికో కారు అని కార్ల కంపెనీలు నినాదమిచ్చాయి. దాన్నీ 1985 నాటికి సాధించారు. కార్లకు పెట్రోలు కావాలి. పెట్రోలు అరబ్బు, తదితర దేశాల్లో దొరుకుతుంది. దాన్ని తక్కువ ధరకు కొనాలి. అందుకు ప్రభుత్వాల మీద ఒత్తిడి చేసారు. అవసరమైతే ప్రభుత్వాలను పడగొట్టారు. ఆ దేశాలతో యుద్ధం చేసారు. అలా క్రమంగా ఇరాక్‌మీద, సద్దాం హుస్సేన్ మీద పెట్రోల్ వనరులపై ఆధిపత్యం కోసం యుద్ధం ప్రకటించాయి.

యుద్ధంలో అమెరికా ప్రభుత్వం గెలిచింది. అమెరికా ప్రజలు ఓడిపోయారు. అమెరికా యుద్ధ ఖర్చుల వల్ల తీవ్రంగా దెబ్బతిన్నది. దాంతో అమెరికాలో ఆర్థిక సంక్షోభం ప్రారంభమైంది. ఒకటివెంట ఒకటి పరిణామాలు జరిగాయి. స్విస్‌బ్యాంకుల్లోని బ్లాక్‌మనీ, జపాన్, ఇజ్రాయిల్ దేశాల సంపద అమెరికన్ బ్యాంకుల్లో చేరడం వల్ల వాటిని ఏదో ఒక రూపంలో తిరిగి ప్రజలకు ఇచ్చి దానిపై వడ్డీని సంపాదిస్తూ రొటేషన్ చేసుకోవాలి. అందుకోసం బ్యాంకులు ఆరు శాతం వడ్డీ నుండి మూడు శాతం వడ్డీకి మారాయి. చివరకు ఒక సంవత్సరం దాకా కిస్తులు, వడ్డీలు కట్టనక్కరలేదు అన్నారు. ఆ తరువాత ఒక శాతం వడ్డీకి ఇచ్చారు. దాంతో మన దగ్గర 2004లో రిలయన్స్ సెల్‌ఫోన్‌లను వార్త దినపత్రిక కొంటే ఉచితం అని ఇస్తే లక్షల మంది కొనుక్కున్నట్టుగా అమెరికాలో లక్షలాది మంది ఇళ్లు కొన్నారు. కానీ వాళ్లకు సంపాదన సరిపోకపోవడంతో, ఉపాధి కోల్పోవడంతో కట్టలేకపోయారు. దాంతో బ్యాంకులు దివాళా తీయడం మొదలైంది.

కార్ల కంపెనీ పక్క ఒకసన్యాసి బుద్ధగోచిని ఎలుకల నుండి కాపాడుకునే కౌపీన సంరక్షణార్థం కథవలె మారింది. కార్ల కోసం రోడ్లు పెరిగాయి. రైళ్లు బందయ్యాయి.

పెట్రోలు అవసరమైంది. పెట్రోలు కోసం ఇతర దేశాల మీద పడి యుద్ధాలు చేశారు. గెలిచిన తరువాత కూడా సంక్షోభంలో పడ్డారు. అదే సమయంలో అమెరికా కార్ల కంపెనీలను వెనక్కి నెట్టి జపాన్ కార్ల కంపెనీలు మార్కెట్లో దూసుకుపోయాయి. అమెరికా కార్ల కంపెనీలు దివాళా తీయడం మొదలైంది. ఇలా అంతా తమ చేతుల్లోనే ఉంటుందనుకున్న కార్ల కంపెనీలు గానీ, అమెరికా ప్రభుత్వాలు గానీ, సామాజిక పరిణామాలకు తలవంచక తప్పలేదు. చైనా వద్ద అమెరికా ఇప్పుడు అప్పులు చేస్తున్నది. అమెరికన్ సంస్థలు, సంపన్నులు కూడా అమెరికా ప్రభుత్వానికి అప్పులు ఇస్తున్నారు. ఇలా గ్లోబలైజేషన్ అనేది అమెరికా ప్రయోజనాల కోసం మొదలై కొనసాగుతున్నది అనే విమర్శ ఎంత తప్పుడు ప్రచారమో ఈ చరిత్రంతా స్పష్టం చేస్తున్నది. చైనా, ఇండియా, కొరియా, జపాన్ త్వరలో సంపన్న రాజ్యాలుగా ఆవిర్భవించ నున్నాయి. గ్లోబలైజేషన్ లేకుండా ఇది సాధ్యమయ్యేదా? అలా ఊహించలేము కూడా.

అమెరికా సంక్షోభాలు ప్రపంచాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల అమెరికా సంక్షోభ మూలాలను అన్ని దేశాల మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు పరిశీలించి పరిష్కారాలు సూచించడం అవసరం. అన్ని దేశాల చైతన్య వర్గాలు ఉద్యమించడం అవసరం. అమెరికాలోని రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్ రంగం కుప్పకూలడంతో ఇండియాలో కూడా దాని ప్రభావం పడింది. ఇండియాలోని రియల్ ఎస్టేట్ రంగంతో పాటు సాఫ్ట్‌వేర్ ఉపాధి రంగం పై కూడా అది తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. ఇండియాలో కూడా రియల్ ఎస్టేట్ ధరలు తగ్గిపోయాయి. అంతర్జాతీయంగా సాగే ఉక్కు పరిశ్రమల టేకోవర్‌ననుసరించి ఇండియాలో కూడా ఉక్కు రేట్లు పెరగడం, దిగడం జరుగుతున్నది.

అయితే అమెరికా సంక్షోభాలన్నీ ఇండియాపై పూర్తిస్థాయిలో పడే అవకాశం లేదు. అమెరికాలో 97 శాతం పన్ను చెల్లించిన ద్రవ్యం చలామణిలో వుంది. అనగా బ్లాక్‌మనీ మూడు శాతమే. ఇంటర్నెట్, సాఫ్ట్‌వేర్, కంప్యూటరీకరణ వల్ల అమెరికాలో పారదర్శకత మరింత పెరిగింది. అందువల్ల బ్లాక్‌మనీ చాలా తక్కువ. కనుక ప్రభుత్వం, మల్టీనేషనల్, కార్పొరేట్ ప్రైవేటు రంగం సంక్షోభాలు పూర్తి స్థాయిలో అమెరికా ప్రజలను, సమాజాన్ని ప్రభావితం చేస్తాయి. కుదేలవుతాయి.

ఇండియాలో బ్లాక్ మనీ విలువ ద్రవ్య చలామణి కన్నా ఎన్నో రెట్లు ఎక్కువ. పన్ను కట్టని సంపద ఇండియాలో మూడు నాలుగు రెట్లుంటుంది. అందువల్ల ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంక్షోభాలు ఇండియాలో యధాతథంగా ప్రభావాన్ని చూపవు. బ్లాక్‌మనీ ద్వారా ఆయా పరిశ్రమలు, ఆస్తులు, మార్కెట్‌లు చేతులు మారతాయి తప్ప సంక్షోభం ప్రజల జీవితంపై ప్రభావం వేసే స్థాయికి చేరడం తక్కువ. సంక్షోభంలో నాలుగోవంతు మాత్రమే ప్రజలపై పడుతుందని చెప్పవచ్చు. స్విస్ బ్యాంకుల్లోని భారతీయుల సంపదను వెనక్కి తీసుకురాగలిగితే ఇండియా ఎంతో సుంసపన్నం అవుతుంది. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. పరిశ్రమలు పెరుగుతాయి. ఉచిత విద్య, ఉచిత వైద్యం నూరు శాతం ప్రభుత్వ రంగంలో అందించవచ్చు. స్విస్‌బ్యాంకుల్లోని భారతీయుల సంపద వెనక్కి తీసుకుంటే ఎన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలుతాయో తెలియదు.

అమెరికా ఎదుర్కొనే సంక్షోభాల్లో కొన్ని తనకు తానే సృష్టించుకున్నవి. ఆయుధ లాబీ, ఫార్మా లాబీ, బ్యాంకు, ఇన్సూరెన్స్ కంపెనీల లాబీ, సూపర్ మార్కెట్ల లాబీ, మల్టీనేషనల్ కంపెనీ లాబీలు, రవాణా రంగ లాబీలు, సాఫ్ట్‌వేర్‌రంగ లాబీలు, మాన్యుఫ్యాక్చరింగ్ లాబీలు, కాంట్రాక్టర్ల లాబీలు మొదలైన లాబీలు అమెరికాలో బలమైన లాబీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నిర్దేశిస్తున్నాయి. తెల్లవారు, నల్లవారు, యూదులు అనే సామాజిక వర్గాల లాబీలు సామాజిక లాబీలుగా ప్రభావం చూపుతున్నాయి. జనసంఖ్యలో చాల తక్కువ అయినప్పటికీ యూదుల లాబీ అమెరికా సమాజాన్ని, ప్రభుత్వాన్ని నిర్దేశిస్తున్నది. మరోమాటలో చెప్పాలంటే యూదుల లాబీ అమెరికా ప్రభుత్వాన్ని నిర్దేశించడం ద్వారా, మల్టీనేషనల్ కంపెనీల ద్వారా ప్రపంచాన్ని నిర్దేశిస్తున్నది. అమెరికా ఇజ్రాయిల్ అనుకూల విధానాలకు, ముస్లిం వ్యతిరేక విధానాలకు అమెరికా మొత్తం సమాజం కాకుండా యూదు లాబీ ప్రధాన కారణం. సోవియట్ రష్యాలోను యూదుల లాబీదే పైచేయి. యూదుల లాబీలకు వ్యతిరేకంగా అమెరికాలో సంఘర్షణ సాగుతున్నది. యూదుల లాబీని అధిగమించి సాఫ్ట్‌వేర్ లాబీ ముందుకు వచ్చే క్రమంలో ఆయుధ లాబీ ప్రభావం వెనకబడి పోయింది.

ఆయుధ లాబీకి బుష్ విధానాలు, పార్టీ ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చింది. ఆయుధ లాబీ ప్రయోజనాల కోసం అమెరికా ఇతర దేశాల్లో యుద్ధాలను ప్రోత్సహిస్తూ తన ఆయుధాలను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. యుద్ధాల కోసం దేశాల్లో ఒక వర్గాన్ని ఆశ్రయిస్తూ, ప్రోత్సహిస్తూ అంతర్యుద్ధాలను సృష్టిస్తున్నది. ఆయుధ లాబీ సహకారం పొందిన వర్గాలు కొంతకాలం తరువాత ఆయుధ లాబీపై తిరుగుబాటు చేస్తున్నాయి. అప్పుడు ఆయుధ లాబీ వారిని అణచివేసే ప్రయత్నాలు ప్రారంభిస్తున్నది.

రష్యా జోక్యానికి వ్యతిరేకంగా ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా అందించిన ఆయుధ లాబీ సహకారం రష్యా వైదొలగడంతో ఆగిపోవడంతో పాటు అమెరికా అణచివేత మొదలయ్యింది. అప్పుడు బిన్‌లాడెన్ అందుకు ప్రతీకారంగా వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ని సెప్టెంబర్ 11న 2001లో కూల్చివేయడం జరిగింది. ఇలా ఆయుధాల లాబీ వల్ల అమెరికా ఒక సంక్షోభంలో కూరుకుపోయింది. దీన్ని ఆసరా చేసుకొని ఆయుధాల లాబీ ప్రతినిధి అయిన జార్జి బుష్ బిలియన్ కోట్ల డాలర్ల ఆయుధాల కొనుగోలుకై 20 సంవత్సరాలు దీర్ఘకాలిక ఒప్పందాలు చేసుకొని సమాజం మీద దాని భారాన్ని రుద్దడం జరిగింది. ఇలా సంక్షోభం మరింత పెరిగింది. ఒక లాబీ కోసం అమెరికా దేశం సంక్షోభంలో కూరుకుపోవడంతో అమెరికా ప్రజలు దాన్ని వ్యతిరేకించి నూతన ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. ఒబామా ప్రభుత్వం ఈ నేపథ్యంలో పని చేస్తున్నది.

అమెరికాలో సాఫ్ట్‌వేర్ లాబీ ఎదుగుతూ ఆయుధలాబిని వెనక్కి నెట్టడానికి, అమెరికా సామాజిక వర్గాలు ఎదుగడానికి అనువుగా, యూదుల లాబీ వెనక్కి నెట్టడం అవసరం. అందువల్ల ఆయుధ, ఫార్మా, ఇన్స్యూరెన్స్, విద్యారంగ లాబీలకు వ్యతిరేకంగా నూతన లాబీలను బలమైన సామాజిక వర్గాలను అన్ని రంగాల్లో ఎదిగించడం అవసరం. రాజకీయ అధికారం ద్వారా అన్ని రంగాల్లో వీటిని క్రమక్రమంగా ఎదిగించే కృషి జరగాలి. ఒబామా అలాంటి కృషిని తన పరిమితుల్లో ప్రారంభించాడు.

4. గ్లోబలైజేషన్ అనివార్యమైనప్పుడు ఏం చేయాలి?

వర్షం అనివార్యమైనప్పుడు ఏం చేస్తాం?

వర్షం అనివార్యమైనప్పుడు ఏం చేస్తాం? గొడుగులు వినియోగిస్తాం. చూరు నుండి పడే నీరును కుండల్లో, బిందెల్లో పట్టుకుంటాము. కాలువలు తీస్తాము. ఆ నీరు అవసరమైతే చెరువులు కడతాం. ప్రాజెక్టులు కడతాం. పంటలు పండిస్తాం. వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుంటాము. అలాగే గ్లోబలైజేషన్ అనివార్యమైతే దానిని తిడుతూ, విమర్శిస్తూ కూర్చుంటే అది మారుతుందా? మారడానికి ఏమి చేయకుండా కేవలం వ్యతిరేక ప్రచారం చేయడం ద్వారా వామపక్ష మేధావులు, పార్టీలు కూడా ప్రజల్ని వంచిస్తూనే వున్నాయి.

ప్రభుత్వాల్లో చేరకుండా బయట ఉంటూ, ప్రజల పక్షం వహిస్తున్నామంటూ ప్రజలను మోసం చేయడానికి వారు వేసే ఎత్తుగడ ఇది. ఈ పలాయనవాదం రాజ్య ప్రయోజనాలకు కొమ్ముకాయడంలో భాగమే. గ్లోబలైజేషన్‌ను ఎదుర్కోవాలి. పోటీపడి ఎదగడమే దీనికి పరిష్కారం. వెనుకబడిన వృత్తుల నుండి ఆధునికీకరించడమే ఇందుకు దేశీయ పరిష్కారం. ఆయా వృత్తి కులాలను, సామాజిక వర్గాలను, పారిశ్రామికవేత్తలుగా, కాంట్రాక్టర్లుగా, వ్యాపారవేత్తలుగా, విద్యాసంస్థల అధినేతలుగా ఎదిగించడమే సరైన పరిష్కారం.

పారిశ్రామిక విప్లవంతోనే కులవృత్తులు కాలం తీరిపోయాయా!

నిజానికి పారిశ్రామిక విప్లవం ప్రారంభమైనప్పుడే వ్యవసాయ సమాజంపై ఆధారపడిన వృత్తులు, కుటీర పరిశ్రమలు, ఉత్పత్తి విధానాలు, సేవలు కాలం తీరిపోయాయి. నూతన పారిశ్రామిక అభివృద్ధి కనువుగా దేశీయ మానవ వనరుల పనికల్పనను కూడా దృష్టిలో ఉంచుకొని ప్రత్యేకమైన అభివృద్ధి నమూనాలను రూపొందించుకోవాల్సి వుండింది. అది జరగలేదు. గ్లోబలైజేషన్ ప్రారంభమైన రెండు దశాబ్దాల తరువాత కూడా వారి ఆలోచనల్లో మార్పు లేదు. అందువల్ల ఆకలి చావులు, ఆత్మహత్యలు, పేదరికంలో మగ్గిపోవడం జీవితాలు శిథిలం కావడం పట్ల ఆవేదన చెందుతున్నారే తప్ప పరిష్కారాలు సూచించలేకపోతున్నారు. సాహిత్య, సామాజిక రంగాల్లో సామాజిక శాస్త్రాల్లో కూడా ఇదే దృష్టిలోపం కొనసాగుతున్నది.

నేను 2009 ఫిబ్రవరి-ఏప్రిల్‌లో అమెరికాకు వెళ్లి మూడు నెలలు వుండి అమెరికా సమాజాన్ని దగ్గరగా గమనించాను. వేల పేజీల సామాజిక రంగాల సాహిత్యాన్ని చదివాక భారతీయులు ఎంతగా వామపక్ష భావజాలంతో కప్పివేయబడ్డారో తెలిసి వచ్చింది. వామపక్ష భావజాలాన్ని వ్యతిరేకించడం, సమర్థించడం రెండూ వామపక్ష భావజాలంలో కూరుకుపోవడమే అని, జడత్వ భ్రామకంలో తిరగడమే అని అమెరికాలో మరింత స్పష్టంగా అర్థమైంది. మార్క్స్, ఏంగెల్స్‌లతో పాటు, వారి సమకాలీకుడైన అబ్రహాం లింకన్‌ను ప్రపంచ నాయకుల్లో ఒకరిగా ఎందుకు ముందుకు తీసుకురాలేదో ఆశ్చర్యం వేసింది. ఆచరణాత్మక మేధావి, నాయకుడు ఎన్నో అపజయాలు ఎదుర్కొంటూ పేదరికం నుండి పైకి వచ్చిన ప్రజాస్వామ్యవాది అబ్రహాం లింకన్.

ఉమ్మడి కుటుంబాలు పోయినా తిరిగి అలాంటి సామూహిక జీవితం అవసరమని జపాన్‌లో మెస్‌కు బదులుగా, హాస్టల్‌కు బదులుగా ఉమ్మడి కుటుంబంగా జీవించే స్వచ్ఛంద ఉమ్మడి కుటుంబాలు మొదలయ్యాయి. వాటిని అధ్యయనం చేయడం అవసరం. ఉమ్మడి కుటుంబాల్లోని అణచివేత, స్వేచ్ఛారాహిత్యం తొలగించి అందులో వుండే ఆనందం పొందే విధంగా వీటిని రూపొందించుకున్నారు.

అమెరికన్ సమాజం, యూరప్ సమాజం ఇప్పుడు వేర్వేరు దశల్లో లేవు. ఒకే రకమైన జీవితాన్ని, సంస్కృతిని ఆలోచనల్ని కలిగి జీవిస్తున్నారు. కుటుంబం, వ్యక్తి స్వేచ్ఛ, లైంగిక సంబంధాలు, మొదలైనవన్నీ ఈ దేశాల్లో ఒకే రకంగా పరిణామం చెందుతున్నాయి. ఇవన్నీ మంచికే దారితీస్తున్నాయా? అనర్థదాయకంగా ఉన్నాయా? అన్నది వేరే విషయం. భారతదేశం కూడా ఇదే క్రమంలోకి పరిణామం చెందుతున్నది. అభివృద్ధిని అందుకున్న సెక్షన్‌లు యూరప్, అమెరికా ప్రజల్లాగే ఆలోచిస్తున్నారు, జీవిస్తున్నారు. ఆసియా దేశాల సంస్కృతి, లైంగిక సంబంధాల విషయంలో కాస్త ప్రత్యేకంగా కొనసాగుతున్నది. అయినప్పటికీ కుటుంబం విషయంలో, ఆర్థిక విషయంలో, వ్యక్తి స్వేచ్ఛ విషయంలో ఇతర దేశాల ప్రజల్లాగే పరిణామం చెందుతున్నారు. ఉత్పత్తి విధానాలు, మార్కెటింగ్, సైన్స్ ప్రపంచమంతటా ఒకే రకంగా ఆచరిస్తున్నప్పుడు గ్లోబలైజేషన్‌లో పోటీ పడి తన వాటాను గెలుచుకోవాలి.

5. ఆధునిక అభివృద్ధి, విద్య సామాజిక పరిణామాలు

ప్రపంచంలో పారిశ్రామిక విప్లవం 1750లో మొదలైనప్పటికీ, 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ 1995 నాటికి కూడా వేలయేళ్ల నాటి గ్రామీణ వృత్తులు, జీవన విధానం, కులవృత్తులు, వృత్తి నిపుణులు కొనసాగుతూ వచ్చారు. ప్రభుత్వాలు ఆధునిక అభివృద్ధిని, పారిశ్రామికీకరణను వేగవంతం చేయకుండా యథాతథ స్థితికనుకూలంగా కొనసాగిస్తూ రావడం వల్ల చావలేక, బతకలేక ప్రజలు ఆయా వృత్తులను పట్టుకొని వేలాడుతూ వచ్చారు. చైనాలో, రష్యాలో ఈ దశనుండి సామూహిక కమ్యూన్, సోవియట్ మాన్యుఫ్యాక్చరింగ్, ఫ్యాక్టరీ, ఇండస్ట్రీ రంగాల్లోకి ప్రజలను తీర్చిదిద్దారు. వారి జీవన ప్రమాణాలు, నైపుణ్యం పెరిగాయి. ఉత్పత్తి పెరిగింది. పెరిగిన అదనపు ఉత్పత్తి కొన్ని దశాబ్దాల తరువాత అమెరికా వంటి దేశాలకు చైనా ఎగుమతి చేయగలుగుతున్నది.

ఇందుకు భిన్నంగా భారతదేశంలో సామాజిక, ఆర్థిక రంగాల్లో పరిణామాలు కొనసాగాయి. అందరూ చదువుకుంటే మనను ఎన్నుకునేది ఎవరు? మన ప్రభుత్వాలు ఉంటాయా? ప్రజలు మన మాట వింటారా? అప్పుడు మననే ఎందుకు ఎన్నుకుంటారు? అని ఇందిరాగాంధి కూడా భావించింది. సరిగ్గా ఈ దిశలోనే దేశంలో అగ్రకుల పాలకవర్గాలు భావించాయి. అందువల్ల కేవలం పదేళ్లలో అందరినీ విద్యావంతులను చేసి పారిశ్రామికీకరణ వైపు సమాజాన్ని ముందుకు నడపాల్సిన అవసరాన్ని పక్కకు నెట్టి ఆయా పాత వృత్తులకు సబ్సిడీలు, సహకార రంగం పేరిట, ప్రజాపంపిణీ వ్యవస్థ పేరిట ప్రజల అవసరాలను తీర్చుతున్నట్టుగా నటించారు. ఆ నటన ప్రపంచీకరణ మొదలయ్యేదాకా బాగానే సాగింది.

నిజానికి భారతదేశంలో 1970 నుండే ఉపాధి రంగంలో సంక్షోభం మొదలయ్యింది. ఇందిరాగాంధీ 'గరీబీ హఠావో' అనే నినాదమిచ్చి ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా, సంక్షేమ పథకాల ద్వారా ప్రజల్ని వారి అసంతృప్తిని చల్లార్చే ప్రయత్నాలు చేశారు. వనరులపై సాంప్రదాయక వృత్తికులాల అదుపును వదులు చేసారు. కొందరు మేధావులు ఈ సంక్షోభాలకు వేరే మార్గాన్ని అన్వేషించారు. కుటుంబ నియంత్రణ ప్రాధాన్యతను ముందుకు తెచ్చారు. అలా జనాభా నియంత్రణ జరుగుతూ వచ్చింది. దానివల్ల మేమిద్దరం, మాకు ఇద్దరు, మేమిద్దరం, మాకు ఒక్కరు అనే భావన క్రమంగా మారుతూ వచ్చింది. ఇద్దరు కలిసి ఒక్కరిని పెంచి, పోషించుకుని పెద్దవారిని చేయలేమా? అని ప్రజలు తమ రెక్కల కష్టంపై నమ్మకం పెట్టుకున్నారు. ఆ నమ్మకమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సంక్షోభంలోకి నెట్టి వేయకుండా కాపాడాయి.

కానీ 1980 నుండి సామాజిక పరిణామ క్రమంలో, 1985 నుండి గ్లోబలైజేషన్ పరిణామ క్రమంలో ప్రజల ఉపాధి, జీవన ప్రమాణాల సంక్షోభం తీవ్రమవుతూ వచ్చింది. పారిశ్రామిక ఉత్పత్తులు, సేవారంగాలు లాభాల యావతో గ్రామీణ స్థాయి దాకా అన్ని స్థాయిల్లోకి విస్తరించాయి. సేవలు, సలహాలు, కనీస అవసరాలు, వ్యాపార ధోరణిని సంతరించుకున్నాయి. మార్కెట్ సరుకులుగా మారిపోయాయి.

ఉదా.కు తొలుత 1950-60ల్లో అందరూ సైకిల్ కొనుక్కోవాలనుకున్నారు. ఆనాటికి అది గొప్ప. 1980 నాటికి స్కూటర్లు, సైకిల్ మోటార్లు కొనుక్కునే జీవన ప్రమాణాలకు చేరుకున్నారు. డబ్బా రేడియోల నుండి ట్రాన్సిస్టర్‌లకు, టూ-ఇన్-వన్‌లకు మారారు. పోస్టుకార్డుల నుండి ఫోన్‌లకు మారారు. సైకిల్ మోటార్ల నుండి కార్లలోకి మారడం మొదలైంది. సంపన్నులతో పాటు మధ్యతరగతి, ఉద్యోగ జీవులు కూడా వీటిని సమకూర్చుకునే విధంగా జీతభత్యాలు, అవినీతి, లాభాలు సంపాదించడం కోసం నానా తిప్పలు పడ్డారు.

అలా మూడింట ఒకవంతు జనాభా మధ్య తరగతిగా వివిధ పద్ధతుల్లో ఎదుగుతూ వచ్చి రెండోతరంలో అనేక రంగాల నుండి వచ్చిన వారి మధ్య కంచం పొత్తు, మంచం పొత్తు, సంస్కృతి, స్నేహాలు మొదలైనవి సమన్వయం చేసుకుంటూ వచ్చారు. ఇందుకు సినిమాలు, పత్రికలు, పాఠ్యపుస్తకాలు, ట్రేడ్ యూనియన్‌లు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

అటు తరువాత టీవీలు వచ్చాయి. ఫ్రిజ్‌లు వచ్చాయి. కూలర్లు, ఏసీలు వచ్చాయి. కంప్యూటర్లు వచ్చాయి. సెల్‌ఫోన్లు వచ్చాయి. ఏటిఎమ్ కార్డులు వచ్చాయి. వీటిని కూడా మధ్యతరగతి సమకూర్చుకుంటూ వస్తున్నది. అందుకనుకూలంగా తమ సంపాదనను, ఆదాయాన్ని ఎలాగోలా పై విధంగా పెంచుకుంటూ వస్తున్నది. ఇవన్నీ కలిసి సంఘటిత రంగం శక్తివంతమై బలపడింది. ప్రభుత్వాలను, యాజమాన్యాలను నిలదీసి తమ ప్రయోజనాలను నెరవేర్చుకున్నాయి. వాటికి ప్రభుత్వాలు, ప్రైవేటు యాజమాన్యాలు తలవంచక తప్పలేదు. తద్వారా బడ్జెట్లలో గణనీయంగా ఈ వర్గాలకు కేటాయించక తప్పలేదు. ధరలు పెరుగుతూ పోయాయి. సేవారంగం రేట్లు తోచినట్లుగా పెంచారు. కానీ మూడింట రెండువంతులు వున్న అసంఘటిత రంగం లేదా పేదలు వీటిని అందుకోలేకపోయారు.

ప్రభుత్వాలు, ప్రణాళికా సంఘాలు ఇందుకు కృషి చేయలేకపోయాయి. పాపులర్ నినాదాల ద్వారా ఓట్ల రాజకీయాలకు పాల్పడి లక్షల కోట్ల సంపదను పెట్టుబడిగా మార్చి కోట్లాది మందికి నూతన నైపుణ్యం, ఉపాధి సమకూర్చే స్థానంలో ఉన్నచోటనే ఉంచి వారికి సబ్సిడీలు, తదితర ఏర్పాట్లు చేసారు.

ఇదంతా మానవీయ విలువల కోణంలో బాగానే ఉంది. కానీ ఆర్థికాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి కోణంలో దేశం ఎంతో వెనుకబడిపోయింది. ఇతర దేశాలతో పాటు అభివృద్ధిలో పోటీ పడలేకపోయింది. పోటీని ఇవ్వలేకపోయింది. ఇదంతా పాలకవర్గాలకు తెలుసు. మధ్యతరగతి మేధావులకు తెలుసు. అయినా సామాజిక పరిణామంలో వాళ్లు ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా మౌలిక పరిణామాలను వేగవంతం చేయలేకపోయారు.

బ్లాక్‌మనీ, స్విస్‌బ్యాంకులు

మరోవైపు పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, బ్లాక్‌మార్కెటీర్‌లు, కాంట్రాక్టర్లు సినిమా రంగాల వాళ్లు, రాజకీయ నాయకులు, మాఫియా గ్యాంగులు, తమ అక్రమ సంపాదనను విదేశాలకు తరలించి స్విస్‌బ్యాంకుల్లో దాచిపెట్టారు. దేశీయ అభివృద్ధికి ఉపయోగపడకుండా చేశారు. తద్వారా లక్షల కోట్ల డాలర్ల సంపదను, పెట్టుబడిని వాళ్లు ఇతర దేశాలకు తరలించుకుపోయినట్టయింది. దేశంలోని ప్రజలు, ప్రభుత్వాలు ఆదాయం లేక పేదరికంలో వెనుకబడిపోవడానికి కారకులయ్యారు.

స్విస్ బ్యాంకుల్లో దాచిన భారతీయుల సంపద తిరిగి భారతదేశానికి రప్పించి సమస్త రంగాలను అభివృద్ధి పరిస్తే అమెరికాతో పోటీపడకపోయినా జపాన్ స్థాయిలో అన్ని రంగాల్లో అగ్రరాజ్యంగా, సంపన్న దేశంగా అయిదేళ్లలోనే ఎదుగుతుంది. అనగా గత యాభయ్యేళ్లుగా ఈ సంపన్న వర్గాలు దేశం పేదరికంలో మగ్గిపోవడానికి ప్రధాన కారణమని స్పష్టమవుతున్నది. దేశంలోని సంపదను దోపిడీ చేయడమే కాకుండా ఆ సంపద ద్వారా దేశంలో పరిశ్రమలు, సైన్సు, ఉపాధి అవకాశాలు అభివృద్ధి చెందకుండా ఇతర దేశాలకు తరలించి దాచుకోవడం దేశ ద్రోహం కన్నా హీనమైన నేరం.

బంగారం - ఆర్థిక వ్యవస్థ పరిణామాలు

దేశంలోని సంపన్నులు, మధ్యతరగతి ప్రజలు చివరకు పేదలు కూడా ఏటా బంగారం కొంటూనే వున్నారు. దేశంలోని బంగారం చాలక ఇతర దేశాల నుండి టన్నుల కొద్దీ దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. 75 వేల కోట్ల రూపాయలను అందుకు వెచ్చించాల్సి వస్తున్నది. బంగారంలో పొదుపు చేయడం ద్వారా సంపద పెట్టుబడిగా మారడం లేదు. బంగారం ప్రభుత్వం దగ్గర ఉంటే పెట్టుబడిగా మారుతుంది. బంగారం ఇంతగా ప్రజల దగ్గర ఉండే దేశం భారతదేశం ఒక్కటే. అంతర్జాతీయ కరెన్సీ విలువల నిర్ణయంలో బంగారం పాత్ర ప్రధానమైనది. ఆ రీత్యా తీసుకుంటే దేశంలో వున్న బంగారం ప్రభుత్వం దగ్గర దాచి పెడితే రూపాయి విలువ ఎంతో పెరుగుతుంది. పెట్టుబడి ఎంతో అభివృద్ధి చెందుతుంది. తద్వారా ఉపాధి అవకాశాలు, జీవన ప్రమాణాలు పెరుగుతాయి.

ఒక యువకుడు అన్నట్టు ఒకరి వద్ద రెండు నుండి ఐదు తులాలకు మించి బంగారం ఉంచుకోవడం నేరం అనే చట్టాలను కుటుంబ నియంత్రణ వలె ప్రచారం చేస్తూ తద్వారా దేశానికి ఎంత మేలు జరుగుతుందో ప్రజలకు చెప్పగలిగితే దేశంలో పెట్టుబడులు, ఉత్పత్తులు, ఉపాధి అవకాశాలు రెట్టింపు అవుతాయి. స్విస్ బ్యాంకుల్లోని డబ్బును, ప్రజల వద్ద పేరుకుపోయిన బంగారాన్ని రెంటిని కలిపి సమాజ సంపదగా ఉపయోగంలోకి తీసుకురాగలిగితే భారతదేశం ప్రపంచంలోనే ఒక గొప్ప దేశంగా అభివృద్ధి చెందుతుంది. తద్వారా దేశీయ సంస్కృతి, విలువలు, ఆత్మీయ కుటుంబ వ్యవస్థ, కుటుంబ సంబంధాలు ఇతర దేశాలు ఆదర్శంగా స్వీకరించే క్రమం కూడా పెరుగుతుంది. ఇలా దేశీయ సామాజిక, సాంస్కృతిక గౌరవాలను, ఆధిపత్యాన్ని ప్రపంచమే స్వయంగా అంగీకరిస్తుంది.

6. సామాజిక పరిణామాలు : వాస్తవాలు - సిద్ధాంతాలు

ఇండియా, చైనా తదితర నూతనంగా స్వాతంత్ర్యం పొందిన దేశాల్లో దేశ పునర్నిర్మాణం కోసం కృషి సాగింది. జపాన్ జర్మనీ వంటి దేశాలు ప్రపంచ యుద్ధాల విధ్వంసం నుండి తిరిగి తమను తాము పునర్నిర్మించుకునే కృషి చేశారు. స్వాతంత్ర్యానంతరం సాహిత్య, సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక, భావజాల రంగాల్లో, అలంకార శాస్త్రాల్లో, సామాజిక శాస్త్రాల్లో భారత రాజ్యాంగ ఆదర్శాలు, మార్గదర్శకాలు వెంటనే చోటు చేసుకోలేకపోయాయి. పాత అభిప్రాయాలు, సంస్కృతి, విలువలు, సాహిత్య విలువలే కొనసాగాయి. ఇలా సాహిత్యం, కళలు, సామాజిక శాస్త్రాలు భారత రాజ్యాంగం కన్నా ఎంతో వెనుకబడి పోవడంతో పాటు పురోగామి శక్తులకు అడ్డంకిగా బలమైన సాధనాలుగా నిలిచాయి. వెనుకబడిన శక్తులు అభివృద్ధి చెందకుండా అడ్డుగోడగా నిలబడ్డాయి. ప్రభుత్వం డబ్బుతో కూడా ఇలా కొనసాగించడం వారికే చెల్లింది. ఇదంతా భారత రాజ్యాంగ మార్గదర్శక సూత్రాలకు, ఆదర్శాలకు వ్యతిరేకమైన ఆచరణ. ఇలాంటి అంశాలను రచయితలు, పరిశోధకులు, విశ్లేషకులు, జర్నలిస్టులు గమనించాలి. విశ్లేషించి చూపాలి.

లెఫ్టిస్టులు, రైటిస్టులు, హిందూమతత్వ వాద, ముస్లిం మతతత్వవాద ఉద్యమాలు, భావజాలాలు విప్లవోద్యమం అస్తిత్వవాదంలో కూరుకుపోయాయి. అనగా మొత్తం సమాజాన్ని పట్టించుకోవడంకాకుండా కొన్ని సెక్షన్ల గురించే తమను పరిమితం చేసుకున్నాయి. వాళ్లు సమాజంలోని మిగతా సెక్షన్లను ఆకర్షించే కృషి చేయకపోగా ఎవరైనా కవి సమ్మేళనం పేరిట, సాహిత్య సభల పేరిట అందర్నీ కలిపే ప్రయత్నం చేస్తూ వాటిని వ్యతిరేకించడం, ఫలానా వాళ్లు వస్తే మేము రాం అని అంటరానితనాన్ని పాటించడం వంటి భూస్వామ్య, కులాధిపత్య దృక్పథాలను ఆచరిస్తున్నారు. ఈ ధోరణి ఇటీవల వికృత రూపంలో ప్రదర్శితమవుతున్నది. ఎలక్ట్రానిక్ మీడియాలో కులాల వారీగా, అంతర్గత రాజకీయ ప్రయోజనాల దృష్టితోనే విశ్లేషణల పేరిట ప్రజలను తమకు అనుకూలమైన విధంగా మాయ చేస్తున్నారు. చెడును, నేరాలను, ఘోరాలను ఎక్కువ ప్రచారం చేసి గ్లామరైజ్ చేసి అవి పెరగడానికి పురికొల్పుతున్నారు. యాసిడ్ దాడి టీవీల్లో చూసి వందలమంది నేర్చుకుంటున్నారు. గ్లోబలైజేషన్ పరిణామాల పేరిట చెడును మరింత వ్యాప్తి చేస్తూ మంచికి ప్రచారం లేకుండా చేస్తున్నారు. మంచి వాళ్ల గురించి రాయడానికి, చూపడానికి వారికి అహంకారం, ఇగోలు, ఆధిపత్యవాదం అడ్డం వస్తున్నది.

1985 దాకా కొందరు సోవియట్ యూనియన్‌ను సోషల్ సామ్రాజ్యవాదంగా ప్రపంచ ప్రజలకు అమెరికా వలెనే, మరికొందరు అమెరికా కన్నా ఎక్కువగా శత్రువుగా వర్ణించారు. అది కుప్పకూలి పోయాక అయినా అంతదాకా చెప్పిన తమ వర్ణన దాని ప్రాతిపదికను అవాస్తవికమని, పొరపాటేనని చెప్పలేకపోయారు. ప్రపంచీకరణను, సామ్రాజ్యవాదాలను వ్యతిరేకిస్తూ మాట్లాడే కొందరు వారి పిల్లలను బంధుమిత్రులను విదేశాలకు పంపి సుఖాలబాట పట్టించారు. డాలర్ల పంటలను కోసుకోమని చెప్పారు. దేశంలో ఉండి ప్రైవేటు, ప్రభుత్వ రంగాల్లోని యజమానులకు చక్కని సేవలందిస్తూ, సలహాలిస్తు వారి అభివృద్ధికి సహకరిస్తూ సామాజిక గౌరవాలను, జీతాలను, జీవితాలను గెలుచుకుంటున్నారు.

1985లో సోవియట్ యూనియన్ 13 దేశాలుగా విడిపోయాక మూడు ప్రపంచాల వర్ణన, రెండు ప్రపంచాల వర్ణన మూలకు పడిపోయింది. కానీ ఈ చర్చలతో అనేక మంది చీలిపోయారు. బయటి ప్రపంచం చర్చల మీద దృష్టి పెట్టి దేశీయ సమస్యలను, కుల సమస్యను, బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజల అభివృద్ధిని చర్చలోకి రాకుండా, ప్రాధాన్యత లేకుండా చేయడానికే చాలా దూరదృష్టితో ఇలాంటి చర్చను ముందుకు తెచ్చారు. పార్లమెంటులో గ్రామీణ, వ్యవసాయ, అసంఘటిత రంగ కార్మికులకు ప్రావిడెంట్ ఫండు ఖాతా, జీవన భద్రత గురించిన బిల్లు పదేళ్ల నుండి పెండింగ్‌లో ఉన్నప్పటికీ దాని గురించి ప్రభుత్వాలకు అల్టిమేట్టమ్‌లు ఇవ్వడం గాని, మద్దతు ఉపసంహరించుకోవడం గాని చేయలేదు. అదే సమయంలో మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్ల గురించి తీవ్రంగా చర్చించారు.

అణు ఒప్పందం పేరిట సిపిఎమ్ వారు కాంగ్రెస్ ప్రభుత్వానికి 2008లో మద్దతు ఉపసంహరించారు. అంతేగానీ అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం పార్లమెంటులో పెండింగ్‌లో వున్న ప్రావిడెంట్ ఫండు బిల్లు ఆమోదించాలని గాని, బీసీలకు, మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు ఆమోదించాలని గాని హెచ్చరిస్తూ ప్రభుత్వాలకు మద్దతు ఉపసంహరించలేకపోయారు. ఇలా దాని వర్గ స్వభావం స్పష్టమైంది. సిపిఎమ్ పాలిత పశ్చిమ బెంగాల్‌లో నేటికీ బీసీ రిజర్వేషన్లు లేవు అనే విషయాన్ని మనం ఇక్కడ గమనించాలి. రాష్ట్రంలో, దేశంలో సిపిఎమ్ ఐడియాలజీ బీసీలకు ప్రధాన శత్రువుగా ఎలా కొనసాగుతున్నదో విశ్లేషించే కథలు, నవలలు, జర్నలిస్టిక్ విశ్లేషణలు ఎంతో అవసరం. ట్రేడ్ యూనియనిజం పేరిట ఆర్థికవాదం ఊబిలో దించి వీరు మాయ చేస్తుంటారు, మభ్య పెడుతుంటారు. ఒక వృత్తి నుండి మరొక వృత్తికి ఎదగడానికి వీరి ఉద్యమాలు చైతన్యాన్ని కలిగించకపోవడంలోనే వీరి అగ్రకుల తత్వ దృష్టి కొనసాగుతున్నది.

ఇలా దేశీయ సమస్యలను, ప్రజలను, పేద ప్రజల అభ్యున్నతిని, దేశం సుసంపన్నం కావడాన్ని అప్రధానం చేసి అంతర్జాతీయ విషయాలను ప్రధానం చేసినట్లు నటిస్తూ యథాతథ వాదాన్ని వర్ణ, కుల వ్యవస్థలను, వాటి లాభోక్తులను అలాగే కొనసాగించడానికి రకరకాల

ఉపాయాలు చేస్తుంటారు. బ్రాహ్మణీయ, అగ్రకుల, హిందూ మతతత్వవాదులు ప్రజలను ఎదగాలని, కులవృత్తులు వదిలేయాలని చెప్పకుండా హిందూ మతం గురించి, ముస్లిం, క్రైస్తవుల పట్ల ద్వేషం ప్రచారం చేస్తూ అదే జీవిత సమస్య అన్నట్టుగా ప్రజలను తప్పుదారి పట్టిస్తుంటారు.

ఇలా లెఫ్టిస్టులు, రైటిస్టులు ఇద్దరు ప్రజలను తప్పు దారి పట్టించడానికి, రెండు అబద్ధాల నడుమ ఒక సత్యాన్ని ఇరికించి మూడు సత్యాలే అని నమ్మించే ప్రయత్నం చేస్తూ తమ ప్రయోజనాలను, ఆధిపత్యాలను, నాయకత్వాలను నిరంతరం పెంచుకుంటూ పోతుంటారు.

ఇలా అనేక కారణాల్లో భాగంగానే అంతర్జాతీయ పరిణామాలను, గ్లోబలైజేషన్ పరిణామాలను ప్రధాన సమస్యగా ముందుకు తెచ్చి అంతర్గత, స్థానిక, నిర్దిష్ట సమస్యలను, కుల సమస్యను, భూమి సమస్యను, వృత్తుల సమస్యను, కులవృత్తుల సమస్యను, ఆధునిక విద్య అందరికీ అందించాల్సిన సమస్యను గ్లోబలైజేషన్‌కు అంటకట్టి ఆధిపత్య వాదులు, లాభోక్తులు సమస్యను, వాటి పరిష్కారాలను పక్కదారి పట్టిస్తున్నారు. వాయిదా వేస్తున్నారు. **తమ వల్లనే శతాబ్దాలుగా సమాజం ఇలా ఏడ్చిందని అంగీకరించడానికి సిద్ధంగా లేకపోగా ఇంకెవడో బయటివాడు దీనికి కారణమని చూపిస్తుంటారు.**

గ్లోబలైజేషన్ చర్చ రాగానే భూస్వామ్య వ్యవస్థ అని మాట్లాడిన వాళ్లు కూడా భూస్వాములను వదిలేశారు. ఆ చర్చే కనబడకుండా చేశారు. వాళ్లేమైపోయారు? పారిశ్రామిక వేత్తలుగా ఆధునిక విద్య, ఉపాధి, ఇతర అవకాశాలు అందుకొని తిరిగి పాలకవర్గాలుగా మరింత సంపన్న వర్గాలుగా ఎదుగుతూ వచ్చారు. అవి నిజానికి ఎవరికి అందాలి? అవి అందడానికి, అందుకోడానికి ఎలా కృషి చేయాలో ఎవరు చెప్పారు? ఎందుకు చెప్పలేదు? ఈ లోపం వందలాది కథల్లో, నవలల్లో జర్నలిస్టిక్ విశ్లేషణలో, సామాజిక శాస్త్రాల్లో స్పష్టంగా కనబడుతుంది.

అమెరికా ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తున్నది గనుక అమెరికా సంక్షోభాలను పరిష్కరించినప్పుడు ప్రపంచంలోని సంక్షోభాలు కూడా పరిష్కరించబడతాయి. అందువల్ల అమెరికా సమస్య ప్రపంచ ప్రజల సమస్య. ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అధికార సమస్య భారతదేశ ప్రజల సమస్యగా మార్చబడింది. అత్యవసర పరిస్థితి దేశంలో పెట్టబడింది. లక్షలాది మందిని జైళ్ళలో పెట్టడం జరిగింది. కోట్లాది ప్రజలు అణచివేతకు గురయ్యారు. తిరుగుబాటు చేశారు. ఇందిరాగాంధీని ఓడించి జనతా పార్టీ ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారు. ఇలాగే అమెరికా సమస్య ప్రపంచ ప్రజల సమస్యగా రుద్దబడుతుంది. కనుక దాన్ని పరిష్కరించడం ప్రపంచ ప్రజలందరి సమస్యగా ముందుకు వచ్చింది. కనుక ప్రపంచీకరణ యుగంలో మొత్తం ప్రపంచం గురించి ఆయా దేశాల పరిణామాల గురించి, వాటి వనరులు, అభివృద్ధి, ప్రపంచంలో అది నిర్వహిస్తున్న పాత్ర, పొందుతున్న వాటా, ఎదుగుతున్న తీరు, వెనుకబడిపోతున్న తీరు మిగతా ప్రపంచంపై అవి వేస్తున్న ప్రభావాలు మొదలైనవన్నీ పరిశీలించడం, విశ్లేషించడం, కనీసం తెలుసుకోవడం అవసరం.

7. గ్లోబలైజేషన్-అస్తిత్వ ఉద్యమాలు నూతన సిద్ధాంతాలు

1980 నుండి సామాజిక, రాజకీయ రంగాలలో ప్రపంచ వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా అనేక సైద్ధాంతిక సంఘర్షణలు జరిగాయి. 1980 నుండి 1990 దాకా ఐక్యరాజ్యసమితి మహిళా దశాబ్దంగా ప్రకటించింది. మహిళా వాదం అన్ని రంగాల్లో విస్తృత ప్రాచుర్యం పొందింది. అనేక అంశాలను నూతన కోణాల్లో విశ్లేషించింది. సోవియట్ యూనియన్ గ్లాస్‌నాస్త్, పెరెస్త్రాయికా చర్చలు చేసి 13 దేశాలుగా 1985లో విడిపోయింది. డంకెల్ ప్రతిపాదనలు, గాట్ ఒప్పందం ప్రపంచ వ్యాప్తంగా వ్యవస్థీకృత రూపం ధరించడం ద్వారా గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్ ముందుకు వచ్చింది. అస్తిత్వ ఉద్యమాలు రకరకాల రూపాలు తీసుకున్నాయి.

ఆయా సామాజిక వర్గాలు తమ సొంత రాజకీయ అధికార వాటా కోసం ముందుకు కదిలాయి. వెనుకబడిన ప్రాంతాలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలతో ముందుకు సాగుతున్నాయి. స్త్రీలు చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం ఆందోళన చేస్తున్నారు. అభివృద్ధి చెందిన కులాల నుండి రక్షణ కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాల మధ్యన కూడా క్రీమీలేయర్ ఉండాలని, వద్దని సైద్ధాంతిక చర్చలు సాగుతున్నాయి. శాంతియుత ఉద్యమాల ద్వారా, చర్చల ద్వారా ప్రజాస్వామిక హక్కుల ద్వారా ఎంతమేరకు సాధించుకోవడం సాధ్యమో అంతమేరకు ఖచ్చితంగా కృషి చేయాల్సిందే అనే దృక్పథంతో అన్ని వర్గాలు కదులుతున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రారంభించిన విజయాలతో దేశం ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా ఎదుగుతున్నది. తాము కూడా ఎదిగి అవకాశాలు అందుకోవాలని యువతరం భావిస్తున్నది. పారిశ్రామికవేత్తలు కూడా ప్రపంచ వ్యాప్త మల్టీనేషనల్ కంపెనీలకు పోటీని ఇవ్వగలిగే స్థాయిలో ఎదుగుతున్నారు. కమ్యూనికేషన్ రంగం విస్తరించడం వల్ల ప్రపంచం రోజురోజుకూ దగ్గరవుతున్నది.

1980 నుండి బాబ్రీ మసీదును ఆక్రమించాలని, అది రామజన్మభూమి అని, రాముని గుడి కట్టాలని ఎల్.కె. అద్వానీ నాయకత్వంలో రథయాత్రలు మొదలైనప్పటి నుండి బ్రాహ్మణీయ, హిందూ అగ్ర కుల శక్తులకు వ్యతిరేకంగా సైద్ధాంతిక, సామాజిక సంఘర్షణలు జరుగుతూ వచ్చాయి. ఆర్.ఎస్.ఎస్, బీజేపీ బాబ్రీ మసీదు సమస్యను 1980 నుండి రామజన్మభూమి సమస్యగా ప్రచారం చేయడం, 1992 డిసెంబర్ 6న కూల్చివేయడం, దేశవ్యాప్తంగా ముస్లింలపై దాడులు ముస్లిం సమాజాన్ని అతలాకుతలం చేసింది. అభద్రతకు గురిచేసింది. సాంప్రదాయక ముస్లిం ఆలోచనా విధానం నుండి బయట పడి వర్తమాన సమాజంలో కొత్త కోణంలో తమను తాము పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని ముస్లింల్లో ఒక వర్గం గుర్తించింది.

1984లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యత గురించి బహుజన సమాజ్ పార్టీ జాతీయ స్థాయిలో, ఆ తరువాత 1985 జులై కారంచేడు సంఘటనల తర్వాత దళిత మహాసభ రాష్ట్ర స్థాయిలో సైద్ధాంతికంగా ముందుకు తెచ్చాయి.అదే సమయంలో నక్సలైట్ పార్టీల్లో, ప్రజా సంఘాల్లో స్త్రీ వాదం గురించి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల గురించి,

డా॥ బి.ఆర్. అంబేద్కర్‌ను సామాజిక విప్లవ కారుడిగా గౌరవించాలనే అంశం గురించి, కుల నిర్మూలనను, కుల వివక్షతను ఎజెండాలోకి తీసుకోవాలనే చర్చ గురించి, పార్టీల్లో, ప్రజా సంఘాల్లో, సిద్ధాంతాల్లో అగ్రకుల ఆధిక్యతా వాదం కొనసాగడం గురించి, తీవ్రమైన చర్చలు జరిగాయి.

1985లో సోవియట్ యూనియన్ 13 దేశాలుగా విడిపోయి సోషలిస్టు పంథాను వదిలి వేశాయి. గ్లాస్‌నాస్త్, పెరిస్త్రోయికా పేర్లతో సైద్ధాంతిక చర్చలను వేగవంతం చేసి ఓటు హక్కును, బహుళపార్టీ ప్రజా స్వామ్యాన్ని నెలకొల్పారు. వీటి నుండి చైనా పార్టీ కొన్ని గుణపాఠాలు తీసుకొని "కొద్ది మందిని ముందు సంపన్నం కానీయండి" అనే నినాదంతో పెట్టుబడి దారులను, పారిశ్రామిక వేత్తలను రూపొందించే కార్యక్రమంతో ముందుకు సాగింది.

ఇది జాతీయ బూర్జువాను సోషలిస్టు దేశంలో కూడా అవసరమే అనే అవగాహనతో సాగించారు. వీటిని మార్గదర్శకంగా స్వీకరించి వామపక్షాలు, నక్సలైట్లు మనదేశంలో సామాజికవర్గాల వారీగా జాతీయ పారిశ్రామిక వేత్తల అభివృద్ధి గురించి, పారిశ్రామిక అభివృద్ధి గురించి కాదుగదా కనీసం మధ్య తరగతి గురించి గానీ, చేతివృత్తులు కోల్పోతున్న పల్లెప్రజల గురించి గానీ ఎలాంటి కార్యక్రమాలు రూపొందించలేకపోయారు.

ఇలా ప్రపంచ సామాజిక పరిణామాల నుండి భారతదేశంలోని వామపక్షాలు, నక్సలైట్ పార్టీలు ఏమీ నేర్చుకోలేక పోయాయి. స్వీకరించలేక పోయాయి. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా సామాజిక శక్తులు నూతన సామాజిక పరిణామాలను అనుసరించి నూతన సైద్ధాంతిక పునాదులను వేసుకుంటూ ముందుకు సాగాయి.

స్వాతంత్ర్యానంతరం అధికారం అన్ని రంగాల్లో అందిపుచ్చుకున్న అగ్ర కులాలు, పాలక వర్గాలు, పారిశ్రామిక వేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు, విద్యావంతులు అభివృద్ధిలో వెనుకబడిన, అభివృద్ధిలో అణిచివేయబడిన వర్గాల కులాల, ప్రాంతాల ప్రజల భావజాలాన్ని అనేక విధాలుగా థాట్‌పోలిసింగ్‌తో నియంత్రించారు. కర్మ, పునర్జన్మ, తెలివితక్కువ తనం, నైపుణ్యం తక్కువ, విద్య తక్కువ, కులం తక్కువ మొదలైన అనేక సిద్ధాంతాలను ప్రజల మీద నిరంతరం ప్రచారం చేశారు.

ప్రతిభా సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చి అవకాశాలు ఇవ్వకుండానే మీకు ప్రతిభ లేదని కించ పరిచారు. అవమానించారు. ఆధునిక విద్యను కొన్ని వర్గాలు, కొన్ని కులాలే అందుకొని మిగతా వారిని అందుకు అర్హత లేదని హేళన చేశారు. ఆత్మగౌరవాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, ఉత్సాహాన్ని పెంచే బదులు చంపే ప్రయత్నాలు చేశారు. అందుకు అనేక సిద్ధాంతాలు ఉపయోగపడ్డాయి.

మరొకవైపు అధికారం అందని ప్రజలు, పారిశ్రామిక ఉత్పత్తి విధానం వల్ల వృత్తులు కోల్పోయిన కుల వృత్తుల ప్రజలు జాతీయోద్యమ కాలం నుండి సంఘాలుగా ఏర్పడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ సంఘాలు తమ ఓటు హక్కు ద్వారా తమ కులాల వారిని ఎన్నుకుని చట్టసభలకు పంపి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయించాలనే

దృష్టి లోపించింది. కాంగ్రెస్ పార్టీ దార్శనికత, గాంధీవాదం, నెహ్రూవాదం దీన్ని మనసులోకే రాకుండా చేసింది. అంబేద్కరిజం ఒక్కటే దీన్ని ప్రజల మనస్సులో ప్రవేశపెట్టింది. సమాంతర, ప్రత్యామ్నాయ భావజాలాన్ని, సిద్ధాంతాలను, చరిత్రను అంబేద్కరిజం ముందుకు తెచ్చింది. పెరియార్ రామస్వామి నాయకర్ ద్రావిడ ఉద్యమం పేరిట ఆర్య, ద్రావిడ చారిత్రక పరిణామాల పేరిట అంబేద్కరిజం లాగే బ్రాహ్మణ వాద వ్యతిరేక సిద్ధాంతాలను చరిత్రను, రాజకీయాలను ముందుకు తెచ్చారు.

పూర్వం ప్రభుత్వ ఉద్యోగాలు బాగా తక్కువ. ప్రభుత్వ ఉద్యోగం చేయడం దిక్కులేని వారు చేస్తారు అనే భావన ఉండేది. క్రమంగా 1965-70 నాటికి ప్రభుత్వ ఉద్యోగాల పట్ల ఆసక్తి గౌరవం పెరిగింది. ప్రభుత్వ ఉద్యోగాలు బాగా పెరిగాయి. ప్రభుత్వేతర రంగాల్లోకూడా ఉద్యోగాలు పెరిగాయి. పరిశ్రమలు పెరిగాయి. సంఘటిత రంగం పెరిగింది. వికేంద్రీకృత వృత్తులు వాటి ఉత్పత్తులు తగ్గాయి. వాటి మార్కెట్ కూడా కష్టమైపోయింది. ఇలాంటి వాటి వల్ల ఉత్పత్తిదారులకన్నా వాటిని అమ్ముకునేవారికే ఎక్కువ లాభం వచ్చేది. భారీ పరిశ్రమలు, భారీ ఉత్పత్తులు పెరిగాయి. తద్వారా సరుకుల రవాణా పెరిగింది. రోడ్ల అవసరం పెరిగింది. పర్యవసానంగా స్థానిక ఉత్పత్తులు పడిపోయాయి. స్థానికులు ఉపాధి కోల్పోయాయి. దాంతో ఇతర ప్రాంతాలకు వలసలు పెరిగాయి.

చదువుకున్న యువకులకు ఉద్యోగాలు దొరకక పోవడంతో ప్రైవేటు స్కూళ్ళు ప్రారంభమయ్యాయి. ఇతర రాష్ట్రాల నుండి మొదట స్కూళ్ళు పెట్టారు. కొందరు నడవక వెళ్ళిపోయారు. కొందరు స్థిరపడ్డారు. 1980 నాటికి ప్రైవేటు స్కూళ్ళ ప్రాధాన్యత పెరగడం ప్రారంభమైంది. మొదట్లో ప్రభుత్వ స్కూళ్ళలో పనికి రాని పిల్లలను ప్రైవేటు స్కూళ్ళలో వేసేవారు. 1980 నాటికి ప్రైవేటు స్కూళ్ళలో పిల్లలను వేయడం గౌరవ ప్రదంగా మారింది.

1990 నుండి సాఫ్ట్‌వేర్ రంగంలో, కమ్యూకేషన్ రంగంలో, టీవీ రంగంలో ఉపాధి అవకాశాలు పెరిగాయి. వై2కె కోసమని లక్షలాది మంది కొద్దిపాటి శిక్షణతో సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్‌లుగా ఉద్యోగాలు పొందారు. 1990 నాటికి ఇంజనీరింగ్ సీట్లు ఆరువేలు మాత్రమే ఉండేవి. ఇప్పుడు అన్నీ కలిసి లక్షాయాభైవేలు దాటిపోయాయి.

ఈ రంగాల్లో ఒక కొత్త తరం పారిశ్రామిక వేత్తలు మధ్య తరగతి నుండి ఎదిగారు. పాత పారిశ్రామిక వేత్తలు ఆలస్యంగా కళ్లు తెరిచారు. టిసిఎస్, రిలయన్స్ మొదలైన సంస్థలు పెద్ద ఎత్తున పెట్టుబడులతో ఈ రంగంలోకి దిగితే తప్ప ఈ మధ్య తరగతి నుండి ఎదిగిన కంప్యూటర్ పారిశ్రామికవేత్తలతో పోటీలో అందుకోలేము అని గమనించి వేల కోట్ల రూపాయలను పెట్టుబడులుగా తమ ఇతర సంస్థల నుండి, బ్యాంకుల నుండి సేకరించి కుమ్మరించారు.

అలా మరిన్ని సంస్థలు, ఉద్యోగావకాశాలు పెరిగాయి. లక్షలాది ఉద్యోగాలు లభించాయి. ఇలా కంప్యూటర్ ఆపరేటర్‌లు, రిపేరర్‌లు, డిటిపి, కంపోజిటర్లు మొదలైన రంగాలు కూడా విస్తరించాయి. ఇలా రాష్ట్రంలో రెండు లక్షలమందికిపైగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, మరో రెండు లక్షల మంది కంప్యూటర్ ఆధారిత ఉద్యోగాలు పొందారు.

8. ప్రపంచీకరణ మార్గంలో ఫలప్రదమైన సందర్భాలు

గ్లోబలైజేషన్ లేకపోతే భారతదేశం ఎలా ఉండేది? అని ఇప్పుడు 2009లో ఆలోచించడానికే చాలా మంది మేధావులు భయపడతారు. కానీ, గ్లోబలైజేషన్ ప్రారంభమైనప్పుడు చాలామంది వ్యతిరేకించారు. ప్రతి మార్పులోనూ కొందరు ఉపాధి కోల్పోక తప్పదు. బాధితులు కాక తప్పదు అని కొందరు అప్పుడే చెప్పారు. పారిశ్రామిక విప్లవం వల్ల కోట్లాది మంది సాంప్రదాయిక కులవృత్తులు కోల్పోయారని, కులవృత్తులు గిట్టుబాటు కాకుండా పోయాయని కొందరు పారిశ్రామిక విప్లవాన్ని వ్యతిరేకించారు. అయితే, ఆయా కులవృత్తులు వదిలి ఇతర రంగాల్లో ఎదిగిన వాస్తవిక వాదులు ఆ వృత్తులేవో ఈ చెప్పేవాళ్లు ఎందుకు చేయకూడదనే ప్రశ్న లేవనెత్తి తమ వారిని ఆలోచింప చేశారు. కులవృత్తులు వదిలి ఆధునిక విద్య, ఉద్యోగాలను, ఆధునిక వృత్తి, నైపుణ్యాలను సాధించాలని వృత్తి కులాలకు చెందిన శ్రామికులకు బోధించారు. గ్లోబలైజేషన్ ప్రారంభమైనప్పుడు ఈ విధంగా వ్యాఖ్యానించి సమర్థించే మహా నాయకులు దేశంలో లేకపోవడం వల్ల ఆ ప్రక్రియ మన వద్ద పదిహేనేళ్ళు ఆలస్యంగా పుంజుకుంది.

గ్లోబలైజేషన్ ఫలాలను ఆయా మేధావుల, మధ్యతరగతి పౌరుల సంతతి అందుకున్నది. దళారీ బూర్జువాల నుండి మల్టీనేషనల్ బూర్జువాలుగా భారతీయ పారిశ్రామిక వేత్తలు, మార్కెటింగ్ శక్తులు ఎదిగాయి. మొన్నీమధ్య ఒక సీనియర్ జర్నలిస్టు, పత్రికా సంపాదకుడు గ్లోబలైజేషన్ గురించి మాట్లాడుతూ, గ్లోబలైజేషన్ లేకపోయి వుంటే నలభై ఏళ్ల లోపు యువకులు అంతా ఏమై ఉండేవారు? అని ఆశ్చర్య పడ్డారు. వాళ్ళు మహా అయితే, టీచర్లు, పోలీసులు, తీవ్రవాదులు, నిరుద్యోగులై ఉండేవారు. విశేషం ఏమిటంటే, ఇరవై లక్షల మంది గ్లోబలైజేషన్ వలన సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌గా ఉపాధి పొందారు. ఇంతమందికి టీచర్లు, పోలీసు ఉద్యోగాలు ఇవ్వడం జరిగే పనేనా? ఊహించడానికే కష్టంగా ఉంది. గ్లోబలైజేషన్ ఉండగానే ఇంతమంది పేదరికంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. గ్లోబలైజేషన్ లేకపోయుంటే ఇంకెంత మంది దారిద్ర్యంతో, నిరుద్యోగంతో ఆత్మహత్యలు చేసుకుని ఉండే వారో! అని ఆయన భయపడ్డారు. ఆనాడు గ్లోబలైజేషన్ వద్దన్న వాళ్ళు కూడా గ్లోబలైజేషన్ ప్రయోజనాలను ఇప్పుడు చక్కగా అనుభవిస్తున్నారు.

వెనకటి కాలమే బాగుండేదా?

ఆరెస్సెస్-బీజేపీ మేధావులు, కుల వ్యవస్థను, కులవృత్తులను సమర్థించే బుద్ధిజీవులు వెనకటి కాలమే బాగుండేది అని ప్రచారం చేస్తుంటారు. వెనకటి కాలమే బాగుండేదైతే ఆముదం దీపాలు, ఎడ్లబండి, గుర్రాలు, కత్తులు ఉపయోగించుకోవాలి. కరెంటు వాడకూడదు. సైకిల్, స్కూటర్, ట్రాక్టరు, బస్సు, జీపు, కారు, రైలు, తారు రోడ్లు, ప్రింటింగ్ టెక్నాలజీ, ఫొటోగ్రఫీ, సినిమా, టీవీ, పత్రికలు, ఫోన్, గ్యాస్ సిలిండర్ మొదలైనవి ఏవీ వాడకూడదు. కట్టెల పొయ్యితో వంట చేసుకోవాలి. గ్లోబలైజేషన్‌ను వ్యతిరేకించే వాళ్ళు దాని ప్రయోజనాలను పొందకుండా బతకగలగాలి. అనగా, ఏటిఎం కార్డులు, సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, బ్యాంకు ఖాతాలు, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, ఇంటర్నెట్ ఉపయోగించకూడదు. అలా

చేయగలరా? అలా చేసినప్పుడే గ్లోబలైజేషన్‌ను నిజంగా వ్యతిరేకిస్తున్నట్లు లెక్క.

ప్రజలు గ్లోబలైజేషన్‌ను వ్యతిరేకించే వారి మాటలు నమ్మలేదు. నమ్మిన వారు చెడిపోయారు. వెనుకబడి పోయారు. గ్లోబలైజేషన్ మూలంగా వచ్చిన అభివృద్ధిని కలిగిన ప్రయోజనాలను సక్రమంగా వాడుకున్న వారిని గెలుపు వరించింది. గ్లోబలైజేషన్‌లో ఆధునికి నైపుణ్యం గల సాఫ్ట్‌వేర్ వంటి వృత్తి నిపుణులకు అవకాశాలు విరివిగా పెరిగాయి. అయినా, మరోవైపు వేలాది మంది దారిద్ర్యంతో ఆత్మహత్యలు చేసుకోవడం ఆగిపోలేదు. అయినప్పటికీ, ఎందుకు కాంగ్రెస్ పార్టీ గానీ, అధికారంలో ఉన్న పార్టీలు గాని 2009 ఏప్రిల్ పార్లమెంట్, శాసనసభ ఎన్నికల్లో ప్రజల ఓట్లను పొందగలిగాయి? ఈ విషయం సామాజిక శాస్త్రవేత్తలు పరిశీలించాల్సిన అంశం.

పేద ప్రజలకు అందించాల్సిన ప్రయోజనాలను ప్రభుత్వం తరఫున కొన్ని అందడం వల్లనే ప్రజలు తిరిగి ఆ పార్టీలకు ఓటు వేశారు. వంద పని దినాల కల్పన అనేది ఆచరణలతో విఫలమవుతుందనే మాట తొలుత వినబడినా అనతికాలంలోనే అది నిజం కాదని తేలింది. దానివలన హెచ్చు స్థాయిలో ప్రయోజనం కలిగింది. అది ప్రత్యక్షంగా ప్రయోజనం కలిగించడమే కాకుండా, పరోక్ష ప్రయోజనం కూడా కలిగించింది. కూలీలు కావల్సిన రైతులు, ధనిక రైతులు ఈ వంద పని దినాల కల్పనను తిట్టుకున్నారు. పని మనుషులు దొరకడం లేదనే కాకుండా, ఎక్కువ కూలి అడుగుతున్నారని అక్కసు వెళ్లగక్కారు. వంద రూపాయలు కూలీ ఇవ్వడం కూడా చాలా ఎక్కువ అనుకునే వాళ్లే వీరంతా. అలా, కూలీలకు కూలిరేటు పెంచుకునే శక్తి పెరిగింది. రెండు రూపాయలకు కిలో బియ్యం, ఉచిత కరెంటు, ప్రభుత్వ ఇళ్లు, స్కాలర్‌షిప్‌లు వంటి సంక్షేమ పథకాలు పేదలను, దిగువ మధ్య తరగతి ప్రజలను ఎంతగానో ఆదుకున్నాయి. అందువల్లే గ్లోబైజేషన్ వల్ల నష్టపోతున్నప్పటికీ వాటికి ప్రత్యామ్నాయ సంక్షేమ పథకాలు అందడం వల్ల ప్రజలు అధికారంలో వున్న పార్టీలకు అనుకూలంగా స్పందించారు.

అయితే, గ్లోబలైజేషన్‌తో ప్రజలు నష్టపోయారా? ఆత్మహత్యలకు గ్లోబలైజేషనే కారణమా? అనేది పరిశీలించాల్సిన అవసరం ఉంది. అమెరికాలో అమ్మే సరుకుల్లో చాలామేరకు చైనా నుండి వస్తున్నవే. పది, పదిహేనేళ్ల క్రితం ఇండియా నుండి నలభై శాతం, చైనా నుండి అరవై శాతం సరుకులు అమెరికాకు దిగుమతి అయ్యేవి. ఇప్పుడు ఇండియా సరుకులు పది శాతానికి పడిపోయాయి. చైనా సరుకులు ఎనభై శాతం పైగా పెరిగాయి. ఇది ఎందువల్ల జరిగింది? భారతీయ ఎగుమతి దారుల మోసాల వల్ల అమెరికన్ మార్కెట్ ఇండియా సరుకులను తీసుకోవడం మానేసింది.

అమెరికాలో నమ్మకం మీద ఎక్కువ ఆధారపడతారు. ఇండియా సరుకులు నాణ్యత కొరవడిన ఫలితంగా అమెరికా ప్రజల విశ్వాసం కోల్పోయి ఎగుమతులు తగ్గాయి. దానివల్ల, ఇండియాలో లక్షలాది ప్రజలు ఉపాధి కోల్పోయారు. ఆకలిచావులకు గురి అయ్యారు. గ్లోబలైజేషన్‌లో అంది వచ్చిన అవకాశాలను మార్కెట్ శక్తులు దుర్వినియోగం చేయడం వల్ల భారతదేశంలో ఆకలి చావులకు కారణమయ్యారు. ఇకనుండైనా అమెరికా, యూరప్

దేశాల్లో భారతీయ ఉత్పత్తులు మరిన్ని రెట్లు కొనడానికి అనువుగా 'నమ్మకం' కలిగించే విధంగా నాణ్యతా ప్రమాణాలను పాటించి మార్కెట్ పెంచుకోవడం అవసరం. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతర్జాతీయ ప్రమాణా లను నిర్ధారించే ఒక యంత్రాంగాన్ని నియమించి బ్రాండ్ ఇమేజ్‌ను కల్పించడం అవసరం.

భారతదేశంలో ఉత్పత్తి చేసి ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్ చేయగలిగే ఉత్పత్తులు ఏవేవి అని పరిశీలించడం చాలా అవసరం. పుస్తకాల ముద్రణలో ఉన్నత ప్రమాణాలు సాధించిన ఇండియా ప్రపంచ వ్యాప్తంగా పుస్తకాలను పంపిణీ చేయవచ్చు. కానీ, ఇప్పుడు చైనాయే అంతటా ఆక్రమిస్తున్నది. అనగా, ఉత్పత్తి నాణ్యతలోనూ, ధరలోనూ చైనాతో పోటీపడి నెగ్గగలగాలి. అందుకు ఇప్పుడున్న ప్రచురణ సంస్థలు చాలవు. టాటా, రిలయన్స్, విప్రో వంటి సుస్థిరమైన పెద్ద సంస్థలు పెద్ద ఎత్తున చేపట్టాల్సిన ఉత్పత్తులు ఇవి. ఇలాగే, నాణ్యమైన రేడీమేడ్ దుస్తుల రంగంలో కూడా ప్రపంచ వ్యాప్తంగా ఇండియా ఉత్పత్తులకు అవకాశం ఉంది. వనమూలికల పెంపకం, ఆయుర్వేద మందుల అభివృద్ధి, పరిశోధన రంగాలు డాక్టర్లుగా, డ్రైవర్లుగా, మేస్త్రీలుగా, మేనేజర్లుగా ఇలా అనేక రంగాల్లోకి విస్తరించడం ద్వారా ఇండియాలో ఉత్పత్తి ఉత్పత్తులు, ఉపాధి అవకాశాలు పెంచవచ్చు. అందుకు అనువుగా ప్రజల నైపుణ్యాలను పెంచడం కూడా అవసరం. బడా కార్పొరేషన్లే ఇందుకు సరైనవి.

ఇంతకముందే వివరించిన విధంగా ఇండియాలోని వైద్య సేవా రంగంలో కూడా అమెరికా ప్రజలకు ఎన్ని సేవలైనా అందించవచ్చు. బహుళజాతి కార్పొరేట్ సంస్థలు అమెరికా లో వాటి శాఖలను, ఆసుపత్రులను స్థాపించి వైద్య సేవలను అందించచ్చు. 2007-09 సంవత్సరాల్లో అమెరికాలో రెండు కోట్ల మంది మెడికల్ ఇన్స్యూరెన్స్ చేసుకోలేకపోయారు. తక్కువ ఇన్స్యూరెన్స్‌పై అమెరికాలో వైద్య సదుపాయాలు కల్పించడం ఇండియాకే సాధ్యం.

రాష్ట్రంలో రెండు రూపాయలకు కిలో బియ్యంతో పాటు ఉద్యోగుల జీతాల పెంపుదల, విద్యార్థులకు ఫీజుల రీయింబర్స్‌మెంట్, పెన్షనర్లకు కూడా జీతాల పెంపుదల వర్తింప చేయడం ప్రజల్లో సానుకూల వాతావరణాన్ని సృష్టించాయి. గ్లోబలైజేషన్ బాధితులుగానీ, సంప్రదాయిక వృత్తులు కోల్పోయిన వారు గానీ, పేదలు గానీ వందరూపాయలకు నెలకు సరిపడా సరుకులు, నెలకు వెయ్యి రూపాయల నగదు బదిలీ పథకం వంటి సంక్షేమ పథకాలతో తిరిగి కోలుకుంటారు. ప్రతిపాదన ఏ పార్టీ చేసిందనేది ముఖ్యం కాదు, ఏ పార్టీ వెనక అయినా ఉండేది మేధావులే. అవన్నీ మేధావుల సూచనలే. మంచి ఎక్కడున్నా స్వీకరించాల్సిందే. ఒబామా తన పార్టీ వారు కాకపోయినా, ఎంతోమందిని ప్రభుత్వంలోకి తీసుకున్నారు. ఇతరులు చేసిన ఎన్నో సూచనలను అమలు జరుపుతున్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రతిపక్షాలు, మేధావులు ఏవైనా ఆచరణ యోగ్యమైన మంచి పథకాలను ప్రతిపాదిస్తే వాటిని పరిమిత స్థాయిలో ప్రయోగాత్మకంగా అమలు చేసి చూడాలి. రాబోయే కాలంలో గ్లోబలైజేషన్ ఉత్పత్తుల వల్ల, మార్కెటింగ్ వల్ల కోట్లాది మంది ప్రజలు నూతన ఉపాధి పొందే అవకాశంతో పాటు, పాత ఉపాధి, వృత్తి కోల్పోయే అవకాశమూ ఉంది.

– 'సాక్షి' దినపత్రిక ఆగస్టు, 2009 సంచిక సౌజన్యంతో

9. ప్రపంచీకరణలో ఉన్నత విద్యా లక్ష్యాలు ఇండియా అమెరికా సంక్షోభాలు, పరిష్కారాలు

ఆధునిక సమాజంలో ప్రాథమిక విద్య తర్వాత ఉన్నత విద్య లక్ష్యాలు ఎంత విస్తరిస్తే అంతగా సమాజం అభివృద్ధి చెందుతుంది. ఉపాధి కల్పనలో వైవిధ్యం పెరుగుతుంది. ఇటీవల 2009 ఫిబ్రవరి-ఏప్రిల్ మాసాల్లో అమెరికా పర్యటించిన సందర్భంగా విద్యారంగం గురించి పరిశీలించిన అంశాలను, భారతదేశంలోని విద్యారంగంలో సమన్వయించి వివరించడానికి ప్రయత్నిస్తాను. అమెరికాలో స్కూలు విద్య అంతటినీ ప్రభుత్వం ఉచితంగానే అందిస్తున్నది. 12వ తరగతి వరకు స్కూల్లో విద్య సాగుతున్నది. ఆ తర్వాత, నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ఉంటుంది. ఆ తర్వాత పీజీ కోర్సు ఉంటుంది.

ప్రపంచీకరణ యుగంలో విద్యావిధానం ప్రపంచంలో ఎక్కడైనా ఉపాధి సాధించుకునే విధంగా ప్రపంచమంతా ఒకే విధంగా ఉండడం అవసరం. రెండు దశాబ్దాల గ్లోబలైజేషన్ పరిణామాలు దేశాల సరిహద్దులను దాటి మనుషులను, మార్కెట్‌ను, అవకాశాలను, అవసరాలను ఒక్కటి చేస్తున్నాయి. భారతీయులు ప్రపంచంలోని అనేక దేశాల్లోకి ఉపాధి కోసం విస్తరించారు. అలాగే, భారతీయ పారిశ్రామిక వేత్తలు ఇతర దేశాల్లోకి, ఇతర దేశాల పారిశ్రామిక వేత్తలు భారతదేశంలోకి విస్తరిస్తూ ఉన్నారు. సైన్సు, టెక్నాలజీ, విద్య, వైద్య రంగాల్లో ప్రపంచమంతా ఒకే విధంగా అభివృద్ధి చెందుతున్నది. అందువల్ల ఈ రంగాల్లో అత్యాధునిక నైపుణ్యం, ఆవిష్కరణలు, అన్వేషణలు సాధించడానికి ప్రపంచమంతా ఒకే విద్యా విధానం అవసరం. వీలైతే, భారతదేశంలో ఇంగ్లీషు భాష నేర్చుకోవడం అవసరం. తద్వారా అవకాశాలు విస్తృతమవుతాయి. స్థానిక, మాతృభాషల్లో విద్యాబోధన సాగినప్పటికీ ఇంగ్లీష్ ఆవశ్యకతను గుర్తించక తప్పదు. ఇంగ్లీష్ ద్వారానే భారతీయులు ప్రపంచ దేశాల్లోకి విస్తరించగలుగుతున్నారు.

అమెరికాలో, ఆస్ట్రేలియాలో, యూరప్‌లో, రష్యాలో కొనసాగుతున్న విద్యా విధానాలను అధ్యయనం చేసి భారతీయ విద్యావిధానాన్ని సవరించుకుని సమగ్రం చేసుకోవడం అవసరం. ఆయా దేశాల్లో జ్ఞాపకశక్తి, బట్టీయం, పాఠ్యపుస్తకాలు ననుసరించి ప్రశ్నలు, జవాబులు అడగడం ద్వారా మార్కులు, ప్రతిభ నిర్ణయించే బదులుగా విద్యార్థుల నూతన ఆలోచనలు, ఆవిష్కరణలు, సమాజం పట్ల సేవా దృక్పథం ఏదో ఒక రంగంలో ఏదో ఒకటి తాను వ్యక్తిగతంగా సాధించాలి అనే పట్టుదలను పెంచే విధంగా విద్యావిధానం, మార్కులు, ప్రతిభ నిర్ణయించబడతాయి. భారతదేశంలో కూడా ఈ విధానాన్ని అనుసరించడం అవసరం. అందుకే, పదవ తరగతి పరీక్షలు విద్యార్థులను భయకంపితులను చేయకుండా, బట్టీయం వాళ్ళుగా మార్చకుండా ఉండడానికే ఐచ్ఛికంగా మార్చడం అనే అంశం ముందుకు వచ్చింది.

1969-70లో ఎస్సెస్సీ అనే 10వ తరగతి మొదలైంది. 10వ తరగతి తర్వాత ఇంటర్మీడియెట్‌గా మార్చారు. ఎంతో మంది 10, 12, ఇంటర్మీడియెట్ తరగతుల తర్వాత ఆగిపోతున్నారు. 10లో ఫెయిల్ అయి ఆగిపోవడం జాతి ఎదుగుదలకు ఎంతో అడ్డంకి,

అందుకని 12వ తరగతి దాకా చదువుకోగలిగే అవకాశముంటే విద్యార్థులు 18 ఏళ్ల దాకా అవాంతరాలు లేకుండా చదువుకోవచ్చు. యశ్‌పాల్ కమిటీ ప్రతిపాదించిన ఈ ప్రతిపాదన ఎంతో మంచిది.

రెండేళ్ల క్రితం విద్యారంగాన్ని కొంత సరి చేయాలని కొన్ని ఆలోచనలు ప్రభుత్వం ద్వారా ముందుకు వచ్చాయి. అవి ఎంతో చక్కని ఆలోచనలు. వాటి ప్రకారం పదవ తరగతి ఉత్తీర్ణులయ్యాక నేరుగా 6-7 సంవత్సరాల డిగ్రీ విద్యను అందించాలని ప్రతిపాదించారు. ఇంటర్మీడియెట్‌ను తొలగించాలనేది ఇందులోని ముఖ్యాంశం. ఇంటర్మీడియెట్ వల్ల పదవ తరగతి తర్వాత ఇంటర్‌లో, ఎమ్‌సెట్, డిగ్రీలో చాలా మంది ఆగిపోతున్నారు. ప్రైవేటు విద్యా సంస్థల విజృంభణ, పీజుల మోత, పేదరికం కలిసి విద్యార్థులను ఉన్నత విద్యను అందుకోకుండా అడ్డగిస్తున్నాయి. అందువల్ల పదవ తరగతి ననుసరించి 6-7 ఏళ్ల డిగ్రీ విద్యను, వృత్తి విద్యను ప్రవేశ పెడితే విద్యార్థులు ఎక్కడా ఆగకుండా ముందుకు సాగుతారు.

అలాగే, 12వ తరగతి కూడా కొన్నిచోట్ల సాగవచ్చు. వారికి 4, 5 ఏళ్ల డిగ్రీ ప్రవేశ పెట్టడం అవసరం. ఎలాగైనా ఇంటర్మీడియెట్ రంగం ద్వారా, ఎంసెట్ ద్వారా ప్రవేశించిన ప్రైవేట్ లాబీలను నిలువరించడం అవసరం. వారి సేవలను ఇతర విద్యారంగాలలో ఉపయోగించుకోవచ్చు. పదవ తరగతి నుండే నేరుగా మార్కుల ఆధారంగా ఇంజనీరింగ్, మెడికల్, డిగ్రీ కోర్సులకు ప్రవేశం కల్పించడం ద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతాయి.

పదవ తరగతి దాకా అతి కొద్ది మంది విద్యార్థులే చదువు కొనసాగిస్తున్నారు. నలభై లక్షల మంది ఒకటవ తరగతిలో చేరి ఉన్నత విద్య అందుకోవాల్సి ఉండగా పది లక్షల మంది మాత్రమే పదవ తరగతి పరీక్షలు రాస్తున్నారు. ఇంటర్మీడియట్‌కు వచ్చేసరికి వీరిలో సగం మంది ఆగిపోతున్నారు. చదువుకోదలచిన పదిహేను లక్షల మందినైనా 16-17 ఏళ్ల డిగ్రీ, వృత్తి విద్యా కోర్సు అందుకునే విధంగా ఉన్నత విద్య లక్ష్యాలను రూపొందించి అమలు జరపాలి. లేకపోతే వీరు నిరుద్యోగులు గానో, తీవ్రవాదులు గానో మారే ప్రమాదం ఉంది. విలువైన మానవ వనరుల జాతి సంపద నిర్వీర్యమవుతుంది.

పదిహేను లక్షల మంది పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు అందరూ 6, 7 సంవత్సరాల ఇజనీరింగ్, మెడికల్, లా, కామర్స్, సైన్స్ తదితర డిగ్రీ కోర్సుల్లో చేరడం వల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఈ విధానం ద్వారా ఊహించలేనంత మంది మొదటి తరం వాళ్లు ఉన్నత విద్యావంతులుగా నిరంతరం ఎదుగుతూ వస్తారు.

ఇండియాలో వలె అమెరికాలో ఎక్కడ పడితే అక్కడ చదువుకోవడానికి వీల్లేదు. ఏ ప్రాంతంలో ఉంటారో ఆ ప్రాంతంలోని స్కూల్లోనే చదువుకోవాలి. తల్లి దండ్రులు నివసిస్తున్న చోటనే, ఆ ప్రాంతంలోని ప్రభుత్వ స్కూల్లోనే చదివించాలి. పోలీస్ స్టేషన్, రెవెన్యూ శాఖ పరిధివలెనే ఆ స్కూలు పరిధిలో ఉన్న వాళ్ళంతా అదే స్కూల్లో చదివించాలి. మంచి స్కూళ్లు ఉన్న ప్రాంతంలో ఇళ్లు, అపార్టుమెంట్ల రేట్లు ఎక్కువ ఉంటాయి. దీన్ని భారతదేశంలో కూడా ఆచరించడం అవసరం. దానివల్ల, కొద్దికాలంలోనే అన్ని ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలు

పెరుగుతాయి అలాగే ఇంగ్లాండులో వలె ఉన్నత విద్య దాకా అనగా, కనీసం 12+4=16 లేదా 10+6 విద్యా విధానం ద్వారా 16 సంవత్సరాల పాటు విద్య ఉచితంగా అందించాలి. ఉచిత విద్య అందించకపోతే ఏం జరుగుతుంది? భారతదేశం రెండుగా చీలుతుంది. పేదలంతా ఒకవైపు, వాళ్ళు ఎన్నడూ ఎదగలేని దుస్థితిలో కూరుకుపోతుంటారు. మరొకవైపు, మధ్యతరగతి అష్టకష్టాలు పడి పిల్లలను జీవితమంతా చదివించడానికే వెచ్చిస్తుంటారు. తద్వారా, సంపదంతా ఇతరుల పరం అవుతుంది.

పేదలు, పేదలుగా ఉండిపోవడం వల్ల, సంపద సృష్టించాల్సిన కోట్లాది చేతులు తమ వంతు పాత్ర నిర్వహించలేక పోతున్నారు. తద్వారా దేశానికి, సంపద, నైపుణ్యం తగ్గిపోతుంది. మరోవైపు దేశంలో అసమానతలు, ఆందోళనలు, ఆవేశకావేశాలు, హింసాకాండ, మతోన్మాదాలు, దొంగతనలు, నేరాలు, వేశ్యావృత్తి, ప్రాంతీయ విద్వేషాలు పెచ్చరిల్లుతాయి. ఇది కోరుకోవడం అవసరమా? వాటిని అణిచివేయడానికి పెట్టే ఖర్చుతో వారికి విద్య అందించడమే సులభం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ప్రభుత్వ శాఖల ద్వారా ఇలాంటి కాలేజీలు, సంస్థలు, యూనివర్సిటీలు ప్రత్యేకంగా నిర్వహించడం అవసరం. అనగా, ఆ పెట్టాల్సిన బడ్జెట్‌లేవో జనాభా నిష్పత్తి ప్రకారం ఈ శాఖల ద్వారా పంపిణీ చేయడం ద్వారా రిజర్వేషన్ల సంఘర్షణ, సామాజిక సంఘర్షణగా మారకుండా చూడవచ్చు. హైస్కూళ్ళు, కాలేజీలు, హాస్టళ్ళు, రెసిడెన్షియల్ కాలేజీలు కొన్ని ఈ పద్ధతిలోనే నడుస్తున్నాయి. దాన్ని విశ్వవిద్యాలయాల స్థాయిదాకా, ఐఐఎం, ఐఐటి, ఐఎఎస్, ఐపిఎస్ స్థాయిదాకా నూరు శాతానికి విస్తరించడం అవసరం.

ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, విదేశీ విద్యాలయాలు అవసరమా? అనే ప్రశ్నలకు జవాబు అంత సులభంగా చెప్పలేం. అవసరమే అనవచ్చు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో సరియైన సీట్లు లేక వేలాది మంది విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి చదువుకోవాల్సి వచ్చింది. తద్వారా, మన సంపద ఇతర రాష్ట్రాల పాలవుతున్నది అని ప్రభుత్వాలు భావించి ఇంజనీరింగ్, మెడికల్, బిఇడీ కాలేజీలు ప్రైవేటు రంగంలో విపరీతంగా పెంచారు. తద్వారా, లక్షలాదిమంది రాష్ట్రంలోనే చదువుకుని ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి పొందుతున్నారు. ఈ కోణంలో ఆలోచిస్తే ఆస్ట్రేలియా, అమెరికా, ఇంగ్లాండుల్లో చదువుకోసం వెళ్ళే బదులుగా అంతర్జాతీయ ప్రమాణాలు గల విశ్వవిద్యాలయాలు తమ విశ్వవిద్యాలయాలను ఇండియాలో నెలకొల్పడం వల్ల, ఎంతో మేలు జరుగుతుంది. అయితే, ఫీజుల విషయంలో ఒక స్పష్టత అవసరం. నెలకు 50 వేలు సంపాదించే వారు కూడా పిల్లల ఉన్నత విద్యకు పెట్టుబడి పెట్టడం కష్టమవుతున్నది. అందువల్ల ఫీజులను ఎడాపెడా పెంచకుండా చూసుకోవాలి. క్రిమీలేయర్ లోపు గలవారి పిల్లలకు పూర్తిస్థాయి ఫీజులు ప్రభుత్వమే చెల్లించాలి.

ఏమైనప్పటికీ, అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండు, యూరప్ దేశాల్లోని విద్యా విధానాన్ని పూర్తి స్థాయిలో దేశానికనుకూలంగా అభివృద్ధి పరచుకుని ఉన్నత విద్యను అందరికీ అందించాలి. దేశీయ, సంస్కృతి, విలువలు ప్రజాస్వామిక సంస్కృతి కూడా అవసరమైన మేరకు దీంతో సమన్వయించడం అవసరం. అప్పుడే పూర్తిస్థాయి దేశీయ, అంతర్జాతీయ స్థాయి విద్యగా రూపొందించుతుంది.

అమెరికాలో 12వ తరగతి తర్వాత చదువంతా ప్రైవేటు రంగంలో కొనసాగుతున్నది. ఖర్చు ఎక్కువ. తల్లిదండ్రులు పిల్లలను 12వ తరగతి తర్వాత, స్వయంగా కొంత సంపాదించి చదువుకొమ్మని చెప్తారు. మూడు గంటలు పార్ట్‌టైమ్ పని చేసుకుంటూ చదువుకుంటారు. అందువల్ల, చదువు పట్ల కొంత శ్రద్ధ తగ్గుతుంది. డబ్బులు చేతిలో ఆడడం వల్ల ఖర్చు పెట్టే స్వేచ్ఛ పెరిగి చదువులు వెనుకబడుతున్నాయి. స్త్రీ పురుషుల ఆకర్షణ కూడా ఇందుకు తోడవుతుంది. ఈ కారణాల రీత్యా అమెరికాలో ఉన్నత విద్యలో ఎన్నో అవకాశాలు వున్నప్పటికీ అందరూ ఎదగలేకపోతున్నారు. ఫలితంగా, ఇండియా, చైనా వంటి దేశాల నుండి సాఫ్ట్‌వేర్ నిపుణులు, డాక్టర్లు అమెరికాకు వలస వెళ్లి సేవలందిస్తూ స్థిరపడుతున్నారు.

ఇంగ్లాండులో విద్య, వైద్యం రెండూ ఉచితమే. అమెరికాలో వైద్యం భారీ ఖర్చుతో కూడుకున్నది. నాలుగు దశాబ్దాలుగా వైద్యాన్ని ప్రభుత్వరంగంలోకి తెచ్చి ఉచిత వైద్యం, ఉచిత ఉన్నత విద్య అందించాలని ఆందోళనలు సాగుతున్నాయి. కార్పొరేట్ శక్తులు తమ లాభాలు, ప్రయోజనాలు తగ్గుతాయని అడ్డగిస్తూ వస్తున్నాయి. ఉచిత ఉన్నత విద్య, ఉచిత వైద్యం అందించడం అమెరికాకు ఒక లెక్కలోనిది కాదు. ఏటా కొనే వందలాది యుద్ధ విమానాల్లో రెండు తగ్గించుకుంటే ఆ ఖర్చుతో వీటిని భరించవచ్చు. అయితే, ఈ లాబీలు వ్యతిరేకించడం వల్ల అది సాధ్యం కావడం లేదు.

అమెరికాలో ఇంకో పదేళ్ళ తర్వాతైనా ఉచిత ఉన్నత విద్య , ఉచిత వైద్యం ప్రభుత్వం తరఫున ప్రవేశ పెట్టక తప్పదు. ఇంతకముందే చెప్పినట్టు ఇప్పటికే గత రెండేళ్లలో రెండు కోట్లమంది మెడికల్ ఇన్స్యూరెన్స్ చేయించుకోలేకపోయారు. అమెరికాలో లక్షలాది మంది భారతీయ డాక్టర్ల అవసరం ఉంది. వైద్యానికి సంబంధించి వినియోగదారుల చట్టంలో కొన్ని సవరణలు చేయడం అవసరం. అప్పుడు భారీ నష్టపరిహారాలు గానీ, భారీ ఇన్స్యూరెన్స్ కిస్తులుగానీ తగ్గుతాయి.

మెడిసిన్‌లో, సైంటిఫిక్ రంగంలో సూపర్ స్పెషాల్టీ రంగంలో సీట్లు పది రెట్లు పెంచడం ప్రపంచీకరణ యుగంలో మనవాళ్లు విస్తరించడానికి ఎంతో అవసరం. అమెరికాలో విద్య, వైద్య రంగాలు ఉచిత సేవలు అందించడానికి చైనా, ఇండియా వంటి అత్యధిక జనాభా గల దేశాలు ఎంతో ఉపకరిస్తాయి. ఇప్పుడున్న వైద్య కళాశాలలను పదిరెట్లు పెంచి, సీట్లను మూడు వేలకు బదులుగా రాష్ట్రంలో ఏటా లక్షమంది డాక్టర్లు తయారయ్యే విధంగా వైద్య విద్యను ఉన్నత ప్రమాణాలతో విస్తరింప చేయాలి. సాఫ్ట్‌వేర్ నిపుణులు రాష్ట్రంలో ఏటా రెండు లక్షల మంది ఉత్పత్తి అవుతున్నారు. వీరు ఇతరుల మీద ఆధారపడి ఉపాధి సంపాదించుకోవాలి. కాని డాక్టర్లు స్వయంగా వైద్యం చేసి ఉపాధి సంపాదించుకునే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో, వెనుకబడిన రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో వైద్య సేవలు ఎంతో అవసరం. అమెరికాలో వైద్యుల ఉత్పత్తి ఖర్చు ఎక్కువ. ఫీజు కూడా ఎక్కువ. అందువల్ల చైనా, ఇండియాలో తక్కువ ఖర్చుతో చదువుకొని అమెరికా, కెనడా, యూరప్ దేశాల ప్రజలకు వైద్య సేవలు అందించడం సులభం. దేశంలోని పేరెన్నికగన్న కార్పొరేట్ సంస్థలు ఇండియాలో వైద్యాన్ని అందించే రంగంలో ప్రవేశించి వాటి శాఖలుగా ఇతర దేశాల్లో వైద్య సదుపాయాలను కల్పించినప్పుడు ఇక్కడి జీతంతో అక్కడ వైద్యం అందించడం వల్ల ఆయా దేశాలకు తక్కువ

ఖర్చుతో వైద్య సదుపాయాలు అందుతాయి. ఉదా.కు నలభైవేల రూ.ల జీతం ఇండియాలో ఇస్తూ అమెరికాలో కొంత భత్యం, ఇంటివసతి ఏర్పాటు చేస్తే రెండు వేల డాలర్లతో మంచి వైద్యులు వైద్యాన్ని అందించడం సాధ్యపడుతుంది. అమెరికాలో పదేళ్ళ సేవ తరువాత అమెరికా పౌరసత్వం లభిస్తుందని గ్యారంటీ ఇవ్వడం ద్వారా లక్షలాది మంది డాక్టర్లు ఇలా సేవ చెయ్యడానికి ముందుకు వస్తారు. ఒక వెయ్యి డాలర్లు కార్పొరేట్ సంస్థ లాభాలు నిర్వహణకు సంపాదించుకోవచ్చు. నేటి పరిస్థితిలో 25వేల డాలర్లు డాక్టర్లు సంపాదిస్తున్నారు.

ఇలా నాలుగువేల డాలర్లతో ఎనభై వేల జీతంతో అమెరికాలో ఇండియన్ కార్పొరేట్ సంస్థలు తక్కువ ఇన్స్యూరెన్స్‌తో తక్కువ ఖర్చుతో వైద్యాన్ని అందించవచ్చు. తద్వారా వైద్యం ఖర్చు 15 శాతం ఖర్చుతో అందించబడుతుంది. 85 శాతం డబ్బు అమెరికా ప్రజలకు మిగులుతుంది. ఇండియన్ రూపాయల్లో మెడికల్ ఇన్స్యూరెన్స్‌ను ఆసియా దేశాల ప్రజలకు, అమెరికా ప్రజలకు అందించగలిగితే భారతదేశం సాఫ్ట్‌వేర్ రంగం ద్వారా సుసంపన్నమైనట్టుగానే వైద్య రంగం ద్వారా మరింత సుసంపన్నం అవుతుంది. డాలర్, పౌండు మారకం రేటును రూపాయితో పది రూపాయలకు తగ్గించుకునే దాకా చైనా, ఇండియా సేవలకు అమెరికాలో, యూరప్‌లో అవకాశాలు విస్తరిస్తూనే వుంటాయి. అమెరికా ప్రభుత్వం దాన్ని అరికట్టడం కూడా సాధ్యం కాదు. అమెరికా ప్రజలే అమెరికా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి చైనా, ఇండియా డాక్టర్లకు మార్గం సుగమం చేస్తారు. ఇలా ప్రపంచీకరణలో ప్రపంచ దేశాలను అధ్యయనం చేస్తూ దేశంలోని మానవ వనరులను, ప్రకృతి వనరులను, ఉత్పాదక సేవా రంగాలను నూతన దృష్టితో అభివృద్ధి పరచుకోవడం అవసరం.

అమెరికా ప్రభుత్వ సంక్షోభం ఎలా వున్నప్పటికీ అమెరికా సమాజంలోని సంక్షోభం పరిష్కరించడం సులభ సాధ్యమే. అమెరికా ప్రభుత్వం ఇంగ్లాండులో వలె విద్య, వైద్య రంగాలను పూర్తిగా ఉచితంగా అన్ని స్థాయిల్లో అందించడం అవసరం. తద్వారా మెడికల్ ఇన్స్యూరెన్స్ భారం తగ్గిపోతుంది. మెడికల్ ఇన్స్యూరెన్స్ కోసం జీతంలో నెలనెల ఇరవై శాతం మేరకు కిస్తు కట్టాల్సి వస్తున్నది. ఇది ఎంతో భారంగా పరిణమించింది. అలాగే ఫ్యూచర్ పెన్షన్ కోసం పెట్టిన స్కీములలో నిధిని జమ చేయడం కోసం మరో ఇరవై శాతం జీతం కిస్తులుగా పోతున్నది. 25 శాతం జీతం ఇల్లు కిరాయి కింద పోతున్నది. ఇందులో ఇల్లు కొనుక్కోవడం ద్వారా ముప్పై సంవత్సరాల కిస్తు వాయిదాల పద్ధతి వల్ల కిరాయి మేరకే కట్టి ఇల్లు సొంతం చేసుకోగలుగుతున్నారు. 60 లేదా 65 సంవత్సరాలు దాటిన ప్రతి పౌరునికి పెన్షన్ ఇచ్చే స్కీమ్ ప్రవేశ పెడితే అమెరికా ప్రజలు ఎంతో సుఖపడతారు. జీవన భద్రత ఏర్పడుతుంది. ఈ క్రమం కోసం అమెరికా సమాజం ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తున్నది. విద్య, వైద్యం, పెన్షన్ ఈ మూడు ప్రభుత్వం తన బాధ్యతగా స్వీకరిస్తే అమెరికా ప్రజలు ఎదుర్కొనే సంక్షోభాలు చాలా మేరకు పరిష్కారమవుతాయి. ఆయుధ లాబీలతో పాటు ఈ రంగాలకు సంబంధించిన లాబీలను ఇతర రంగాల్లోకి మళ్ళించడం ద్వారా ఈ పని తేలికవుతుంది. అమెరికా సంక్షోభాలు పరిష్కారమవుతాయి.

ఇతరుల వద్ద పనిచేసే అధికారులుగా, మేనేజర్లుగా ఎదిగే కోర్సులు తప్ప తామే పారిశ్రామిక వేత్తలుగా, పెట్టుబడిదారులుగా, కాంట్రాక్టర్లుగా, వ్యాపార వేత్తలుగా ఎలా

ఎదగాలో డిగ్రీ, పీజీ స్థాయిలోనైనా కోర్సులు లేవు. ఈ కోర్సులను అన్ని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశ పెట్టడం అవసరం. పేదలు, కార్మికులు, విద్యావంతులు, పెట్టుబడి లేనివాళ్ళు, ఉత్సాహం, పట్టుదల తప్ప పెట్టుబడిని లేని వాళ్లు పెట్టుబడిని సంపాదించడం పారిశ్రామిక వేత్తలుగా, వ్యాపార వేత్తలుగా, కాంట్రాక్టర్లుగా, రియల్ ఎస్టేట్ బిల్డర్లుగా, మల్టీమిలీనియనీర్లుగా, పెట్టుబడిదారులుగా, రాజకీయ నాయకులుగా ఎలా ఎదగాలో కోర్సులు లేకపోవడం వలన నూతన వర్గాల ప్రవేశ మార్గం నిరోధించబడుతున్నది. అన్ని కోర్సుల్లాగే ఈ కోర్సులను పెట్టడం ద్వారా అన్ని వర్గాల నుండి, కులాలనుండి, ప్రాంతాల నుండి సంపదను సృష్టించి పెంచే కృషిలో యజమానులుగా ఎదుగుతారు. అలాగే సృజనాత్మక రంగంలో ఎదగడానికి కథలు, నవలలు, నాటకాలు రాసే కోర్సులు సినిమా, టీవీ సీరియళ్లు తీసే దిన, వార, మాస పత్రికలు నడిపే కోర్సులు డిగ్రీ స్థాయిలో గ్రామీణ స్థాయి దాకా విస్తరించాలి. తద్వారా నూతన శ్రేణుల నుండి సృజనాత్మకత కొన్ని వందల రెట్లు పెరుగుతుంది. వీటి మార్కెట్ అవకాశాలు అందరికీ చేరువవుతాయి.

ఇండియాలో ప్రభుత్వ ఉద్యోగులకు వున్నంత ఉద్యోగ భద్రత చాలా దేశాల్లో లేదు. దీన్ని సగానికి తగ్గించాలి. ఉదా.కు 15 సంవత్సరాల సర్వీసు తర్వాత కొత్త శిక్షణలు, ఆధునిక అవసరాల గురించిన టెస్టులు ఉత్తీర్ణులు కాలేని, అందుకోలేని వారిని 50 శాతం రిటైర్‌మెంట్ చేసి ఇతర రంగాల్లోకి వెళ్ళాలని చెప్పవచ్చు. అమెరికాలో ప్రైవేటు రంగ ఉద్యోగులకు, ఇండియాలోని ప్రభుత్వ ఉద్యోగులకుండే ఉద్యోగ భద్రతలో కనీసం సగం మేరకైనా కల్పించాలి.

అమెరికా సంక్షోభాలు పరిష్కరించడానికి కొన్ని చిన్న సంస్కరణలు కూడా ఎంతో గొప్ప మార్పు తెస్తాయి. ముఖ్యంగా 18 ఏళ్ళ తర్వాత సొంతంగా చదువుకోవాల్సిన పద్ధతిని మార్చి 22 ఏళ్ల వయస్సుదాకా తల్లిదండ్రులు, ప్రభుత్వం వారి చదువు గురించిన బాధ్యత స్వీకరించాలి. 22 ఏళ్ళు నిండిన తరువాతే పెళ్ళి అని పెళ్ళి వయస్సు నిర్ణయించాలి. విద్య, వైద్యం అన్ని స్థాయిల్లో ప్రభుత్వమే అందించాలి. తద్వారా మెడికల్ ఇన్సూరెన్స్, విద్య, తదితర ఖర్చులు తగ్గుతాయి. జీవన ప్రమాణాలు పెరుగుతాయి. ఉద్యోగ భద్రత వల్ల మానసిక సమస్యలు, మానవ సంబంధాల విచ్ఛిత్తి, పెళ్ళిళ్ల విచ్ఛిత్తి చాలా మేరకు తగ్గుతుంది. ప్రజాస్వామిక కుటుంబ సంబంధాల ప్రాధాన్యత గురించి అమెరికాలో ప్రత్యేకంగా టీవీ ఛానళ్లల్లో కుటుంబ న్యాయస్థానాల పరిష్కారాలను రోజూ ప్రసారం చేస్తుంటాయి. ఇండియాలోను దీన్ని ఆచరించాలి. అమెరికాలో టీవీల్లో రక్తం, శవం, యాక్సిడెంట్లు, బీభత్స, భయానక దృశ్యాలు, మానభంగాలు, నేరాలు మొదలైనవి చూపించరు. అందుకు కట్టుదిట్టమైన చట్టాలున్నాయి. ఇలాంటి చట్టాలు ఇండియాలో కూడా తీసుకు వచ్చి ఆచరించడం అవసరం. 1985ల్లో అమెరికాలో కూడా నేడు ఇండియాలో వున్నట్టుగానే విచ్చలవిడిగా మీడియా ప్రసారాలు వగైరా వుండేవి. వాటన్నిటినీ అధిగమించి ఆరోగ్యకరమైన సమాజంగా ఎదగడానికి మలుపు తీసుకున్నారు. అందువల్ల అక్కడి అనుకూలాంశాలను స్వీకరించడం అవసరం.

– 'వార్త', 'సూర్య' దినపత్రికల ఆగస్టు, 2009 సంచిక సౌజన్యంతో

10. గ్లోబలైజేషన్‌లో నూతన అభివృద్ధి నమూనాలు సాధ్యమా?

ప్రపంచీకరణ పరిణామాల్లో ప్రపంచం ఒక గ్రామంగా మారుతున్న యుగంలో ఆయా దేశాల్లో, ప్రాంతాల్లో అందుకు భిన్నంగా తనవైన నూతన అభివృద్ధి నమూనాలు సాధ్యమవుతాయా? లేక తన వనరులను, శక్తి, సామర్థ్యాలను ఉత్పత్తి, సేవలలో, మార్కెటింగ్‌లో అభివృద్ధి పరుచుకుంటూ ప్రపంచీకరణ పరిణామాలకనువుగా ఎదగడమా? అనే ప్రశ్న ప్రపంచ దేశాల ముందున్నది. దీన్ని చైనా, జపాన్, కొరియా, ఇండియా, ప్రపంచీకరణ పరిణామాలకనువుగా పరిష్కరించుకుంటూ, అభివృద్ధి చెందుతూ వస్తున్నాయి. అందుకు పీవీ నరసింహారావు మన్మోహన్‌సింగ్ గ్లోబలైజేషన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. భారతదేశం ఒక మలుపు తిరిగింది. ఎంతో అభివృద్ధి చెందింది.

అలాగే అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవల నూతన ఆవిష్కరణలకు అడ్డంకులు తొలగిస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అమెరికా పలు రంగాల్లో జపాన్ కంపెనీలతో వెనుకబడి పోతున్నది. ఇన్నోవేటివ్, డిజైనింగ్ రంగంలో జపాన్ ముందుకు దూసుకుపోతున్నది. చైనా మాన్యుఫ్యాక్టరింగ్ రంగంలో ముందుకు దూసుకుపోతూ అమెరికా మార్కెట్లో సింహభాగాన్ని ఆక్రమిస్తున్నది. ఇండియా నుండి ఇలా ఎగుమతులు జరగడం లేదు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల, చూపేది ఒకటి, సప్లై చేసేది మరొకటి కావడం వల్ల భారతీయ సరుకుల పట్ల అమెరికన్ ప్రజల నమ్మకం కోల్పోయారు. భారతీయ సరుకుల మార్కెట్ పూర్తిగా పడిపోయింది. తద్వారా, ఇండియాలో లక్షలాదిమంది ఉపాధి కోల్పోయి ఆకలి చావులకు, ఆత్మహత్యలకు గురవుతున్నారు.

వికినమిక్స్ (ఎకనమిక్స్ కాదు), ఫ్రీకనమిక్స్ గ్రంథాల్లో అమెరికా, ఇండియా అభివృద్ధి పరిమితుల గురించి చర్చించారు. చైనా, ఇండియాల పోటీని తట్టుకొని నూతన ఆవిష్కరణలతో అమెరికా ఎలా ఎన్ని రంగాల్లో ముందుకు సాగాల్సి వున్నదో ఈ గ్రంథాల్లో చర్చించారు. ఆ సందర్భంగా ఇండియా నిపుణుల పరిమితులేమిటో విపులంగా చర్చించారు. తమ నూతన ఆవిష్కరణలకు ఇండియా నిపుణులు ఎన్నడూ పోటీ ఇవ్వలేరని, నూతన అంశాలు కనుక్కొన్న తర్వాత వాటిని అభివృద్ధి పరచడంలో, విస్తరించడంలో మార్కెట్ చేయడంలో మాత్రమే ఇండియా సాఫ్ట్‌వేర్ నిపుణులు నైపుణ్యం సాధించారని విపులంగా విశ్లేషించారు.

గ్లోబలైజేషన్‌లో స్థానిక వనరులను ఉపయోగించుకుంటూ అభివృద్ధి చెందడం గురించి కొంత లోతుగా పరిశీలించాల్సిన అవసరం వుంది. స్థానికంగా మన దేశంలో మానవవనరులు, ప్రకృతి వనరులు, గనులు, వాతావరణం ఎక్కువ అనుకూలంగా ఉన్నాయి. విజ్ఞానం, ఉత్పత్తి, వ్యాపారం, మార్కెటింగ్, సేవారంగం ప్రపంచ వ్యాప్తంగా పరస్పరం ఆదాన ప్రదానాలు జరుగుతున్నాయి. ఈ గ్లోబలైజేషన్ దశలో స్థానికంగా ప్రత్యేక అభివృద్ధి నమూనాలు రూపొందించుకోవడం సాధ్యమా? పరిశీలించాల్సిన అవసరం ఉంది.

నూతన అభివృద్ధి నమూనాలకు ఆయా ప్రాంతీయ, ఫెడరల్ పార్టీల ఎదుగుదలకు

సంబంధం వుంది. చంద్రబాబు, సాఫ్ట్‌వేర్, రోడ్లు, రియల్ ఎస్టేట్లకు ప్రాధాన్యతనిస్తే వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్, ఫీజుల మాఫీలకు ప్రాధాన్యనిచ్చారు. బీసీలు అధికారంలోకి వచ్చినప్పుడు విద్యకు, విజ్ఞానానికి, కుల వృత్తుల రద్దుకు, అవసరమైన కులవృత్తుల ఆధునీకరణకు ప్రాధాన్యత నిస్తే వారి అస్తిత్వాన్ని, అధికారాన్ని, అవసరాన్ని ప్రజలు గుర్తించి గెలిపిస్తారు. కులవృత్తులను రద్దు చేయనప్పుడు, అవసరమైన వాటిని ఆధునికీకరించనప్పుడు అభివృద్ధి నమూనాలను, పరిపాలనా విధానాలు మార్చనప్పుడు, ప్రత్యేక భాషా, సంస్కృతి, కళలు, మీడియా, భావజాల రంగంలో నూతన సామాజిక వర్గాలను అభివృద్ధి పరచనప్పుడు ప్రాంతీయ, ఫెడరల్ పార్టీల అవసరాన్ని ప్రత్యేకతను ప్రజలు ఎలా గుర్తిస్తారు? ఏ ప్రత్యేకతలు, ప్రాధాన్యతలు లేనప్పుడు ప్రజలకు ఏ పార్టీ ప్రభుత్వమున్నా ఒక్కటే.

2009 ఎన్నికల్లో ప్రాంతీయ, ఫెడరల్ పార్టీలు బలహీనపడి కాంగ్రెస్ పార్టీ, అధికారంలో ఉన్న పార్టీలు గెలుపొందడంలో ఈ ఛాయలు కనపడతాయి. ములాయంసింగ్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్, మాయావతి, కరుణానిధి, నితీష్‌కుమార్ మొదలైన బహుజన నాయకులు కులవృత్తులను రద్దు చేయడమో, అవసరమైన వాటిని ఆధునీకరించడమో చేసినప్పుడు, మద్యనిషేధం, అందరికీ అన్ని స్థాయిల్లో ఉచిత విద్య, విజ్ఞానం స్కాలర్‌షిప్‌లు, ఫీజుల మాఫీ, భారీ రిజర్వేషన్లతో పాటు నూతన ఆవిష్కరణలు లేకపోయినా ఇలా నూతన అభివృద్ధి నమూనాలను పరిపాలనలో నూతన అంశాలను, ప్రాధాన్యతలను ప్రవేశపెట్టినప్పుడే వారి ఉనికిని, అవసరాన్ని ప్రజలు గుర్తించి గెలిపిస్తారు. దళితులు, ఓబీసీలు, ప్రాంతీయవాదులు, ఫెడరల్ శక్తులు అధికారంలోకి రావడం వల్ల ప్రజలకు కలిగే ప్రత్యేక ప్రయోజనం ఏమీ లేనప్పుడు వారు అధికారంలోకి రాగానే వారి పట్ల ఉన్న భ్రమలు తొలగిపోతాయి. దాంతో జాతీయ పార్టీలు మళ్ళీ పుంజుకుంటాయి.

గ్లోబలైజేషన్‌లో ప్రాంతీయ పార్టీలు, ఫెడరల్ పార్టీలు శక్తులు, ఈ ప్రత్యేక గుర్తింపును, కృషిని సాధించకపోతే కాంగ్రెస్, బిజెపిలకు వీటికి మధ్య తేడా ఉండదు. ఇప్పటికే అన్ని పార్టీలు అటు ఎన్‌డిఏ, ఇటు యుపిఏ కూటమిలోనో చేరి కొనసాగుతున్నాయి. తద్వారా, తమ ప్రత్యేక గుర్తింపును, కార్యక్రమాలను కోల్పోవడం జరుగుతూ వస్తున్నది. రాష్ట్ర స్థాయిలో కూడా వీటి మధ్య తేడా లేని దశ అనుకుంటే ఆయా ప్రాంతీయ పార్టీలు మరింత బలహీన పడతాయి. అందువల్ల కాస్త మంచిగా శాంతిభద్రతలతో పరిపాలిస్తున్నారనుకుంటే అధికారంలో ఏ పార్టీ ఉంటే వారినే గెలిపిస్తున్నారు. ఇది గ్లోబలైజేషన్ దశ రాజకీయ, సామాజిక రంగాల్లో తెస్తున్న మౌలిక పరిణామం.

దీన్ని గమనించి తమ ప్రత్యేకతలను సాధించుకోకపోతే ప్రాంతీయ, ఫెడరల్ పార్టీలకు, జాతీయ పార్టీలకు మధ్య తేడా తొలగి జాతీయ పార్టీలు బలం పుంజుకునే అవకాశాలున్నాయి. అందువల్లనే, కులం, మతం వంటి ఆవేశ, ఉద్రేక అంశాలు కూడా కాలం గడిచిన కొద్దీ పెద్దగా ప్రభావితం చేయలేకపోతున్నాయి. జాతీయ పార్టీలు ప్రాంతీయ, స్థానిక పరిస్థితుల ననుసరించి ఆయా కులాలతో, మతాలతో సర్దుకుపోవడం, వారి డిమాండ్లను ఎంతో కొంతమేరకు తమ ప్రణాళికల్లో సమన్వయించుకుంటూ సాగడం వల్ల అతిగా రెచ్చగొట్టే

రైట్, లెఫ్ట్ పార్టీల పట్ల ప్రత్యేక ఆకర్షణ తగ్గుతూ వస్తున్నది. పైగా, జాతీయ పార్టీలు వెంటనే అధికారంలోకి రావడం, తమ డిమాండ్లను ఎంతో కొంతమేరకు వెంటనే పరిష్కరించడం జరుగుతుందనే నమ్మకం వల్ల జాతీయ పార్టీల వైపు, అధికారంలోకి రాగలిగే పార్టీల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు.

అది సరే, సంపద సృష్టించడానికి, మనుషులు సుఖసంతోషాలతో బతకడానికి ఆయా దేశాల్లో, ప్రాంతాల్లో ప్రత్యేక అభివృద్ధి నమూనాలు రూపొందించడం సాధ్యమేనా? సాధ్యమైతే దాన్ని ఎలా సాధించడం? మనకు నేటి అభివృద్ధి విధానాన్ని మార్చుకునే అవకాశం గాని, స్వేచ్ఛగాని ఉందా? కులవృత్తుల ఉత్పత్తి విధానం తర్వాత భారతదేశం స్వయంగా కొత్తగా సాధించిందేమీలేదు. తనకు తాను నూతన అభివృద్ధి నమూనాలు, నూతన సైన్స్ ద్వారా రూపొందించే దాకా ఇలాగే కొనసాగుతుంది. ఇది వేలయేళ్ళుగా సొంతంగా అభివృద్ధి పరచుకుంటూ వచ్చిన వనమూలికల వైద్యవిధానం, ఆయుర్వేద వైద్యం వంటి రంగాలతో పాటు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ప్రింటింగ్ టెక్నాలజీ, రెడీమేడ్ గార్మెంట్స్, తదితర రంగాల్లో ఇన్నోవేషన్స్ రీసెర్చ్, విస్తరణ అవకాశాలు పెంచుకోవచ్చు.

పారిశ్రామిక ఉత్పత్తి మార్కెటింగ్ సేవా రంగాలు భారీ, మధ్య తరహా, సన్నకారు అని మూడు దశలుగా వర్గీకరించవచ్చు. గాంధీజీ, లోహియా, చరణ్‌సింగ్‌లు సన్నకారు, మధ్యతరహా ఉత్పత్తి విధానం ద్వారా అందరికీ పని కల్పించవచ్చు అని, అందరికీ పని కల్పించడానికి ఇదే సరైన మార్గమని నమ్మారు. కాని నెహ్రూ, అంబేద్కర్ ప్రతిపాదించిన భారీ ఉత్పత్తి మార్కెటింగ్ విధానమే అన్నిటినీ అధిగమించి ముందుకు సాగుతున్నది. చిన్నతరహా ఉత్పత్తి ఎప్పటికీ వెనుకబడిపోయిన ఉత్పత్తి విధానం లాగానే ఇప్పటికీ కనపడుతున్నది. ఉదా॥కు స్వయంగా బట్టలు నేయడం, బుట్టలు అల్లడం, కల్లుగీయడం, కుండలు చేయడం మొదలైనవన్నీ వెనకబడి పోయిన గిట్టుబాటు కాని ఉత్పత్తి విధానాలుగా మారాయి.

గ్లోబలైజేషన్‌లో భారతదేశం తనదైన నూతన ఆవిష్కరణలను, ఉత్పత్తి, మార్కెట్ విధానాలను సాధించుకునే దాకా సంక్షేమ పథకాలు అనివార్యం. ఎందుకంటే, ఉన్న పరిమితుల్లో చేస్తున్న అభివృద్ధి, సృష్టిస్తున్న సంపద కూడా అన్ని సామాజిక వర్గాలకు అందడం లేదు. సంపద పెరగడంతో పాటు పేదలు అలాగే పేదరికంలో కొనసాగుతున్నారు. గత పాతికేళ్లుగా సాంప్రదాయిక ఉత్పత్తి విధానం, సేవారంగం అవసరం తీరుతున్న కొద్దీ వాటిని ఉన్నంతలో కాస్త గిట్టుబాటు అయ్యే విధంగా సబ్సిడీలు, గ్రాంటులు, సంక్షేమ పథకాలు అందిస్తూ ఎలాగోలా వారిని ఈ సమాజంలో బతికే విధంగా నెట్టుకువస్తున్నాం. కొంతకాలంగా ఈ వృత్తులు, సేవా రంగాలు ఆధునిక ఉత్పత్తి, మార్కెటింగ్, సేవా రంగాలలో పోటీపడలేక జీవితాలు గిడసబారిపోతున్నాయి. కొత్త వృత్తులు చేపట్టలేక, నైపుణ్యం పెంచుకోలేక, ఎలా పెంచుకోవాలో తెలియక అలాంటి వ్యవస్థ లేకపోవడం వల్ల రోజురోజుకూ ఆత్మవిశ్వాసం కోల్పోయి ఆకలికి గురవుతూ, ఆత్మహత్య చేసుకుంటూ తనువు చాలిస్తున్నారు.

గ్లోబలైజేషన్ ప్రారంభమైనప్పుడు ఇలాంటి పరిణామాలు సంభవిస్తాయని తెలుసు. పారిశ్రామిక ఉత్పత్తి విధానం, మార్కెటింగ్ విస్తరణలో ఏది జరిగిందో అదే మరింత ఎక్కువగా

గ్లోబలైజేషన్‌లో జరుగుతుందని అందరికీ ఒక అంచనా వుంది. గ్లోబలైజేషన్ వల్ల బాధితులవుతారని ప్రచారం చేసిన వాళ్లు ఆ బాధితులను నూతన సమాజంలో, నూతన శక్తులుగా ఎదిగించడానికి సంబంధించిన పరిశీలన, పరిశోధన చేసినట్టు కనపడదు. అది జరిగివుంటే ఈ నష్టాలు, కష్టాలు చాలా మేరకు నివారణ అయి వుండేవి. ప్రాంతీయ, ఫెడరల్ శక్తులు, పార్టీలు, సామాజిక శాస్త్రవేత్తలు, సైంటిస్టులు ముందుచూపుతో ఆలోచించకపోవడం వల్ల గ్లోబలైజేషన్ బాధితులు, గ్లోబలైజేషన్ లాభోక్తులుగా పరిణామం చెందడం ఆగిపోయింది. ఇది స్థానిక, ప్రాంతీయ, ఫెడరల్ సామాజిక శాస్త్రవేత్తల, సైంటిస్టుల, నాయకుల వైఫల్యం.

దేశీయ వనరులను అనుసరించి సంపద సృష్టించడం, మనుషులు సుఖ సంతోషాలతో బతకడం అనేవి శతాబ్దాలుగా సాంప్రదాయకంగా కొనసాగుతూ వస్తున్నాయి. పారిశ్రామిక విప్లవం వీటన్నిటినీ ఒకే సంతలోకి తెచ్చింది. దానివల్ల, ఉన్న వనరులను అనుసరించి పారిశ్రామిక ఉత్పత్తి, మార్కెటింగ్ విధానాల్లోకి ప్రవేశించారు. ప్రకృతి వనరులు, వ్యవసాయం మీద ఆధారపడిన దేశాలు వాటి ఎగుమతుల ద్వారా అవసరమైన వాటిని దిగుమతి చేసుకున్నారు. భారతదేశంలో ప్రకృతి సంపద, భూగర్భ సంపద హెచ్చు. పశు సంపద కూడా హెచ్చు. వాతావరణం కూడా ఎంతో అనుకూలమైనది. అందువల్ల తక్కువ పారిశ్రామిక అభివృద్ధిలో కూడా సౌఖ్యవంతంగా జీవించగలిగే అవకాశాలు కొనసాగుతున్నాయి.

పారిశ్రామిక విప్లవానికైనా, గ్లోబలైజేషన్‌లో ముందుకు సాగడానికైనా నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు ప్రాతిపదిక. ఇవి లేకుండా ఏ దేశం కూడా ముందుకు సాగదు. ఇతర దేశాలు చేసిన ఆవిష్కరణలను, కనుగొన్న విషయాలను వాడుకోవడం తప్ప చేయగలిగేదేమీ లేదు. ఇతర దేశాలు కనుగొన్న విషయాలను వాడుకోవడం ద్వారా ఆ దేశంలోని ఉత్పత్తి, మార్కెటింగ్ విధానాలే వాటిననుసరించే దేశాల్లో కూడా కొనసాగుతాయి. అందువల్ల యూరప్, అమెరికా దేశాల ఆవిష్కరణలు, కనుగొన్న నూతన అంశాలననుసరించి మొత్తం ప్రపంచం సాగుతూ ఉన్నది. కనుక, భారతదేశం గాని, మరో దేశంగాని, స్వంత ఉత్పత్తి, మార్కెటింగ్ విధానాల్లో ఎదగాలంటే, స్వయంగా రీసెర్చ్, ఇన్నోవేషన్ పలు రంగాల్లో సాధించవలసి ఉంటుంది. అప్పటికే ఇతర దేశాల్లో సాధించిన వాటిని తిరిగి కనుక్కోవడం, ఆవిష్కరించడం వల్ల అవి నూతన ఆవిష్కరణలు కాబోవు. ఉదా॥కు అణుబాంబులను అమెరికా తయారు చేశాక అనేక దేశాలు తిరిగి కనుక్కుని తయారు చేస్తున్నాయి. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు చేస్తున్న ఇలాంటి పరిశోధనలను రివర్స్ ఇంజనీరింగ్‌తో ఎక్కడ కాపీ కొట్టేస్తారోనని భయపడుతున్నారు. ఇది నూతన ఆవిష్కరణ కిందికి రాదు. ఇలా ఇండియా, చైనాలు ఎక్కడో కనుక్కున్న వాటిని తిరిగి కనుక్కుని, ఉత్పత్తి చేసి మార్కెటింగ్ చేస్తున్నాయి. దీనివల్ల తనకు తాను కాస్త ఎదుగుతుందే గాని, ప్రపంచానికి కొత్తగా అందించేదేమీ వుండదు. అందువల్లనే, గత రెండు వందల సంవత్సరాలుగా భారతదేశం వెనుకబడి పోతూ వస్తున్నది.

భారతదేశం ప్రపంచ దేశాల స్థాయిలో అభివృద్ధి చెందాలంటే ఏం చేయాలి? అమెరికా, యూరప్ దేశాల కన్నా, ముందుగా సైంటిఫిక్ రీసెర్చ్, ఇన్నోవేషన్ సాధించి తాను ఉత్పత్తి, మార్కెటింగ్ చేస్తూ ప్రపంచానికి కూడా అందించగలగాలి. నిరుపేద ప్రజలు ఈ సమాజం అంటే, రాజకీయాలంటే, సైన్స్, టెక్నాలజీ, అభివృద్ధి అంటే ఏమిటో తెలుసుకోవడానికి అందరికీ ఉన్నత విద్యతో పాటు ఆధునిక విజ్ఞానాన్ని అందరికీ అందించాలి. అప్పుడే వారి ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందుతాయి. సంపద ఎన్నో రెట్లు పెరుగుతుంది. ప్రతి మహిళ కనీసం పదహారేళ్ల డిగ్రీ చదువు తప్పకుండా చదివే విధంగా ప్రణాళికలు రూపొందించడం అవసరం. మధ్య తరగతి జీవన ప్రమాణాల స్థాయిలో కూడు, గుడ్డ, నీడ అవసరాలు అందరికీ సాధించడం ద్వారానే దేశం సంపన్నమవుతుంది. విద్య, వైద్య, ఆరోగ్య, గృహ వసతి రంగాల్లో ఖర్చు తక్కువతో, ఎక్కువ ఫలితాలు సాధించే విధంగా పరిశోధనలు సాగించాలి. ప్రజలను విద్యతో పాటు ఆధునిక, సామాజిక విజ్ఞానాన్ని అందించి ఆధునిక పౌరులుగా తీర్చదిద్దగలిగినప్పుడే అన్ని రంగాల్లో కొడిగట్టిన రీసెర్చ్ ముందుకు సాగి, దేశం అభివృద్ధి చెందుతుంది.

– 'వార్త' దినపత్రిక ఆగస్టు, 2009 సంచిక సౌజన్యంతో

11. ఇండియాలో మౌలిక పరిణామాల ఆవశ్యకత

భారతీయ సమాజంలో మౌలిక పరిణామాలు రావడం అవసరం. అవి సమాజాన్ని, ప్రపంచాన్ని ఉన్నతీకరిస్తాయి. అందరినీ అపూర్వంగా ఎదిగిస్తాయి. మానవుల్లో దాగివున్న మహత్తరమైన సృజనాత్మక శక్తులను, సైన్సును, అనుభవాలను వెలికి తీస్తాయి.

ఈ దేశంలో మౌలిక పరిణామాలంటే వేలయేళ్ల కుటీర వృత్తుల నుండి, కులవృత్తుల నుండి శ్రామికులను పారిశ్రామిక ఉత్పత్తి రంగాల్లోకి మార్చడం. పారిశ్రామిక రంగాలకు యజమానులుగా భాగస్వాములను చేయడం. ఆయా వృత్తులను ఉత్పత్తి పెంచే విధంగా శ్రమశక్తి తగ్గే విధంగా ఆధునీకీకరించడం. అందుకు ఈ దేశానికి అనువైన, అవసరమైన ప్రత్యేక అభివృద్ధి, ఉత్పత్తి నమూనాలను స్వయంగా రూపొందించుకోవడం, పెట్టుబడిని సామాజీకరించడం. విద్యా, వైద్యం, గృహవసతి, రవాణా సౌకర్యాలు, కూడు, గుడ్డ మొదలైనవి మధ్యతరగతి జీవన ప్రమాణాల స్థాయిని ఆయా పాతవృత్తుల్లో, చిన్న వృత్తుల్లో కూరుకుపోయిన వారు, గ్రామీణ ప్రజలు కూడా ఎదిగి సాధించుకోవడం. ఇందుకు చిత్తశుద్ధి, బడ్జెట్లలో కేటాయింపు చాలు. కానీ అదే లోపించింది.

కుటుంబం ప్రాతిపదికగా, వ్యక్తి ప్రాతిపదికగా వారిని ఎదిగించడం ప్రాతిపదికగా, బడ్జెట్లను కేటాయించి వుంటే ఈ అరవై ఏళ్లలో అందరూ ఎదిగి వుండేవాళ్లు. అందరూ ఎదగకుండా కొందరు ఎదగడానికి మాత్రమే బడ్జెట్లను కేటాయించారు. కాగా ప్రజల డబ్బుతో కొందరు సంపన్న వర్గాలుగా, మధ్య తరగతిగా ఎదుగుతూ వచ్చారు. పేద ప్రజల రక్తమాంసాలు వారి అభివృద్ధిలో, ఎదుగుదలలో కలిసి వున్నాయి. పేదరికానికి, వారి ఆకలి చావులకు కారకులెవరు? అభివృద్ధి అందుకున్న వారే, సంపన్నులే సర్వ అనర్థాలకు కారకులని వామపక్షాలు చెపుతుంటాయి. చాలా మేరకు అది సత్యం.

దాంతో పాటు పేదరికంలో ఉండడానికి మరెన్నో కారణాలు కూడా ఉన్నాయి. వెనుకబడిపోయిన పాత ఉత్పత్తి విధానాలు, ఆహార సేకరణ దశల్లో జీవించడం పేదరికానికి కారణమవుతున్నది. అలాంటి సందర్భాల్లో ఎవరూ దోపిడీ చేయకుండానే పేదరికంలో ఉండిపోవచ్చు. ఆదివాసీ గిరిజనులు అడవుల్లో బతుకుతున్నారు. దళితులు, శూద్ర వృత్తికులాలు, సేవా కులాలు గ్రామ పరిసరాల్లోనే బతుకుతున్నారు. వారి ఉత్పత్తి, సామర్థ్యం వేలయేళ్ల నాటిది. ఆధునిక ఉత్పత్తి చైతన్యం వారికి అందలేదు. గిరిజనులు ఎకరాకు మూడు క్వింటాళ్లు పండిస్తుంటారు. అదే పంజాబులో 30 క్వింటాళ్లు పండిస్తారు. ఇలా చేతివృత్తుల్లోను, కులవృత్తుల్లోను ఉత్పత్తి సామర్థ్యం పారిశ్రామిక ఉత్పత్తితో పోటీపడలేక వెనుకబడిపోయి పేదరికంలో కూరుకుపోతున్నారు.

ఇలాంటి వారిని ఎవరో దోపిడీ చేయడం ద్వారా పేదలయ్యారని చెప్పడానికి లేదు. పాత జీవన వ్యవస్థల్లో, ఉత్పత్తి విధానాల్లో ఉండిపోవడం వల్ల తమకు తామే పేదలుగా మిగిలిపోతున్నారు. వీరి వృత్తులు మార్చుకోవాలని ఆధునిక వృత్తులు, ఆధునిక విద్య పోటీపడి అందుకోవాలని, చైతన్యాన్ని అందించే బదులుగా ఆ వృత్తుల్లో గొప్ప నైపుణ్యం ఉన్నదని, పవిత్రమైనవని కొందరు హిందూమత తత్వవాదులు చెబుతూ వుంటారు. మరికొందరు ఆ వృత్తిలో గిట్టుబాటు కూలి, జీతాలు పెరగాలని, వృత్తి సంఘాలను, ట్రేడ్ యూనియన్లను పెట్టి ఆధిపత్యం చెలాయిస్తుంటారు. అంతేగాని వీళ్లెవరూ ఆ వున్న వృత్తులు వదిలేయాలని విద్య అందుకుని కొత్త నైపుణ్యాలు సాధించుకుని ఆ వృత్తిలోంచి బైటపడాలని చెప్పరు. పాలేరుకు, కూలీకి జీతం పెంచాలని కోరతారు. పాలేరుగా, కూలీగా వుండే జీవితమే అక్కర్లేదని చదువుకొని ఎదగడానికి ప్రభుత్వాలను నిలదీయాలని తామే పాఠశాలలు, కళాశాలలు నెలకొల్పి విద్యావంతులను చేద్దామని అనుకోరు, చెప్పరు.

వీళ్లందర్నీ పైకి తీసుకురావాల్సింది ఎవరు? సమాజమే! అభివృద్ధి పథంలో ముందుకు నడపాల్సింది ఎవరు? ప్రభుత్వాలు ఈ బాధ్యత తీసుకోకపోతే ఆ ప్రభుత్వాలు ఎందుకు? ప్రభుత్వాలకు ఆధునిక జ్ఞానం, టెక్నాలజీ, భవిష్యత్ దర్శనం చేసే వందల, వేల మేధావులు, శాస్త్రవేత్తలు సేవలందిస్తుంటారు. వాటిని సమన్వయపరచి ముందుకు తీసుకెళితే చాలు. ఆ పని కూడా చేయకుండా వారి వర్గం, కులాధిపత్యం నిలబెట్టుకోవాలనే వెనుకబడిన ఆలోచనా విధానం అడ్డుకుంటున్నది. ప్రజలు ఎదిగితే తామెదుగుతాం. ప్రజలు కొంటే తమకు లాభాలు వస్తాయి అనే దృష్టి కోల్పోయిన వెనుకబడిన ఫ్యూడల్ కులాధిపత్య భావజాలంలో కూరుకుపోయిన పరిపాలక వర్గాలు, ప్రభుత్వ అధికారులు, పేదలు పేదలుగా మిగిలిపోవడానికి ఎదగకపోవడానికి ప్రధాన కారణం. ఎదిగిన వాళ్లు ఎదగాల్సిన వాళ్లను పట్టించుకోకపోవడం మరొక ప్రధాన కారణం.

గింజ ఎంత గట్టిదైనా సారవంతమైన నేల, నీరు, ఎండ ఉన్నప్పుడే మొలకగా, మహావృక్షంగా ఏపుగా పెరుగుతుంది. గింజ గట్టిగా సామర్థ్యం గల గింజగా ఎదగాలన్నా మళ్లీ ఇవన్నీ అవసరం అవుతాయి. అలాగే తల్లి మానవ సమాజానికి పురుడు పోయడానికి తొమ్మిది నెలలు తన కడుపులో పెట్టుకొని పెంచుతుంది. తరువాత పాలిచ్చి, నడక నేర్పి, మాట నేర్పి స్కూలుకు వెళ్లే దాకా స్నానం, అలంకరణ, అన్నం తినిపించడం మొదలైనవన్నీ

తల్లే సవరిస్తుంది. సమాజమూ అంతే. సమాజం, ప్రభుత్వం ప్రజలను తల్లిలా ఎదిగిస్తేనే ఎదుగుతారు.

స్వయంగా ఎదగడం అవసరం. అందుకు ప్రయత్నం అవసరం. కష్టాల నుండి సాహసంతో, పట్టుదలతో ముందుకు సాగినప్పుడే విజయం సిద్ధిస్తుంది. అందుకు తల్లిదండ్రులు, తల్లిదండ్రుల వలే సమాజం, ప్రభుత్వాలు సహకరించడం అవసరం. తల్లిదండ్రులు పేదలైతే ప్రభుత్వంపై ఆ బాధ్యత మరింత పెరుగుతుంది. ఎదగాల్సిన వారిని, ఎదిగించాల్సిన వారిని ఎదగడానికి ఒక తల్లి తన కడుపును మానవ సమాజం పురుడు పోసుకోడానికి రిజర్వు చేసినట్టుగా సమాజంలో రిజర్వేషన్లు అనివార్య మవుతాయి. అక్బర్ ఒకసారి రాణులకు చెలికత్తెలను, ఇతర సౌకర్యాలను రద్దు చేసాడట. ఏం చేయాలో తోచక మహామంత్రి బీర్బల్‌ను సలహా అడిగారు. బీర్బల్ రాజభవనంలోని పూలతోటలకు నీళ్లు పెట్టడం బంద్ పెట్టించండని సలహా ఇచ్చాడు. పూలతోటలు వాడిపోవడం చూసి అక్బర్ ఇదేమిటని ప్రశ్నించాడట! అడవిలో చెట్లకు, పొదలకు, పూలకు ఎవరు నీళ్లు పోస్తున్నారు అవి పెరగట్లేదా అని రాణులు ప్రశ్నించారట. అక్బర్ తన పొరపాటు గ్రహించి తిరిగి అన్ని ఏర్పాట్లు చేసాడట. అడవి వేరు, పౌర సమాజం వేరు. అడవి మనుషులు పౌరసమాజంగా మారుతూ వస్తున్నారు. అందువల్ల మానవులు పెంచుకునే తోటలకు, చెట్లకు, పొలాలకు నీళ్లు, రక్షణ ఎలా అవసరమో, పేదకులాలకు రిజర్వేషన్లు అలాగే అవసరం.

స్వయంగా ఎదగడానికి

ప్రభుత్వంపై ఆధారపడకూడదని, స్వయంగా ఎదగాలని, అగ్రకుల, బ్రాహ్మణీయ, హిందూమత తత్వవాదులు చిలకపలుకుల సిద్ధాంతాలు చెబుతారు. వాళ్లు అది బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఎదగకుండా అలాగే వెనుకబడిన సమాజంగా జీవించాలని అభివృద్ధి సంపద, సౌకర్యాలు, అధికారాలు అన్నీ అగ్రకులాలే అనుభవించాలని చేసే సిద్ధాంత చర్చ ఇది. నిజంగా వాళ్లు స్వయంగా ఎదగాలనే కోరుకుంటే తమ సంపదను, ఆస్తిని వారసత్వంగా తమ పిల్లలకు గానీ, ఇతరులకు గానీ ఇవ్వడానికి వీల్లేకుండా సమాజపరం, ప్రభుత్వపరం అయ్యే విధంగా చట్టాలను, సాంప్రదాయాలను రూపొందించడం అవసరం. రిజర్వేషన్ వ్యతిరేకులు తమ సంపదను, ఆస్తులను వారసత్వంగా తమ సంతానానికి గాని, బంధుమిత్రులకు గాని ఇచ్చే అవకాశం లేకుండా చేసి స్వయంగా తమ పిల్లలు తమ ఆసరా, ఆధారం లేకుండా ఎదిగేటట్టు చూడాలి. అలా చేయకుండా సంపన్న తల్లిదండ్రుల పిల్లలపై సమానంగా స్వయంగా పేద తల్లిదండ్రుల పిల్లలు ప్రభుత్వ ఆసరా, సమాజం ఆసరా లేకుండా ఎలా ఎదుగుతారు? అని ప్రశ్నించే, నిలదీసే సాహిత్యం, సంస్కృతి చాలా తక్కువ వెలువడింది. రిజర్వేషన్ల ఆవశ్యకత ఉన్న కులాల నుండి రాసేవాళ్లు రాకపోవడమే ప్రధాన కారణం.

అగ్రకులాల వాళ్లు, సంపన్న కులాల వాళ్లు, హిందూ మతతత్వ వాదులు, చివరకు బీసీల్లో కొంత ఎదిగిన వ్యక్తులు కూడా సామాజిక సంక్షేమ పథకాలను, ఉచిత విద్యను, హాస్టళ్లను, బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తారు. హిందువులందరికీ తామే ప్రతినిధులమని

చెప్పే వీళ్లు హిందూ వ్యతిరేకులే. తమ అగ్రకులాల, సంపన్నుల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం మొత్తం సమాజాన్ని తప్పుదారికి నడిపించే చాకచక్యంతో అందుకు మతాన్ని, ప్రాచీన సాహిత్యాన్ని మద్దతుగా ఉపయోగిస్తుంటారు. కులవృత్తులు మానేయాలని వీరు చెప్పకపోగా పాతశ్లోకాలతో కర్మ, పునర్జన్మ సిద్ధాంతాలతో ప్రతివృత్తి పవిత్రమైనదని చిలకపలుకులతో కులవ్యవస్థను, కులవివక్షను, కులవృత్తులను అలాగే వుండాలని కోరుకుంటారు, సమర్థిస్తుంటారు. అసమానతలను పెంచిపోషిస్తుంటారు.

ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వయంగా ఎదగాలంటే ఏం చేయాలి? వాళ్లు సంపన్నులను ఆస్తి సంపద వారసత్వంగా అందించే అవకాశం లేకుండా చట్టాలు చేసి ప్రభుత్వపరం చేయాలి, సమాజపరం చేయాలి. అప్పుడే అందరు సమాన స్థితిలో సమానంగా, స్వయంగా ఎదిగే కృషిలో పోటీపడే సమాజం ఏర్పడుతుంది. అందువల్ల అగ్రకుల, బ్రాహ్మణీయ, హిందూమత తత్వవాదులు ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వయంగా ఎదగాలని కోరడానికి ముందుగా వామపక్షాల కన్నా గట్టిగా ఆస్తి సంపద వారసత్వంగా ఎవరికీ చెందడానికి వీల్లేదని ఉద్యమించడం అవసరం. చట్టాలు చేయడం అవసరం. ఈ పని చేయకుండా పేదలు ప్రభుత్వంపై ఆధారపడకుండా స్వయంగా ఎదగాలని చెప్పడం అప్పనంగా అన్ని అవకాశాలను, అధికారాలను సంపన్నులకు, సంపన్న కులాలకు రిజర్వు చేయడానికే. తరతరాలుగా భవిష్యత్తులో కూడా వర్ణ, కుల ఆధిక్యతా వాదులే మళ్లీ, మళ్లీ అధికారంలోకి రావడానికి, అనుభవించడానికి చేస్తున్న సిద్ధాంతాలే. ఇలాంటి దృష్టిని సెక్యులర్ పేరిట కాంగ్రెస్ బయటికి చెప్పదు. కానీ ఆచరించేది అదే. అందువల్ల పదేళ్లలో అందరు ఒకేస్థాయిలో అద్భుతంగా ఎదిగే అవకాశాలు సృష్టించే బదులుగా ఆధిపత్య కులాలు, సంపన్న వర్గాలు మాత్రమే అన్నిట్లో అత్యున్నత స్థాయికి ఎదిగే విధంగా లైసెన్సుల విధానాన్ని, బ్యాంకు పరపతి విధానాన్ని, కాంట్రాక్టుల విధానాన్ని, పరిశ్రమల జాతీయాన్ని, వనరుల జాతీయాన్ని, బడ్జెట్ల కేటాయింపులను నిర్ణయిస్తూ, నిర్దేశిస్తూ వచ్చారు.

అలా స్వాతంత్ర్యానంతరం కొన్ని కులాలు సంపన్న కులాలుగా మారుతూ వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, రాజుల, వెలమ, వైశ్య కులాలు సంపన్న కులాలుగా ఎదుగుతూ అన్ని రంగాల్లో ఆధిక్యతను సాధించుకుంటూ ముందుకు సాగి స్థిరపడ్డాయి. రాజకీయ రంగంలో బ్రాహ్మణులు, వైశ్యులు క్రమంగా 1980 నాటికి పూర్తిగా వెనుకబడి పోయినప్పటికీ కేంద్రం స్థాయిలో, ఉద్యోగ, ఇతర రంగాల్లో వారు కూడా పోటీపడి ఎదుగుతు న్నారు. సాహిత్యం, కళలు, సినిమా, టీవీల్లోను పారిశ్రామిక, కాంట్రాక్టు, వ్యాపార రంగాల్లోను వీరే. అందువల్ల వీరి జీవితాలే సామాజిక పరిణామాలుగా చిత్రించబడ్డాయి, చర్చించబడ్డాయి.

సామాజిక అర్థశాస్త్రం పుస్తకంలో వివరంగా వర్ణించినట్టుగా ప్రభుత్వం సహకరిస్తే సహకార పద్ధతిలో అందరూ ఇల్లు కట్టుకోవడం అయిదేళ్లలో పూర్తవుతుంది. పూరి గుడిసెలంటూ ఇళ్లు లేని వాళ్లంటూ కనపడరు. మేధావులు, ప్రణాళికా కర్తలు, ప్రభుత్వాలు, ఉద్యమ కారులు, ప్రభుత్వాధికారులు ఈ కర్తవ్యం పట్ల నిర్లక్ష్యం వహించారు. లేదా చేయాల్సినంత చేయలేకపోయారు.

గ్లోబలీకరణ జరిగి ఉండకపోతే ఈ స్వార్థపూరిత సంపన్న కులాల, వర్గాల బ్రాహ్మణీయ, హిందూమత తత్వవాదుల, సెక్యులరిస్టుల, వామపక్షీయుల నిర్లక్ష్య క్రమం ఇంకా ఎన్ని దశాబ్దాలు కొనసాగించే వారో! వేల ఏళ్ల నుండి గ్రామీణులు, గిరిజనులు ఇప్పటికీ అలాగే బతుకుతున్నట్టుగా ఈ ప్రభుత్వాలు వెనుకబడిపోయిన వారిని అదే దశలో నడవనీ అని, బతకనీ అని బండి లాగించేసే వాళ్లు. కానీ గ్లోబలైజేషన్ వచ్చి పడింది. లక్షలాది యువతరానికి కొత్త ఉపాధి అవకాశాలను తెరిచింది. జాతీయ నాయకులు 150 ఏళ్ల క్రితం విదేశాలకు వెళితే మధ్య తరగతి వారి సంతానం 1995 నుండి లక్షలాది మంది విదేశాలకు వెళ్లే అవకాశం వచ్చింది. జీవితాన్ని గెల్చుకునే అవకాశం పెరిగింది. అలా 150 ఏళ్ల తరువాత ఎందరికో అభివృద్ధి ఫలాలు కొత్తగా అందడం మొదలయింది. ఇది ఒకవైపు ఆనందించాల్సిన విషయం. ప్రపంచంతో పోటీపడడంతో పాటు సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచమే భారతదేశాన్ని గౌరవ ప్రదంగా చూసే చూపుకు ఎదిగింది.

గ్లోబలైజేషన్ భారతదేశంపై ఒక గొప్ప సవాల్‌ను విసిరింది. 30 కోట్ల మందిని కొత్త వృత్తుల్లోకి, అభివృద్ధిలోకి మారాల్సిన అనివార్యతను ముందుకు తెచ్చింది. లేకపోతే ఆకలి చావులు, ఆత్మహత్యలు, అంతదాకా ప్రభుత్వ సబ్సిడీలపై ఆధారపడి చావలేక బతుకుతూ కొనసాగడం. ఇదీ నేడు ఇండియా, చైనా దేశాల్లోని ప్రజల ముందున్న సమస్య. ఈ సమస్యను ప్రజలు పరిష్కరించుకోలేరు. ప్రభుత్వమే అందుకు పూనుకుంటే ప్రజలు ఎదగడం సాధ్యపడుతుంది. ఇండియాలో 30 కోట్లు, చైనాలో సుమారు 20 కోట్లు, అమెరికాలో మూడు కోట్లు, ఆఫ్రికాలో మూడింట రెండు వంతుల జనాభా, దక్షిణ అమెరికాలో సగం జనాభా ఇలా ఎదగాల్సిన స్థాయిలో వున్నారు. ఇందుకు పూనుకోకపోతే వీరంతా ఆకలి చావులకు, ఆత్మహత్యలకు గురవుతారు. పేదరికంలో మగ్గుతారు. తీవ్రవాదం, సంఘవిద్రోహ శక్తులు పెరుగుతాయి.

ఇదంతా మన కళ్లెదుటే జరుగుతునే వచ్చింది. చివరికి అధిక సంఖ్యాలకు, వారికి బాధ్యత వహించే ప్రభుత్వాలకు గ్లోబలైజేషన్‌తో గొంతుమీదికి, ప్రాణం మీదికి వచ్చింది. గ్లోబలైజేషన్ ప్రారంభమైనప్పుడైనా ప్రారంభించాలని నా లాంటి వాళ్లు అంతర్జాతీయ మేధావి గెయిల్ ఓమ్‌విద్ లాంటి వాళ్లు పలు విధాలుగా స్పష్టం చేశారు. వారిని వామపక్ష మేధావులు అమెరికా ఏజెంట్లు అని కూడా ప్రచారం చేశారు. కానీ నిజమైన అమెరికన్ ఏజెంట్లుగా, పాలకవర్గాల ఏజెంట్లుగా, పాలకవర్గాల్లో భాగస్వాములుగా, రాజ్యానికి దళారులుగా వారే అద్భుతంగా పనిచేశారు. ప్రజల పక్షం వహించినట్లుగా నటిస్తూనే ఈ పని కావించారు. ప్రజలను అభివృద్ధిలోకి తీసుకురావడానికి ఏమీ చేయలేకపోయారు.

తెలుగు నేలలోని భారతీయ మేధావులు కొందరు గ్లోబలైజేషన్‌ను ఆహ్వానించారు. అదే సమయంలో కులవృత్తులను, పాతవృత్తులను వదిలేసి ఆధునిక వృత్తులు చేపట్టాలని ప్రభుత్వాలు అందుకు ప్రణాళికలు వేయాలని తీవ్రంగా ప్రచారం చేసారు. వామపక్షాల వారు, అగ్రకులాల వాళ్లు, హిందూ మతతత్వవాదులు తమ 'రణ', గొణ ధ్వనితో వాటిని వినపడకుండా చేయాలనుకున్నారు. దీన్ని గమనించి బీసీ, ఎస్సీ, ఎస్టీ మేధావులు, రచయితలు భావజాల యుద్ధం ప్రకటించారు. తమ ఎదుగుదల పట్ల, కులవివక్ష వల్ల ఎదురవుతున్న

సమస్యల పట్ల వున్న నిశ్శబ్దాన్ని బ్రద్దలు కొట్టారు. నగారా మోగించారు. వాళ్ల చెవులు చిల్లులు పడేటట్లు వినిపించారు. దాంతో పట్టించుకోక తప్పలేదు. అందరికీ ఓటు హక్కు ఉండడం వల్ల ప్రజల అవసరాలకు, ఆకాంక్షలకు ఇలా తల ఒగ్గాల్సి వచ్చింది.

దేశీయ పరిణామాలు మూలాలు-పరిష్కారాలు

అంతర్జాతీయ పరిణామాల ప్రభావాలు చొచ్చుకు వస్తూ ఢిల్లీ నుండి గల్లీ దాకా విస్తరించాయి. ఆ నేపథ్యంలో అంతర్గత దేశీయ, స్థానిక పరిణామాల ప్రభావాలను కూడా పరిశీలించడం అవసరం. కొందరు అంతర్జాతీయ పరిణామాలను, ప్రభావాలను వర్ణించి, విశ్లేషించి అంతర్గత, దేశీయ పరిణామాలను, ప్రభావాలను విశ్లేషించకుండా వదిలేస్తున్నారు. అది ప్రయత్న పూర్వకంగా చేస్తున్న తప్పిదం. వాటిని పట్టించుకుంటే తమ ప్రయోజనాలు దెబ్బతింటాయి లేదా కోల్పోవాల్సి వస్తుంది. మనుషులందరినీ తమతో సమానంగా గౌరవించాల్సి వస్తుంది. సమాన అవకాశాలు కల్పించాల్సి వస్తుంది. తమకున్న ఆధిక్యతను వదులుకోవాల్సి వస్తుంది.

అందుకని ఎప్పుడూ అటువైపు వేలుపెట్టి చూపిస్తారు. అసలు కారణాలను మరిపిస్తారు. వెనకట దేవుళ్ల పేరు చెప్పి, మతం పేరు చెప్పి, కర్మ, పునర్జన్మ పేరు చెప్పి మభ్య పెట్టి అసలు కారణాలను మరిపించే వారు. ఇప్పుడు అంతర్జాతీయ పరిణామాలను, కారణాలను చూపి అసలు కారణాలను మరుగు పరుస్తారు. మభ్యపెడతారు. వాస్తవంలో యథాతథ స్థితిని కొనసాగించడానికి తోడ్పడతారు, పూనుకుంటారు. తోడ్పడేది వామపక్షీయులైతే పూనుకునేది బ్రాహ్మణీయ, హిందూత్వ, ముస్లిమ్ మతతత్వ భావజాలీయులు. తమకు తెలిసీ తెలియక అగ్రకులాలపై ఉండే గౌరవంతో మిగతా వారు కూడా వీరికి సహకరిస్తూ ఉంటారు.

సామాజిక పరిణామాల్లో, కొందరి ఎదుగుదలలో, మరికొందరి పేదరికంలో కులం, మతం, ప్రాంతం, మెట్ట, తరి భూములు, వృత్తులు, కులవృత్తులు, ఆధునిక విద్య అందడం, అందకపోవడం, సాంప్రదాయాలు, సంస్కృతి, పేదరికం, మానవ సంబంధాల స్థానమేమిటి? ప్రభావాలు, పరిణామాలు ఏమిటి? అని పరిశీలించని అంతర్జాతీయ పరిణామాల చర్చ, విశ్లేషణ పలాయనవాదాన్ని, యథాతథ స్థితిని కోరుకునే వాళ్లు చేస్తున్న పని.

ప్రభుత్వాధికారం, పరిశ్రమలు, భూములు, వ్యాపారాలు, కాంట్రాక్టులు, బ్యాంకులు, సంపద, సాహిత్యం, కళలు, సామాజిక శాస్త్రాలు, స్టాక్‌మార్కెట్లు, హోల్‌సేల్ మార్కెట్లు, విద్యావిధానం, వైద్యం, మీడియా ఎవరి చేతుల్లో ఉన్నాయి. అవి చిన్న కులాల చేతుల్లోకి ఎంతమేరకు వచ్చాయి. జనాభా నిష్పత్తి ప్రకారం చూస్తే 70 శాతం దాకా ఇవన్నీ వీరి చేతుల్లోనే ఉండాలి. అందుకనువుగా స్వాతంత్ర్యానంతరం ఏం చర్యలు తీసుకున్నారు? ప్రైవేటీకరణ, గ్లోబలీకరణలో మరి ఎన్ని చర్యలు తీసుకున్నారు? ఎందుకు తీసుకోలేదు? ఎలా అయితే చర్యలు తీసుకుంటారు? అందుకు ప్రణాళికలు ఏమిటి?

పారిశ్రామిక పూర్వ సమాజంలో అనగా వ్యవసాయ సమాజంలో ఆయా కులాలు, ఆయా వృత్తులను వంశపారంపర్యంగా చేస్తూ వచ్చాయి. శతాబ్దాల తరబడి నైపుణ్యాన్ని పెంచుకున్నాయి. ప్రపంచానికి అందించాయి. పారిశ్రామిక విప్లవం ద్వారా పారిశ్రామిక

యజమానులుగా ఆయా కులాల వాళ్లే ఎందుకు ఎదగలేదు? వలస ప్రభుత్వంలో ఏదో జరిగింది. స్వాతంత్ర్యానంతరమైనా ఎందుకు జరగలేదు? చెప్పుల పరిశ్రమ చెప్పులు చేసే వృత్తి కులాల నుండి ఇతర కులాల చేతుల్లోకి ఎలా వెళ్ళింది? ఎందుకు వెళ్లింది? దాన్ని ఎందుకు నిరోధించలేదు? ఇలా ఏయే రంగాల్లోకి ఇతర కులాల వాళ్లు చొరబడ్డారు? ఆర్థికంగా గిట్టుబాటయ్యే సమస్త రంగాల్లోకి పై కులాలవాళ్లు చొరబడ్డారు కానీ వృత్తి కులాల వారిని ఇతర రంగాల్లోకి రానివ్వలేదు. ఇది పద్ధతి ప్రకారం వాళ్లు అమలు జరిపారు.

శతాబ్దాల తరబడి విశ్వకర్ములు (పంచతాయీలు, పంచాననులు) ఇనుము, ఇత్తడి, బంగారం మొదలైన లోహాల వెలికి తీతలో, సానబెట్టడంలో ప్రపంచానికి మార్గదర్శకులయ్యారు. పారిశ్రామిక విప్లవంలో ఇవి వీరిని ఆయా పరిశ్రమల యజమానులుగా ఎందుకు మార్చలేదు? అవి ఆయా కులాలకు కాకుండా ఇతర కులాల వాళ్ల చేతుల్లోకి ఎలా వెళ్లాయి? వెళ్ళాయి సరే! తిరిగి ఆయా కులాలకు వాటి యాజమాన్యం హస్తగతం అయ్యే విధంగా చట్టాలు, బ్యాంకుల సహకారం ఎందుకు రూపొందించలేదు? అలాగే శతాబ్దాల తరబడి బట్టలు నేసిన నేత కులాలు బట్టల పరిశ్రమ యజమానులుగా మారకుండా ఇతర కులాల వాళ్లు ఎలా వచ్చారు? ఎందుకు రానిచ్చారు? తిరిగి వారి పరం ఎందుకు చేయలేకపోయారు? ప్రైవేటీకరణలో ఇలా ఆయా కులాల కులవృత్తుల పరిశ్రమలన్నీ ఆయా కులాలకు ఎందుకు ప్రైవేటీకరించలేదు? అనే అవగాహన పెరుగుతూ వచ్చింది. వృత్తి కులాల వారీ ఆత్మహత్యల వైపు, బిచ్చగాళ్లుగా మారడానికి పురికొల్పారు.

వామపక్షాలు, సెంట్రిస్టులు, రైటిస్టులు, హిందూ మతతత్వవాదులు, కులాలు లేకపోతే ఎలా అని మనసులో తడబడే వాళ్లు గ్లోబలైజేషన్ పరిణామాల్లో ఇలా ఆలోచించలేకపోయారు. ఆయా వృత్తి కులాల్లో పుట్టి, ఎదిగిన మేధావులు వచ్చి ప్రశ్నించే దాకా ఇదొక చర్చనీయాంశమని కూడా వారికి తోచలేదు. గ్లోబలైజేషన్‌లో ప్రైవేటీకరణ అంటే శతాబ్దాల తరబడి ఆయా వృత్తులను చేస్తూ వచ్చిన ఆయా కులాల, సామాజిక వర్గాల వారికి వాటిని దశల వారీగా ప్రైవేటీకరించి అప్పగించడమే అని నిర్వచించడం. అడవులు ఆదివాసులకే చెందాలి. సెజ్‌ల చట్ట పరిధిలో ఆయా ప్రాంతాల ప్రజలకే ఆయా భూములను, అడవులను, గనులను, వనరులను, ప్రాజెక్టులను, పరిశ్రమలను, ఉత్పత్తి సేవా రంగాలను ప్రైవేటీకరించి సహకార పద్ధతిలో చేసుకోడానికి కేటాయించాలి. రియల్ ఎస్టేట్ చట్టాల ప్రకారం వారికి ఆయా భూములు తీసుకున్నందుకు 25-40 శాతం దాకా ఓనర్ షేర్ ఉండే విధంగా కోరాలి. గ్లోబలైజేషన్‌లో ప్రైవేటీకరణ అంటే ఇలా ఆలోచించాలి.

ఎదిగిన సామాజిక వర్గాలు వారి లాగా ఎదగడం గురించి గాని, జీవితం గెలుచుకోవడం గురించి గాని, అందుకు అవసరమైన మెళకువలు, చైతన్యం గురించి గాని, ఎక్కడా చెప్పరు. ఏ ప్రక్రియల్లోను రాయరు. కేవలం వ్యాపార ప్రచురణ కర్తలు ఈ విషయాలను పత్రికల ద్వారా, పుస్తకాల ద్వారా అందించారే గాని ప్రజల గురించి, వారి మేలు గురించి మాట్లాడుతున్నామనుకునే వాళ్లు అందించే కృషి చేయలేదు. చేయకపోగా ఇది అశాస్త్రీయ విద్యా విధానమని నిరుద్యోగులను తయారు చేస్తుందని చేసే వృత్తికి చదివే

చదువుకి సంబంధం లేదని చదువు పట్ల నిర్లక్ష్యం పెరిగే విధంగా చేస్తుంటారు. చదువును అశ్రద్ధ చేసి ఆ తరువాత వీళ్లకి జెండాలు మోసే వాళ్లుగా, జై కొట్టేవాళ్లుగా, వాళ్ళ సిద్ధాంతాలకు, ఉద్యమాలకు బలి పశువులయ్యే వాళ్లుగా మారుతూ ఉంటారు. సరిగ్గా దీన్ని సాధించడం కోసమే రకరకాల ఎత్తుగడలు, సిద్ధాంతాలు రూపొందిస్తారు. వాళ్లు జీవిస్తున్న జీవితాన్ని ఎలా గెలుచుకున్నారో రచయితలుగా, మేథావులుగా, ప్రొఫెసర్లుగా, జర్నలిస్టులుగా, అధ్యాపకులుగా ఎలా ఎదిగారో అలా ఎదగడానికి మార్గదర్శకం మాత్రం అందించరు. అవి రహస్యం చేస్తారు. ప్రజలను చీకట్లో వుంచుతారు. తాము చెప్పిందే కరెక్టు అనే విధంగా అజ్ఞానాన్నే జ్ఞానంగా భ్రమించే అహంకారానికి, ఆత్మవిశ్వాసానికి గురి చేస్తారు. హిందూమత తత్వవాదులు, ముస్లింమత తత్వవాదలు ఇంకో రెండాకులు ఎక్కువ చదివారు. మతం పేరిట పేదలను ఎదగకుండా చేస్తుంటారు. మతమౌఢ్యం వైపు నడిపిస్తారు.

భారతదేశంలో 30 కోట్ల మంది ప్రజలను పాతవృత్తుల నుండి, గిట్టుబాటు గాని కులవృత్తుల నుండి, చిన్నవృత్తుల నుండి, కుటీర పరిశ్రమల నుండి విముక్తం చేయాలి. వారందరినీ శిక్షణ ఇచ్చి కొత్త వృత్తుల్లో చేర్పించాలి. ఆధునిక విద్య అందరికీ అందినప్పుడు ఇది కొంత సులభమవుతుంది. ఆధునిక విద్య అందకపోయినా ఈ 30 కోట్లలో 15 కోట్ల మందికి కొత్త వృత్తుల్లో శిక్షణ ఇచ్చి ఎదిగించడం సాధ్యమే. ఇవేవీ ప్రభుత్వాలు చేయలేదు. రోగి పాలే కోరాడు. డాక్టరు పాలే చెప్పాడు అన్నట్టుగా ఆ పాతవృత్తుల్లో, స్థానిక జీవితాలను వదలలేక ప్రజలు వాటినే కోరుకున్నారు. ప్రభుత్వాలు 'తథాస్తు' అలాగే కానీ అన్నాయి. ఇలా భారతదేశం ఆధునిక అభివృద్ధి, ఆధునిక విద్య, పెట్టుబడి, రాజకీయ అధికారం, తెలివి అందుకున్న వాళ్ళు పాత కులవృత్తుల్లో జీవిస్తున్న వాళ్ళు, పట్టణ, గ్రామీణ ప్రజలుగా రెండుగా చీలిపోయింది. ఇప్పుడు ఒకే దేశంలో రెండు దేశాలు కొనసాగుతున్నాయి.

ఇల్లు అలకగానే పండుగ కాదు. ప్రపంచీకరణ సమస్త రంగాల్లో తెచ్చే మౌలిక మార్పులను గమనించాలి. స్వావలంబన దిశగా ఉపాధి కల్పనను, ఉత్పత్తి సేవా రంగాలను తీర్చిదిద్దుకోవాలి. బయటి నుండి వచ్చిపడే వాటితో పోటీపడి గెలిచే విధంగా దేశీయ సరుకులు, సేవలు, వాటి నాణ్యత పెరగాలి. ఈ విషయంలో ప్రభుత్వాల, ప్రణాళికా కర్తల అలసత్వం కోట్లాది ప్రాణాలకు ముప్పు తెచ్చింది. పేద ప్రజలకు ఈ విషయాలు తెలియవు. ఎందుకు ఎగుమతులు జరిగాయో, దిగుమతులు జరిగాయో, తమ ఉత్పత్తులకు, ముడి సరుకులకు, సేవలకు ధరలు ఎందుకు తగ్గాయో, పెరిగాయో వాటికి ఎగుమతి, దిగుమతులకు, దేశీయ ఉత్పత్తి స్థాయికి, బ్లాక్ మార్కెట్‌కు, హోల్‌సేల్ మార్కెట్‌కు, స్టాక్ మార్కెట్‌కు పార్టీల విరాళాలకు మధ్య సంబంధమేమిటో సామాన్య ప్రజలకు గానీ, మధ్య తరగతి జీవులకు గానీ పెద్దగా తెలీదు. ఇక పేదలకు ఏం తెలుస్తుంది? 1980లో ఒక ప్రభుత్వ పాలసీ మీద చర్చ చేస్తూ జార్జి ఫెర్నాండెజ్ దేశంలో నేత కార్మికులు ఆకలి చావులకు గురవుతారని, ఆత్మహత్యలు చేసుకుంటారని పార్లమెంటులో హెచ్చరించారు. ఆ పాలసీ అమల్లోకి వచ్చాక పదిహేను, ఇరవై సంవత్సరాలకు దాని ప్రభావాలు మొదలై ఇంకా కొనసాగుతునే వున్నాయి. ఇలా జీవితం మీదకి వచ్చి పడ్డాక దానికి బలికావడమే జరుగుతున్నది.

పాత ఉత్పత్తి విధానాల్లో సృష్టించే అదనపు విలువ ఎంత? సన్నకారు రైతు తన కోసమే పంట పండించుకుంటే అది సమాజానికి ఏ మేరకు ప్రయోజనం? తనకు తాను బ్రతకడానికే ఇలాంటి ఉత్పత్తి విధానాలు పరిమితంగా ఉపయోగపడతాయి. వాళ్లు తమ కోసమే బతుకుతున్నట్టు. వాళ్లు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి. అదనపు విలువను, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలి, పెంచుకోవాలి.

ఎదిగించాల్సిన క్రింది వారిని ఎదిగించి ఉంటే సంపద పెరుగుతుంది. తద్వారా దేశం సంపన్నమవుతుంది. పనిచేసే చేతులకు పని కల్పించడం అంటే పాత వృత్తుల్లో కూరుకుపోయేటట్టు చేయడం కాదు. ఆధునిక ఉత్పత్తి విధానాల్లో అధిక ఉత్పత్తిని సాధించి సంపద సృష్టించడమే... పనిచేసే చేతులకు పని కల్పించడం, వృత్తులను ఆధునీకరించడం.

ఆటలోనే పాల్గొనకపోతే గెలుపు లేదు, ఓటమి లేదు. ఉన్నచోటే ఉంటారు. గిరిజనులు గిరిజనులుగానే ఉండదలిస్తే గనులు, అడవులు, పొలాలు, ఉద్యోగాలు, కొత్తవృత్తులు, ఆధునిక అభివృద్ధి ఫలాలు అన్నీ ఇతరులే ఆక్రమిస్తారు. అమెరికన్లు అలాగే ఉండదలిస్తే చైనా, ఇండియా, జపాన్ వారే సాఫ్ట్‌వేర్ రంగాల్ని, మాన్యుఫాక్చరింగ్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ రంగాల్ని ఆక్రమిస్తారు. జీవితాన్ని ఓడిపోవాలనుకుంటే గెలిచే వారికి అభ్యంతరం వుండదు. కానీ ప్రజలకు జీవితాన్ని గెలుచుకోగలం, గెలవగలం అని నమ్మకం కలిగించినప్పుడే ఉత్సాహంగా ముందుకు వస్తారు. అందువల్ల ఆయా వర్గాల్లో, కులాల్లో, ప్రాంతాల్లో గెలిచిన జీవితాలను మార్గదర్శకంగా ముందుకు తీసుకురావడం, జీవితాన్ని గెలుచుకోగలం అనే ఆత్మవిశ్వాసాన్ని కలిగించడం చారిత్రక కర్తవ్యం.

హైదరాబాద్ నుండి వెలువడే 'నేటినిజం' తెలుగు దినపత్రిక 'సాహితీ కెరటాలు'లో 29-10-2009 నుండి 24-12-2009 మధ్య ప్రచురణ.

కృతజ్ఞతలు

నన్ను అమెరికా ఆహ్వానించి పలు రాష్ట్రాలను చూపించడంతో పాటు 60కి పైగా అమెరికా పుస్తకాలను అడిగిన వెంటనే తెప్పించి ఇచ్చిన పాణిగ్రాహి-సులేఖ, శ్రీకాంత్ - శైలజ... అమెరికాలో కూడా చేదోడు వాదోడుగా వున్న సహచరి శ్యామల, వియ్యంకుడు తేలు చంద్రమౌళీశ్వర్-సుగుణ .... న్యూజెర్సీలో, ఫిలడెల్ఫియాలో నేను వచ్చిన సందర్భంగా సదస్సులు, కాలిఫోర్నియాలో టెలీకాన్ఫరెన్స్ ఏర్పాటు చేసిన మిత్రులు, అందుకు కృషి చేసిన స్వామి వెంకట్ యోగి, మధు.కె.రెడ్డి, రవీందర్, జమున పుస్కూరు... సదస్సులో పాల్గొని అనేక విషయాలు చర్చించిన మిత్రులు...

వార్త, సూర్య, సాక్షి, నేటినిజం దినపత్రికల్లో ఈ వ్యాసాలను ప్రచురించిన సంపాదకులు.. ఇందులోని అనేక విషయాలను చర్చించిన మిత్రులు డా॥ కత్తి పద్మారావు, గూడూరి సీతారాం, ఏలే లక్ష్మణ్, దుర్గం రవీందర్, గూడ అంజయ్య, డి.పాపారావు, రాపోలు ఆనంద భాస్కర్, టంకశాల అశోక్, అంబటి సురేంద్రరాజు, జి.శ్రీరామ్మూర్తి, కల్లూరి భాస్కరం, హర్నాథ్, బైస దేవదాస్, గార్లకు... అందరికీ కృతజ్ఞతలు.

ప్రపంచం ఒక పెద్ద నగరంగా మారుతోంది
అందర్నీ ఒక్కటిగా దగ్గర చేస్తోంది

- సైన్సు, టెక్నాలజీ - సామాజిక పరిణామాల మధ్య సంబంధం వుంటుంది.
- కొత్త టెక్నాలజీ, సైన్సుతో శిథిలమవుతున్న వృత్తులు-సంస్కృతులు.
- **1946**కు ముందున్న ప్రపంచం వేరు - నేటి ప్రపంచం వేరు.
- అమెరికా ప్రజలు వేరు, ప్రభుత్వం వేరు - ఇండియా ప్రభుత్వం, ఇండియా ప్రజలు ఒకటి కాదు.
- బ్లాక్‌మనీ, స్విస్‌బ్యాంకుల నుండి ఇండియా నిధులను వాపస్ తీసుకుంటే ఎన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు కూలుతాయో!
- బంగారం కొనుగోలు ఇండియా ఆర్థిక వ్యవస్థను శిథిలం చేస్తున్నది.
- **1990** నుండి ఒక కొత్త తరం పారిశ్రామిక వేత్తలు మధ్య తరగతి నుండి ఎదిగారు. పాత పారిశ్రామిక వేత్తలు ఆలస్యంగా కళ్లు తెరిచారు.
- వెనకటి కాలమే బాగుండేదా? కరెంటు లేకుండా బస్సులు, రైళ్లు లేకుండా, ఫోన్లు, సినిమాలు, టీవీలు, పత్రికలు, బ్యాంకులు లేకుండా బతకడం సాధ్యమేనా?
- ఇండియాలో వలె అమెరికాలో ఎక్కడ పడితే అక్కడ చదువుకోవడానికి వీల్లేదు. ఏ ప్రాంతంలో ఉంటారో ఆ ప్రాంతంలోని స్కూల్లోనే చదువుకోవాలి.
- అమెరికాలో ఇంకో పదేళ్ళ తర్వాతైనా ఉచిత ఉన్నత విద్య , ఉచిత వైద్యం ప్రభుత్వం తరఫున ప్రవేశ పెట్టక తప్పదు. ఇండియా కూడా అనుసరించక తప్పదు.
- భారతదేశం ప్రపంచ దేశాల స్థాయిలో అభివృద్ధి చెందాలంటే ఏం చేయాలి? అమెరికా, యూరప్ దేశాల కన్నా, ముందుగా సైంటిఫిక్ రీసెర్చ్, ఇన్నోవేషన్ సాధించి తాను ఉత్పత్తి, మార్కెటింగ్ చేస్తూ ప్రపంచానికి కూడా అందించగలగాలి.
- నిరుపేద ప్రజలు ఈ సమాజం అంటే, రాజకీయాలంటే, సైన్స్, టెక్నాలజీ, అభివృద్ధి అంటే ఏమిటో తెలుసుకోవడానికి అందరికీ ఉన్నత విద్యతో పాటు ఆధునిక విజ్ఞానాన్ని అందరికీ అందించాలి. అప్పుడే ఉత్పత్తి శక్తులు, సంపద ఎన్నో రెట్లు పెరుగుతుంది.
- భారతీయ సమాజంలో మౌలిక పరిణామాలు రావడం అవసరం. అవి సమాజాన్ని, ప్రపంచాన్ని ఉన్నతీకరిస్తాయి. అందరినీ అపూర్వంగా ఎదిగిస్తాయి. మానవుల్లో దాగివున్న మహత్తరమైన సృజనాత్మక శక్తులను, సైన్సును, అనుభవాలను వెలికి తీస్తాయి.

పారిశ్రామిక విప్లవంతోనే కులవృత్తులు కాలం తీరిపోయాయా!
ఆధునికత అందుకోకపోతే చావేనా! పరుగెత్తిన వారికే ఫలితం!